భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

ఫిబ్రవరి 1970

★

సంపుటము : 47 : సంచిక : 2 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

ఫిబ్రవరి 1970

కవితా సాక్షాత్కారము	శ్రీ బెళ్లూరి శ్రీనివాసమూర్తి	1
ఓడలు - బళ్ళు	తమిళ మూలం: శ్రీ కా. నా. సుబ్రహ్మణ్యం; అనువాదం : శ్రీ బి. వి. సింగరాచార్య, శ్రీ వి. సభాపతి	3
సిరికొండ శిలాశాసనము	శ్రీ బి. ఎన్. శాస్త్రి	17
ఇపుడు వీస్తున్న గాలి	శ్రీ పరిగి రాధాకృష్ణ	27
పదం-పదాంశం	శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తి	30
జ్ఞానేశ్వరుడి కబ్బిన అదృష్టం	శ్రీ మా. గోఖలే	37
ఉత్తరావిలాపము	శ్రీ కాశూరి హనుమంతరావు	47
రామణీయకము	శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి	50
శాసనశబ్దకోశము	శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రి	60
బెర్ట్రాండ్ రస్సెల్	పరిశీలక్	68
గ్రంథవిమర్శలు		73

కవితా సాక్షాత్కారము

శ్రీ బెళ్లూరి శ్రీనివాసమూర్తి

1

హృదయంబు గరగి, కవితా సదనంబుగ మారు, భావసంయోగమునన్
సదమలమై పరవశగతి పొదలుం దనయంత మోదపూర్ణాకృతియై

2

అది వెల్లిలోక మచ్చుట కొదలేని విహారసౌఖ్యకూలంకష, స
మ్మదితుడగు సుకవి, లోకాభ్యుదయంబున శాంతిరసమహోదాత్తమతిన్

3

జీవనసంధాయిని జగతీవలయము పండజేయు దివ్యతరంబై
ప్రావృణ్మేఘంబై కవితావేశము—సుకవివరుల తపము ఫలింపన్

4

కవితాసుక్షేత్రగతవ్యవసాయము సల్పి సుకవి హాలికు డిడు ను
త్సవలీల సర్వజనులకు వివిధశ్రేయములు ధాన్య వితతింబోలన్

5

కావ్యజలధి యగాధమ్ము—కర్ణధారియగుచు నడిపించు, సుకవి భావైకనౌక—
అధివసించి ప్రయాణోన్ముఖులైన సుకృతు లవలి గట్టున సుఖశాంతు లందగలరు.

6

కవియే యోగివరేణ్యుడై జగతిలో గన్పించు చేదల్ల క్రిం
గి, వినూత్నామృతకావ్యమాధురులలో క్రీడింపగా జేయు మా

·1

నవసంఘంబు—మహోపదేశతతి నందంజేయు మాన ప్రవ
ర్తవ లెన్—విశ్వజనీన భావఝరి నైక్యంబొంది జీవించుచున్

7

సకలము దైవదత్తమయి జన్మవిశిష్టత బొంగివచ్చు ది
వ్యకళల గ్రుమ్మరించు, విరియన్ తొలికాంతులు మేలుకొల్ప గీ
తిక లుదయించు; సత్కవులు తియ్యని కంఠములెత్తి భావ వా
టికల జరింప—బోలదొకటిన్ మహితాత్మత కావ్యవైఖరిన్

8

పాండిత్యంబున రాదు; వేదికలపై వాగన్ ప్రవర్షింప; దు
ద్దండ ప్రౌఢిమ తర్కశాస్త్రముల నుద్ఘాటించుచో నంద; దీ
శుం డాడన్ హృదయాంతరంబున సుధాశుభ్రాభ్రగంగాపయః
కాండంబై ప్రవహించు సత్కవిత యేకాంతంబునన్ పొంగుచున్.



ఓడలు - బళ్ళు

తమిళ మూలం :

శ్రీ కా. నా. సుబ్రహ్మణ్యం

అనువాదం :

శ్రీ బి. వి. సింగరాచార్య
శ్రీ పి. సభాపతి

[గతసంచిక తరువాయి]

4

పుస్తకం తీసిపెట్టుకుని రెండోసారి చదవటానికి గట్టిగా ప్రయత్నించాను. మమ్మేలియార్ల్‌ను గూర్చి ఆలోచించటం మానేసి ఏదో విధంగా పుస్తకంమీద ధ్యాస కుదుర్చుకున్నాను. టైమెంత యిందీ తెలియలేదు. పుస్తకం చదవటంలో పూర్తిగా లీనమైపోయాను.

రఘూ ఏ దిక్కునించో వచ్చి, 'ఇంకా భోజనాల వేళ కాలేదా?' అంటూ నా ఎదుట ప్రత్యక్షమయేటప్పటికి ఉలిక్కిపడి పుస్తకం మూసేశాను. తలెత్తి గోడగడియారంకేసి చూశాను. రెండు గంటల ఇరవై నిమిషాలు.

'గడియారం చూసింతర్వాత బాగా ఆకలేస్తోంది!' అంటూ లేచి చేతిలో పుస్తకం బల్లమీదపడేసి బయలుదేరాను. బయటికివస్తూ, 'ఇంత సేపూ ఏం చేస్తున్నావ్?' అని రఘూని అడిగాను.

'ఏమీ చెయ్యకుండా ఉండడమే ఉత్తమం. అని గడిపేశాను. చేతిలో గడియారంకూడా లేదు. టైమెంతయిందో తెలియలేదు. పన్నెండయుంటుందని బయలుదేరాను. రెండున్నర కావస్తోంది.' కాస్త తీవ్రంగా మొహంపెట్టి అన్నాడు రఘు.

'భేష్! ఆరుగంటల కాలాన్ని మూడుగంటల్లా సునాయాసంగా గడిపేవిద్య నాకే అలవడటం లేదు!' మాటల్లో విచారం ధ్వనింపజేస్తూ అన్నాను.

'ఆరుగంటలు మూడుగంటల్లా గడిచింది. ఆరు యుగాలుగా గడవలేదని బాధపడటం ఎందుకు?' అన్నాడు రఘు విసుగ్గా. రఘు మాటల్లో విరక్తి ధ్వనిస్తోంది.

రఘు మాటల్లోని ఆ విరక్తిభావం స్ఫురించడంతో నా మనస్సు చివుక్కుమంది. తలెత్తి చూశాను. వాడేదో ఆలోచనల్లోపడి కొట్టుకుంటున్నట్టనిపించింది. నేను వెంటవస్తున్న సంగతికూడా మరచిపోయాడు. పరధ్యానంగా ముందుకి వెళుతున్నాడు. బహుశః ఆకలేమో! వెనక్కి తిరిగి చూడకుండా గబగబ నడుస్తున్నాడు. నేనూ కాస్త త్వరత్వరగానే రఘూ వెనుక నడిచాను. పరిసరాలు ప్రశాంతంగా,గంభీరంగా ఉన్నాయి. ఆ నిశ్శబ్దాన్ని నేను భంగపరచలేదు.

ఇంటికి వెళ్ళేటప్పటికి ఆకలికాస్త మందగించింది. కొద్దిగా తలనొప్పి ప్రారంభమయింది. రెండు మెతుకులు, తొందర తొందరగా తిని పడుకున్నాం. పగలు పడుకునే అలవాటు లేదు నాకు. నిద్రపట్టలేదు. బాగా బద్ధకంగామాత్రం ఉంది.

ప్రక్కమీద అటూ, ఇటూ పొర్లాడాను, వందా రెండువందల మైళ్ళు పరుగెత్తి అలసిపోయిన గుర్రంలాగా! రఘూ పిల్లలిద్దరూ ఇంట్లో లేరు. బహుశా పక్కింటి పిల్లల్తో ఆడుకోటానికి పోయారేమో. ఓ పుస్తకం తీసి చదవటం మొదలు పెట్టాను; విషయం కుదర్లేదు. భోజనంచేసి ఇంకా ఒక గంటసేపుకూడా కాలేదు. అయినా ఓ కప్పు కాఫీ తాగేసివస్తే తలనొప్పి కాస్త తగ్గుతుందేమో! చొక్కా తొడుక్కుని హోటలుకి బయలుదేరాను.

తీక్ష్ణంగా కాస్తూన్న ఎండలో ఉత్తరం వీథిలోకి ఒదిగి ఒదిగి నడిచాను. రాజగోపాలస్వామి వీథిలోకి మళ్ళేటప్పుడు మళ్ళీ ఆ మమ్మేలియార్ల విషయం జ్ఞాపకం వచ్చింది. ఆ రోజున మొట్ట మొదట సదాశివ మమ్మేలియార్‌ని గూర్చి విన్నప్పటి నించీ మరో విషయమేదీ నా చెవికెక్కటం లేదు. మమ్మేలియార్ల మర్మకథ ఇలా విశ్వరూపందాల్చి, నాకు రంపపు కోతగా తయారై నన్ను వేధించ కూడదు! దానికి ఒకటే దారి. మమ్మేలియార్లని గూర్చిన పూర్తి వివరాలు అడిగి తెలుసుకోవాలి. అదొక్కటే ఉపాయం. మరో దారిలేదు. వీళ్ళకీ, నా స్నేహితుడు రఘూకీ మధ్యఉన్న ఆ నిగూఢ సంబంధం ఏమిటి? ఊళ్ళో ఎవరినైనా పలుకరించి ఉపాయంగా తెలుసుకోవాల్సిందే.

గత్యంతరం లేదు.

ఏది ఏమైనా, రఘూకిమాత్రం ఈ విషయం తను స్వయంగా చెప్పటానికి ఇష్టం లేదు. ఆ సంగతి తేలిపోయినట్టే! నేను ఆ విషయం తెలుసుకోడానికి ప్రయత్నించడంకూడా ఇష్టం లేదు అతనికి. అదీ తేలిపోయినట్టే. ఇహ, ఈ పరిస్థితుల్లో ఆ సంగతినిగూర్చి మళ్ళీ పుండరించటం ఎబ్బెట్టుగా ఉంది. ఇతరులు ఎవరినైనా అడిగి ఆరాతీయటం రఘూపట్ల, నా ప్రాణస్నేహితుడిపట్ల ద్రోహం అవుతుందేమో! ఎందుచేత? ద్రోహం ఎలా అవుతుంది? ఏమో, ఈ సంగతి బొత్తిగా అర్థం అవటం లేదు.

పైగా, ఎవడో మూడో మనిషి దగ్గరికి వెళ్ళి మమ్మేలియార్లనిగూర్చి ఏమని అడగటం? ఎలా ఆరాతీయటం? కాస్త ఆచూకీ దొరికితే, తర్వాత ఏమైనా అడొగొచ్చు. ఏమాత్రం ఎరుగని వాళ్ళతో, ఎవరినిగూర్చి, ఏమని అడగాలి?

ఈ లోగా మణిఅయ్యర్ కాఫీ క్లబ్బు దగ్గరికి వచ్చేశాను. ఆనాటి మణిఅయ్యర్ హోటల్‌కి వారసత్వం వహిస్తూ, ఈ మధ్యే తంజావూరులో వెలిసింది—ఈ మణిఅయ్యర్ హోటల్. కాఫీ ప్రియుణ్ణైన నాకు ఈ మణిఅయ్యర్ హోటల్ వ్యవహారాలు బాగా తెలుసు. హోటల్లో వాళ్ళందరూ నన్ను ఎరుగుదురు. హోటల్ కుర్రాళ్ళందరూ నాకు బాగా పరిచయమయ్యారు. కుర్రవాళ్ళు ఎందుకో నేనంటే ఎంతో గౌరవం చూపిస్తూ, ఆప్యాయంగా పలకరించి ఉపచరించేవారు. కాఫీ ప్రియులకి తగిన ఉపచరణే ఇదంతా అనుకునేవాణ్ణి. సంతోషంతో స్వీకరించే వాణ్ణి.

రోజులాగే మణిఅయ్యర్ క్లబ్బులో కాఫీ, టిఫినూ ఆ రోజుకూడా బాగుంది. నేను కాఫీ చుక్కచుక్కా ఆస్వాదిస్తూ, అనుభవిస్తూ తాగుతున్నప్పుడు ఇద్దరు యువకులు కాషియర్ బల్ల దగ్గరికి వచ్చారు.

నేను కాషియర్ బల్ల సమీపానే ఓ టేబిల్ దగ్గరకూచుని కాఫీ తాగుతున్నాను. ఇంకా పొద్దు గూకలేదు. హోటల్లో జనం ఎక్కువమంది లేరు. నాకు అన్నీ తెచ్చిపెట్టిన కుర్రాడు, చాలా సీట్లు ఖాళీగా ఉండి తీరిగ్గా ఉన్నందువల్ల నా టేబిలు దగ్గరికివచ్చి ఎదుట నిలబడి, 'కాఫీ బాగుందా సార్?' అని ప్రశ్నించాడు.

'ఓ బేషుగ్గా ఉంది!' అన్నాను. నా జవాబు వాడికి వినిపించిందో లేదో నాకు తెలియదు. ఎంచేత

నంటే అదే సమయానికి ఆ ఇద్దరు యువకులూ బిల్లు చేత బుచ్చుకుని కాషియర్ బల్లదగ్గరికి వచ్చారు. వాళ్లని చూడగానే హోటల్ కుర్రాడు, 'మళ్లా దయచేశారా?' అని లోలోన గొణుక్కున్నాడు వాళ్లకేసి జాగ్రత్తగా చూడమన్నట్టు నన్నుచూసి కన్ను గీటాడు.

హోటల్ కుర్రాడు హెచ్చరించకపోయినా, వాళ్లని నేనో కంటకనిపెట్టేవాణ్ణే! వాళ్ల ముఖాలమీద ఓ విధమైన అసాధారణత కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ముఖకళవళికలనుబట్టి ఇద్దరూ అన్నదమ్ములని అర్థమవుతూంది. ఖరీదైన దుస్తులు ధరించారు. చూట్టానికి 'నీట్'గా కనిపిస్తున్నారు. కాని కాషియర్ బల్ల దగ్గరికిరాగానే గొంతు తగ్గించి ఏదో రహస్యం చెబుతూన్నట్టు వాళ్లు గొణగడం వింతగా తోచింది. వెంటనే ఏదో సందేహం కలిగింది నాకు.

కాషియర్ కాస్త గట్టిగానే మందలించాడు ఆ కుర్రాళ్లని: 'ఇలా నెలల తరబడి పద్దులురాస్తూపోతే...?' కాషియర్ మాటల్లో అసంతృప్తి, విసుగు, నిర్లక్ష్యం అన్నీ ఏకంగా ధ్వనించాయి.

నాజూగ్గా, ఖరీదైన దుస్తులు వేసుకుని గొప్పవాళ్లలా కనబడే వారితో సాధారణంగా గట్టిగా మాట్లాడే రకం కాదు, కాషియర్! ఈ రోజు ఇంత గట్టిగా కేకలేయటం వింతగా తోచింది.

ఆ కుర్రాళ్లుమాత్రం ఇలాంటి సందర్భాలకి బాగా అలవాటుపడిన వాళ్లలాగున్నారు, కొంచెంసేపు గట్టిగా మాట్లాడ్కుతూ తర్వాత ఏదో గొణుగుతూ కాఫీ బిల్లు పద్దురాసేసి మెల్లగా బయటికి జారారు.

'అసాధ్యులే!' అన్నాను, హోటల్ కుర్రాడికేసి చూస్తూ.

'బాబోయ్! మమ్మేలయార్లకి ఉన్న సామర్థ్యాలు మీకూ, నాకూ ఎక్కణ్ణించి వస్తాయి సార్?' అన్నాడు కుర్రాడు.

ఉలిక్కిపడ్డాను నేను. బొత్తిగా ఎదురు చూడని సంగతి ఇది! నేను లేచి కూచున్నాను. 'తమ్ముడూ! అలాగే మళ్లీ ఇంకో కప్పు కాఫీచేసి పట్టుకురా,' అన్నాను హుషారుగా.

తను తెచ్చిపెట్టిన కాఫీ తృప్తికరంగా ఉందని పాపం ఆ హోటల్ సర్వర్‌కి సంతోషం. రెండు నిమిషాల్లో మరోకప్పు కాఫీతెచ్చి బల్లమీద పెట్టాడు.

'అబ్బే, ఈ మమ్మేలియార్లు ఎవరో నీకు తెలుసా? పేరుకూడా అదో రకంగా ఉందే!' సావకాశంగా మాటల్ని సాగదీస్తూ, నా కుతూహలాన్ని బయటికి కనబరచకుండా, రెండోసారి తెచ్చిన కాఫీ కొద్దికొద్దిగా తాగుతూ అడిగాను.

'మమ్మేలియార్లని గురించా అడుగుతున్నారు? చెపుతా సార్. మరి, అదో పెద్దకథగా తయారవుతుందే! ఎలా చెప్పడం?' అన్నాడు కుర్రాడు.

'ఏం ఫర్వాలేదు! ఇలాంటిదే ఇంకోకప్పు కాఫీతెచ్చి ఇచ్చినా తాగేందుకు నేను సిద్ధమే. సగం కథ చెప్పిన తర్వాత, మూడో కప్పుకాఫీ తెచ్చిపెట్టు. మిగతా సగం కథ ఆ కాఫీ తాగుతూ వింటాను,' అన్నాను.

'ఓ మంచిసమయంలోనే అడిగారు. జనం ఎక్కువమందిలేరు. మూడున్నర, నాలుగు గంటలకి మళ్లీ గుంపులు వచ్చేస్తాయి. ఆ లోగా చెప్పేస్తాను,' అన్న ఉపోద్ఘాతంతో కథ మొదలు పెట్టాడు.

'ఈ పెద్ద ప్రపంచంలో విన్నవాళ్లందరికీ కళ్ల నీళ్లు తెప్పించే కష్టాల కథలకి కొదువ లేదుగద సార్! ఈ తంజావూరు చరిత్రలాంటి దారుణమైన చరిత్ర ఎక్కడా లేదని చెప్పొచ్చుగదండి. ఎప్పుడో వెనకటి పేరు ప్రతిష్ఠల్ని

మినహాయిస్తే ఈ రోజుల్లో తంజావూరునిగూర్చి కొత్తగా చెప్పుకోటానికి ఏముంది సార్! ఎక్కడా లేనంత గొప్ప అందమైన కట్టడాలన్నీ కూలి పోతున్నయ్యాండి, ఒకప్పుడు గొప్పదశననుభవించిన ఈ పట్నం క్రమక్రమంగా పాడుపడిపోతూండటం రోజూ మనకళ్ల ఎదుటే కనిపిస్తూంది.

'మనుష్యులకిలాగే పట్నాలకీ, నాగరికతలకూ ఉచ్ఛ, క్షీణదశలు ఉంటాయంటారుగదండి. దాన్నే తారుమారుచేసి చరిత్రప్రసిద్ధనగరాలకు, నాగరికతలకు లాగే, మనుష్యులకీ, వంశాలకీకూడా ఉచ్ఛ క్షీణదశలు కలుగుతయ్యనొచ్చాండి?

'మనుష్యుల్లో చాలా విచారకరమైన సంగతి ఏమిటని నన్నడిగితే, ఈ మమ్మేలియార్ల చరిత్రేనని తడుముకోకుండా సమాధానం చెప్పగలను. మమ్మేలియార్లలాంటి దౌర్భాగ్యకుటుంబం ఈ దౌర్భాగ్యపు తంజావూరు మొత్తంలో మరొకటి కనిపించదని నిస్సందేహంగా చెప్పగలను సార్!'

'ఇదేమిటి చెప్మా, ఇంతో పేరుతెచ్చుకున్న కథారచయితని నన్ను కూచోబెట్టి, ఈ అధిక ప్రసంగి, ఈ హోటల్ కుర్రాడు—గొప్పరచయితలాగ జమాయించి చెప్పుకుపోతున్నాడే!' అని మీ కాశ్చర్యం కలగొచ్చు! ఆశ్చర్యపోతున్నారు; అవునా? నాకా సంగతి తెలుసు! కాని నేను చేయగలిగింది ఏముంది? ఈ మమ్మేలియార్లనిగూర్చి ఆలోచించడం మొదలుపెడితే నాకెక్కడా మంచి ఒడుపుగా, పట్టుగా కథ చెప్పడం చాతనవుతుందేమో అనిపిస్తూంది.

'అదో పెద్దకథ! పూర్వం ఒకప్పుడు ఈ మమ్మేలియార్ల స్థితి ఏమిటి? ఇప్పుడు వాళ్ల స్థితిగతు లేమిటి? ఈ వరుసలో ఆలోచించడం మొదలుపెడితే కథ చెప్పడం సులభమే! కవిత్వం అల్లలేకపోతున్నానేఅన్నబాధ పీడిస్తూంది నన్ను. మమ్మేలియార్ల విశిష్టచరిత్రని ఒక్కసారి జ్ఞాపకంచేసుకుంటే చాలు! ఆ కుటుంబాన్నిగూర్చిన పూర్తివివరాలు తెలియకపోయినా, ఆ కథ వినేవాళ్ల హృదయాలని జాలితో నింపివేసి, కన్నీళ్లు కురిపిస్తుంది.

'గొప్ప వాళ్లలా నటిస్తూ, విలాసాలలో ఓలలాడుతూ రోజులు గడిపే వాళ్లకి వాళ్ల కృత్రిమ జీవనం తీరని వ్యసనంగా మారక తప్పదు. ఆ వ్యసనాన్ని విసర్జించటంగాని, మరచిపోవటంగాని సులభంకాదు. బాల్యంలో దర్జాగా బ్రతికిన వాళ్లు నడివయస్సులో హఠాత్తుగా ఆస్తిపాస్తులు పోగొట్టుకుని పేదవాళ్లయితే ఆ పైన వాళ్లు నెగ్గుకురావడం మాటలతో అయ్యేపనికాదు. నెగ్గుకు రాగలిగిన వాళ్ల సంఖ్య బహుస్వల్పం. నూటికి ఒక్కరో, ఇద్దరో—అంతకుమించదు వాళ్లసంఖ్య. ఎన్నో తంటాలుపడి, కష్టాలకోర్చి బయటపడగలగాలి; అలా బయటపడినా వాళ్ల చరిత్ర అంతటితో సమాప్తమయినట్టే లెక్క! నెమ్మదిగా పైకి రావటానికి వాళ్లకి ఓపిక చాలదు; ఉత్సాహం చాలదు; దైనందిన జీవితాలు గడపటం చేతకాదు వాళ్లకి! సంఘంలో నలుగురిలా బతకటానికి ప్రయత్నించరు; ప్రయత్నించినా అసలు ఆ విద్య వాళ్లకి అలవడదు! పగటివేళ సోదరమానవులతో కలసి మెలసి తిరగడానికి జంకుతూ, రాత్రివేళ దొంగచాటుగా తిరిగే నేరస్తుల్లాగా ఏదో చెప్పరాని భీతితో క్రుంగి కృశిస్తూ జీవిస్తారు!

'ఇప్పుడు మీక్కనిపించిన ఇద్దరు మమ్మేలియార్లూ ఏదో విధంగా సర్దుకుపోయే రకంకాదు! అధఃపాతాళంలోకి క్రుంగిపోయి, వంచిన తలఎత్తలేక నానావస్థలూ పడుతూన్న రెండోరకం వాళ్లు!

'మా తాతలు నేతులు తాగారు. మా మూతులు వాసన చూడండి!' అనటమే తప్ప, తాము ప్రస్తుతం నిరుపేదలు అనే స్ఫురణ వాళ్లకి కలగదు. ఎన్నడూ అలాంటి తలంపే మనసులోకి రానీయరు! ఇదివరకులాగే యథాప్రకారం తమ జీవి

తాలు సవ్యంగా నడచిపోతున్నాయని భ్రమపడతారు. దైనందిన జీవితంలో తమ సాంఘిక స్థాయి పడిపోయినట్టు బయటికి కనిపించనీయకుండా, లోకం కళ్ళు కప్పటానికి ప్రయాస పడుతూంటారు. తాము అలా భావించుకుని జీవించగలిగితే, తక్కినవాళ్ళూ అలాగే అనుకుని, పూర్వంలాగే తమకు గౌరవాదరణలు చూపిస్తారని పాపం వాళ్ళు గుడ్డిగా నమ్ముతారు. వెనుకటిరోజుల్లోలాగా నిరాఘాటంగా తమ జీవితాలు గడచిపోతాయని పగటికలలు కంటూఉంటారు. లోకాన్ని మోసపుచ్చటానికి ప్రయత్నించి చిట్టచివరికి తమ్ముతామే మోసపుచ్చుకుంటారు; వెర్రివాళ్ళు! అస్తమానం వీళ్ళ నెత్తిన మొట్టికాయలు పడుతూండాలి! ఇప్పటి కుటుంబపరిస్థితుల్ని అడుగడుక్కీ జ్ఞాపకం చేయాలి.

'నేను — హోటల్లో పనిచేసే కుర్రవాణ్ణి అయినా — ఏవో నాలుగు అక్షరాలు చదువనేర్చిన వాణ్ణి — మమ్మేలియార్ల కథని పట్టుగా, చక్కగ చెప్పుకుపోవటం మీకు నచ్చినట్టుంది! మీ మనసులో అలా అనుకుంటారనీ నాకు తెలుసు! నేనేం చేయను సార్? మమ్మేలియార్లకథని మరోవిధంగా చెప్పటం సాధ్యంకాదు సార్! విషయానికి తగ్గట్టు కథాగమనాన్ని నడుపుతూ మాంచిరసపట్టులో చెప్పుకుపోవలసిందే! ఇరవై, ముప్ఫై నిముషాల వ్యవధి ఉంది; అవసరమైనపనీలేదు! మీరు తీరుబాటుగా కూచుని వినగలిగితే, నాకు నచ్చిన ధోరణిలో నెమ్మదిగా కథంతా చెప్పేస్తా. మీ వ్యవహారాల్లో జోక్యం కలుగజేసుకున్నందుకు క్షమిస్తూ, కాస్త ఓపిగ్గా వినండి.

'ఇందాకా హోటల్లో జొరబడి, సుష్టుగా భోంచేసి బిల్లుమొత్తం పద్దురాస్తూ హోటల్ మానేజర్ చీవాట్లుపెడుతున్నా వినిపించుకోనట్టు జవాబు చెప్పకుండా తలదించక చల్లగా జారుకున్నారే — ఆ కుర్రాళ్ళిద్దరూ గొప్పఇంటివాళ్ళు; పుట్టుకతో గొప్పవంశంలో జన్మించినవాళ్ళు. బాగా డబ్బున్నవాళ్ళఇంట్లో పెద్దఆస్తులకు గుత్తావారసులుగా పుట్టినవాళ్ళు. ఆ తరంలో మమ్మేలియార్ల వంశంలో పుట్టినవాళ్ళంతా అదృష్టవంతులేనని ఊళ్ళో వాళ్ళందరూ అభిప్రాయపడేవాళ్ళు.

'ఆ రోజుల్లో — ఇంచుమించు యాభయ్యేళ్ళు, మహా అయితే, అరవైయేళ్ళక్రితం అనుకోండి — అంతకిమించవు — తంజావూరు జిల్లాలోనేకాదు — మదరాసు రాజధాని మొత్తంలో మమ్మేలియార్ల పేరు ప్రఖ్యాతులు మారుమోగిపోతూండేవిట. మమ్మేలియార్ల పేరు తెలియని వాళ్ళు చాలా అరుదు, ఆ రోజుల్లో! ఈ కుర్రవాళ్ళ ముత్తాత సాము గరిడీలుచేసి బాగా ఆస్తికూడబెట్టాడు. ఏమంత గొప్ప చదువులు చదువుకున్నవాడు కాకపోయినా, లక్ష్మీదేవి కాస్త చల్లనిచూపు చూసింది; అంతే! అతను పట్టింది బంగారం అయిపోయింది. ఆస్తి బాగా పెరిగింది. ఆయన బ్రతికి ఉన్నది, డబ్బుకూడబెట్టిందీ కొద్దికాలమే. యాభై ఏళ్ళు నిండకముందే చనిపోయాడాయన. జీవించివున్న స్వల్పకాలంలోనే, ముఖ్యంగా చివరి ఇరవై ఏళ్ళల్లో ఆయన ఆస్తి బాగా పెరిగింది. బహిరంగంగా గౌరవనీయ మార్గాల్లో కొంతవరకూ, దొంగచాటుగా ఎన్నో డొంక తిరుగుడు మార్గాల్లో చాలామట్టుకూ — వేలూ లక్షలూ గడించాడని ప్రసిద్ధి. ఊళ్ళో నలుగురూ నాలుగు రకాలుగా చెప్పుకునే వాళ్ళుట.

'ఏది ఏమైతేనేం? మొత్తంమీద ఆయన ఆస్తి అమితంగా పెరిగింది; అదీ ముఖ్యం. ఈ ఆస్తి కారణంగా అతగాడికి ఎందరో గొప్పగొప్ప వాళ్ళతో స్నేహాలు, చనువులూ ఏర్పడ్డాయి. అంతా మమ్మేలియార్ల చుట్టూ తిరిగేవాళ్ళు; ఏడాది పొడుగునా వచ్చిపోయే బంధుజనం — వాళ్ళకి లెక్కే ఉండేది కాదుట; వాళ్ళ ఇంట్లో రోజూ ఏదో

తిరనాళ్ళ జరుగుతున్నట్టే. ఎప్పుడూ అంత సందడిగా ఉండేదిట! రెండెడ్లబళ్ళూ, రేకళా బళ్ళు, సైకిళ్ళు, కోచ్‌బళ్ళు — ఇలా ఓ డజన్ వాహనాలు రేయింబగళ్ళూ వాళ్ళ ఇంటి ముందు నిలబడి ఉండేవిట. ఊళ్ళో నలుగురు కలసి ఏపనిచేయాలనుకున్నా, మమ్మేలియార్ హాజరు కావలసిందే! ఆయన లేనిదే ఏకార్యం కొనసాగేది కాదుట!

'గొప్పగా చదువుకోలేదు; అయితే ఏం? ఆస్తి బాగా కూడబెట్టాడు. చదువురానికొరత, కొత్తగా కూడబెట్టిన ఆస్తి—రెండింటినీ ఏకంగా పరిపాలించగల ఉత్సాహం, తెలివితేటలూ ఉన్నాయి. ఏ ఎండ కాగొడుగు పట్టటం తెలుసు! మనిషి నెరిగి మాట్లాడగల మాటకారి! గొప్పవాళ్ళమధ్య గొప్పవాడుగా, మామూలుమనుషులమధ్య మామూలు మనిషిగా మసలేవిద్య తెలుసు ఆయనకి! అంచేతే ఆయనంటే అందరికీ వల్లమాలిన అభిమానం. తెగమెచ్చుకునేవాళ్ళట అందరూ. దానధర్మాల్లో విపరీతమైనపిచ్చి. కాశీలో ఒక మఠం, స్వామి కైంకర్యాలుఎన్నో. తంజావూరుజిల్లాలో పలుచోట్ల దానధర్మాలూ, ఈ ఊళ్ళోనే ఆయనపేరిట వెలసిన ఒకటి, రెండు ధర్మసత్రాలూ—ఇవన్నీ ఆయన దాతృత్వానికి చిహ్నాలుగా నేటిదాకా, స్థిరంగా నిలబడిఉన్నాయి. ఆయనపేరు సదాశివమమ్మేలియార్!

'సదాశివమమ్మేలియార్ తర్వాతితరంవాళ్ళలో ఎవరికీ డబ్బు సంపాయించే సామర్థ్యంగాని, ఆస్తిని కాపాడుకునే మనస్థిమితంగానీ లేకపోయింది. వాళ్ళేమీ సంపాయించకపోయినా ఫరవాలేదు. ఆ ఉన్న ఆస్తిని ఏదో కాస్త జాగ్రత్తగా కాపాడుకుంటూ, రోజులు గడపగలిగితే మమ్మేలియార్ల వంశం నేటికీ మదరాసు రాజధానిలో ప్రఖ్యాత కుటుంబాల్లో ఎన్నదగిందిగా ఉండేది. ఆ భాగ్యానికి నోచుకోలేదు వాళ్ళు.

'మమ్మేలియార్లవంశం నశించిపోవటానికి ఓ ముఖ్యమైన కారణం ఉంది. ఆ కుటుంబం సర్వనాశన మవటానికి కారణం సాక్షాత్తూ సదాశివ మమ్మేలియార్ భార్యామణే!

'ఎన్నో ఏళ్ళు గడిచాక, ఇంచుమించు వృద్ధాప్యంలో పెళ్ళి చేసుకున్నాడు సదాశివ మమ్మేలియార్! అసలు ఆయన ఆస్తి పెరిగిందీ ఈ పెళ్ళినాటినుంచే! ఆమె అదృష్టం కొద్దీ ఆయన ఆస్తి పెరిగిందని అంతా అనుకున్నారు. పెళ్ళినాటికి సదాశివమమ్మేలియార్‌కి కనీసం ముప్ఫై అయిదేళ్ళయినా ఉండాలి. అతగాడిని చేపట్టిన శివకామి వయస్సు పెళ్ళినాటికి పది హేనేళ్ళో, పదహారేళ్ళో. పుట్టింక పేదయింట. కాని, గొప్పవంశం;- ఓ జమీందారుకి దూరపుపేద చుట్టం. మనిషి చామన చాయ; మూడముచ్చటైన రూపం. సదాశివమమ్మేలియార్ ఐశ్వర్యం, కీర్తి ప్రతిష్ఠల్లాగే, శివకామి అందచందాలు, ప్రవర్తనా ఊళ్ళో పేరు మోసినయి! ఆవిడ తాలూకు ప్రేమికులంటూ, వారానికి ఒకరు చొప్పున ఊళ్ళో ఎందరో పేరు మోశారు.

'శివకామి ప్రేమికుల జాబితాలో అప్పుడే చెన్నపట్నంలో పైచదువులు ముగించుకుని కొత్తగా వచ్చిన ఓ యువక డాక్టరుకూడా ఉండేవాడు. ఆ అబ్బాయిపేరు ఇప్పటికీ తెలియదు నాకు. ఇన్నేళ్ళు గడచినా, ఇప్పటికీ ఊళ్ళో డాక్టర్ శివకామిఅనో, మమ్మేలియార్ల డాక్టర్ అనో చెప్పుకుంటారు. సదాశివ మమ్మేలియార్ కష్టపడి సంపాయించిన కొద్దీ, ఆ డాక్టరూ, శివకామీ ఇద్దరూ హాయిగా ఖర్చుపెట్టారు. శివకామి ప్రేమికుల్లో స్థిరపడిన వాడు ఈ డాక్టర్ ఒక్కడే. డాక్టరుకీ తన భార్యకీఉన్న సంబంధం ఎలాంటిదో సదాశివమమ్మేలియార్‌కి తెలుసు. తెలియకుండా ఎలా ఉంటుంది? అనుకునే వాళ్ళు ఊళ్ళో వాళ్ళంతా! భార్య సంగతి తెలుసుగనుకనే, సదాశివమమ్మేలియార్ కుటుంబ వ్యవహారాల్లో ఏ మాత్రం జోక్యం కలుగజేసుకునే

వాడుకాడు. పూర్తిగా వైదొలగి ఉంటూ, ఆస్తి కూడబెట్టటంలో నిమగ్నుడయాడనుకున్నారు. బ్రతికి వున్నన్నాళ్ళూ ఆయన శివకామినిగూర్చి పట్టించుకున్నట్టే కనబడలేదు. తను బ్రతికుండగా పుట్టిన ఇద్దరు కుమారుల సంగతికూడా ఆయన ఆట్టే పట్టించుకున్నాడని చెప్పలేము. డబ్బుకూడబెట్టటంలోను అందులో కొంతభాగం ఖర్చుపెట్టి, మిగతా డబ్బు తనకు సంబంధించినంతవరకూ దాచిపెట్టటంలోనూ లగ్నమయింది ఆయన దృష్టంతా.

'సదాశివమమ్మేళియార్ చనిపోయేటప్పటికి, శివకామికి ముప్ఫైయేళ్లే! అంతకి మించదు. ఆమె అందం తరగలేదు; చెక్కుచెదరలేదు. ఆ డాక్టరు ఆమె సహవాసం వదల్లేదు. మమ్మేళియార్ బంగళా ఒకదాంట్లో శివకామిబంగళాకి దగ్గర్లోనే, తన స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు డాక్టరు. పన్నెండేళ్ల కుర్రవాడు, ఏడేళ్ల కుర్రవాడు, అయిదేళ్ల ఒక అమ్మాయి—మొత్తానికి శివకామికి ముగ్గురు సంతానం. సదాశివమమ్మేళియార్ చనిపోయినప్పుడు శివకామి మూడునెలల గర్భవతి అనుకున్నారు. ఇంచుమించు ఓ ఏడాది గడిచాక శివకామికి మూడోమగపిల్లవాడు పుట్టాక ఊళ్లో ఈ వదంతి బయలుదేరింది!

'సదాశివ మమ్మేళియార్ చివరి రోజుల్లో కూడబెట్టిన పెద్దఆస్తిఅంతా విడిచిపెట్టి కళ్లు మూశాడు. తంజావూరులో ఏడెనిమిది బంగళాలు, రొక్కంగా ఎంతోడబ్బు, కొన్నివందలఎకరాల మాగాణి, ఓ మంచికాంట్రాక్టు—ఇంకా రకరకాల ఆస్తి ఉండేది. మమ్మేళియార్ వారసులు, అప్పటికింకా పసికందులే. ఆస్తినిర్వాకం పూర్తిగా శివకామి చేజిక్కింది; ఆమె ఆ డాక్టర్ వలపువలలో చిక్కుకుంది. ఇద్దరూ కలిసి ఇష్టంవచ్చినట్టు ఖర్చుపెట్టారు; అప్పటికీ ఎంతోఆస్తి మిగిలివుంది. ఆ మిగతాఆస్తిని కాజేయటానికి ఎక్కణ్ణించో వున్నట్టుండి ఓ వాటాదారు ఊడిపడ్డాడు. తనూ, సదాశివమమ్మేళియారూ కలిసి జాయంటుగా కంట్రాక్టుపని మొదలుపెట్టినట్టూ, సదాశివ మమ్మేళియార్ల ఆస్తిలో సగంభాగం తనదేనని దావా వేశాడు. క్రిందకోర్టులో కేసు వాడిపక్షమే నెగ్గింది. కేసు విచారణ నాలుగైదేళ్లు నడచింది. ఆ మిగిలిన ఆస్తికూడా భాగంపంచి వాటాదారుకి ఇవ్వాలని కోర్టు డిక్రీ ఇచ్చింది.

'ఈ గొడవలమధ్య ఆ డాక్టర్‌కి—అతగాడి పేరు, తక్కిన వివరాలూ నాకు తెలియవని చెప్పానుగా సార్! శివకామిపట్ల మోజు తగ్గింది. ఆమె ప్రేమతో మొహం మొత్తిందేమో! వయస్సులో శివకామికన్నా ఆ డాక్టర్ నాలుగైదేళ్లు చిన్నవాడంటారు; ఆమె ప్రేమ సహించలేకపోవటం న్యాయమే సార్. మమ్మేళియార్ల కేసు హైకోర్టుదాకా వెళ్లేసరికి కోర్టు ఖర్చులకని రొక్కం రెండువేలూ మూడువేలూ పుచ్చుకుపోయేవాడు డాక్టర్. ఓ రోజు శివకామి నగల్లో ఖరీదైన వాటిని మూటగట్టుకుని చల్లగా జారుకున్నాడు. ఆ రోజు తంజావూరు వదలివెళ్లినాయన, ఇంతవరకూ తిరిగి రాలేదు. ఎక్కడున్నాడో, ఏమయాడో ఎవరికీ తెలియదు.

శివకామి, ఆమె కూతురూ, ముగ్గురు కొడుకులూ తంజావూరులోనే స్థిరపడిపోయారు. గొప్పవంశం వాళ్లు అన్నపేరు మిగిలింది. ఇంకో తరానికి సరిపోయే డబ్బుకూడా మిగిలి ఉంది. ఇందాక హోటల్లో కనిపించిన ఆ ఇద్దరు కుర్రవాళ్లూ—సదాశివ మమ్మేళియార్ జ్యేష్ఠపుత్రుడు త్యాగరాజ మమ్మేళియార్ కొడుకులు సార్.

'జ్యేష్ఠపుత్రుడు త్యాగరాజ మమ్మేళియార్ కొంతకాలం బుద్ధిమంతుడుగా కనబడ్డాడు. కుటుంబ వ్యవహారాలు జాగ్రత్తగా చూసుకుంటూ ఉండేవాడు. చిన్నకంట్రాక్టు ఒకటి సంపాయించాడు. కొన్నాళ్ళూ వ్యవసాయంచేసి చూశాడు. ఇలా ఏవేవో తంటాలుపడ్డాడు. రోజులు గడచిన కొద్దీ త్యాగరాజ మమ్మేళియార్ ఖర్చులు పెరిగాయి.

ఆదాయం తగ్గించి. పూర్తిగా ఇరవై ఐదేళ్ళు నిండకుండానే స్త్రీ వ్యసనంలోపడి, విచ్చలవిడిగా తిరుగుతూ అల్పాయుష్కుడుగా ముప్ఫై ఏళ్ళలోపుగానే మరణించాడు. వాడి సంతతి ఈ ఇద్దరు కుర్రవాళ్ళే.

'త్యాగరాజ మమ్మేలియార్ బ్రతికివున్నన్నాళ్ళూ దర్జాగా బ్రతికాడు. అతనితండ్రి సదాశివ మమ్మేలియార్‌కూడా, అంతదర్జాగా బ్రతికి ఉండడేమో! ఈ త్యాగరాజు నాకు బాగా తెలుసు. సూదైనముక్కు, మెరిసే కళ్ళు, ఆజానుబాహువులతో-గంభీరమైన విగ్రహం. జరీ కుట్టుపూలు మిలమిల మెరిసే వెల్‌వెట్ కోటూ, నల్లటోపీ పెట్టుకొని గుర్రపుస్వారి చేస్తూంటే నిజంగా చూడముచ్చటగా ఉండేది సార్. వెనుకటి రోజుల్లో తంజావూరు రఘునాథరాజకుమారుడు స్వారీ చేసే దృశ్యం ఇట్లాగే ఉండేదేమో అనిపించేది. మంచి జాతి గుర్రాలు ఎన్నో ఉండేవి, అతని దగ్గర. ఆ రోజుల్లో, పన్నెండు పదిహేనేళ్ళక్రితం ఈ కుర్రవాళ్ళిద్దరూ బడికి వెళ్ళేటప్పుడు గుర్రం బండిమీదే వెళ్ళేవాళ్ళు!

త్యాగరాజు కనిష్ఠ కుమారుడు అణ్ణామలై. హైస్కూలు చదువు రోజుల్లో మేమిద్దరం వరుసగా రెండు మూడేళ్ళు ఫేలవుతూ ఒకే తరగతిలో కలిసి చదువుకున్నాం సార్. అల్లాగే ఏడో తరగతి దాకా ఇద్దరం జంటగా చదువుకున్నాం. అంతటితో మా చదువులు పూర్తయినట్టే! ఏడో తరగతి పాసై పై తరగతికి వెళ్ళకూడదని మేమిద్దరం కలిసి తీర్మానించుకున్నాం! హైస్కూలు చదువు అయిపోయిన తర్వాత ఈ హోటల్లో సప్లయర్‌గా కుదిరాను నేను. నా స్నేహితుడేమో కాఫీ తాగేసి, పళ్ళికిలిస్తూ, పద్దురాసుకోమని చెప్పేసి, దూసుకుపోతున్నాడు.'

5

ఈ ఘట్టంలో కథ ఆపేశాడు. ఎవరో ఇద్దరు కొత్తవాళ్ళు పక్కబల్ల దగ్గరికివచ్చి కూచున్నారు. కథ అంతటితో ఆపుజేసి వాళ్ళకి సప్లయి చేయడానికి వెళ్ళిపోయాడు 'నా కథకుడు'. కథ వింటున్నంతసేపూ నాకు ఇంకా ఎన్నో విషయాలు తెలుసుకోవాలన్న కుతూహలం ఉండేది. కాని కథ పూర్తిగా విన్నతరువాత నిరాశే మిగిలింది. ఒక తరంలో ధనవంతులై ఉండి, దర్జాగా బతికిన వాళ్ళు తర్వాతి తరం నాటికి పేదవాళ్ళై అష్టకష్టాలు పడటం మామూలే. గొప్ప వాళ్ళ ఇంట్లో కొందరు స్త్రీలు చెడుసహవాసాలవల్ల కాలుజారి నానాఅవస్థలు పడటమూ పెద్దవింతేమీ కాదు. ఇందులో కొత్త ఏముంది? ఈ కథలో కుర్రవాడు రఘూ సంగతి ఎత్తలేదే? ఎందువేత? ఏమిటా రహస్యం?

హోటల్ కుర్రవాడు తిరిగి నా బల్ల దగ్గరికివస్తూ 'బిల్లు ఇవ్వనా?' అనేసరికి చిరునవ్వు నవ్వుతూ, 'మిగతా కథకూడా చెప్పేసెయ్! మొదటిసారి తెచ్చావే, అలాంటిదే ఇంకోకప్పు కాఫీ కావాలి! రెండోసారి తెచ్చిన కాఫీ ఏమంత బాగా లేదు.' అన్నాను నేను.

'నా కథ మీకు నచ్చలేదు సార్! ఆ సంగతి ఎంత నాజూగ్గా చెపుతున్నారు సార్! నిజంగా మీరు చాలా అసాధ్యులు సార్!' అన్నాడు హోటల్ కుర్రవాడు.

వీపుమీద చరచినట్టయింది నాకు! ఈ కుర్రవాడి కథని మధ్యలో నేను విమర్శించానా? లేదే! కథ నాకు నచ్చలేదని వీడికి ఎలా తెలిసింది! విస్తుపోయాను. ఎలా గ్రహించాడో! 'కాఫీతెస్తా' నని వెళ్ళినవాడు వస్తాడుగా, తిరిగిరానీ అని ఎదురుచూస్తూ కూచున్నాను.

కాఫీతెచ్చి బల్లమీద నా ముందు పెడుతూ, తనే మళ్ళీ కథ అందుకుని చెప్పటం మొదలుపెట్టాడు. 'హైస్కూలు చదువు రోజుల్లో అణ్ణామలైతో నేను తరచు మమ్మేలియార్ల ఇంటికి వెళ్ళేవాణ్ణి. శివకామిని వాళ్ళ ఇంట్లో ఎన్నో

వార్ని చూశాను. ఇటీవలే కొన్నాళ్ళ క్రితం చనిపోయిందామె. వృద్ధాప్యంలోకూడా ఎంతో అందంగా కలకలలాడుతూ ఉండేదామె! చక్కగా మాట్లాడేది! వినటానికి మంచి స్వారస్యంగా ఉండేవి ఆమె మాటలు. త్యాగరాజ మమ్మేరియారు ఆయన తమ్ముడూ, చెల్లెళ్ళూ—అందరూ తెలుసు నాకు. వాళ్ళింటికి వెళ్ళినప్పుడల్లా కాఫీ, పళ్ళూ, పలహారాలుతెచ్చి ముందు పెట్టే వాళ్ళు. ఎంతో ఆదరించేవారు. ఇప్పుడు ఆ మమ్మేరియార్ల కుర్రవాళ్ళు ఇద్దరూ కాఫీకోసం జేబులో చిల్లర డబ్బులైనా లేకుండా హోటల్‌కివచ్చి పద్దులురాసి పోతున్నారు పాపం! వాళ్ళకి ఎలాగుందోకాని ఆ సంగతి తలచుకుంటే నాకు సిగ్గేస్తూంది.'

పక్కబల్ల దగ్గిరనించి ఎవరో పిలిచారు. కుర్రవాడు అటువెళ్ళి తిరిగి వచ్చేలోపుగా కాఫీ తాగేశాను. నా ఎదురుగా నిలుచున్న కుర్రవాడికేసి చూస్తూ 'ఈ సారి కాఫీ చాలా బాగుంది!' అన్నాను.

'ఏం సార్! వేళాకోళం చేస్తున్నారా?' అన్నాడు కుర్రవాడు.

'కాదోయ్! వేళాకోళం కాదు! నిజమే! కాఫీ బాగుంది. కాని, తక్కిన మమ్మేరియార్ల సంగతి...' అని అడగబోతుంటే, కుర్రవాడు నా మాటలకి అడ్డువస్తూ 'ఈ రోజు చాలా పొద్దయిపోయింది. ఇంక చెప్పటానికి వీల్లేదుసార్! మిగతా కథ నాకు తెలిసినంతమట్టుకూ ఇంకో రోజు చెపుతాసార్!' అన్నాడు.

ఇహ వేరేదారి లేదు. అనుకుని 'గప్‌చిప్'గా బిల్లు పుచ్చుకుని లేచాను.

కౌంటర్‌లో బిల్లు చెల్లిస్తూన్నప్పుడు చటుక్కున ఓ సంగతి స్ఫురించింది. రఘు నాన్నగారుకూడా డాక్టరే అన్నసంగతి ఎందుకో నాకు జ్ఞాపకం వచ్చింది.

కాని, ఈ సంగతికి హోటల్ కుర్రవాడి కథకీ ఏమిటి సంబంధం? ఏదీ స్పష్టంగా బోధపడటం లేదు.

6

వణిఅయ్యర్ హోటల్లోంచి బయటికొచ్చి మండుటెండలో నడుస్తూ ఇల్లు జేరుకునేటప్పటికి నాలుగు గంటల పదినిమిషాలయింది. రఘూ నిద్రలేచి ముఖం కడుక్కుని కాఫీతాగి చొక్కా తొడిగి బయటికి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నాడు.

నన్ను చూడగానే, 'నాకో ముఖ్యమైన పని ఉంది. ఒకాయన్ని వెళ్ళి చూడాలి! ఆరింటికి ఇంటికొచ్చేస్తాను. ఓ వేళ ఆలస్యమయితే నా కోసం ఎదురుచూడకు. నువ్వు మామూలువేళకి 'నాకో'కి వెళ్ళిపో. వీలయితే సరిగ్గా చీకటిపడే సమయానికి 'మేంపాలం' వంతెనకి పడమటగా రైల్వే లైను దగ్గర కలుసుకుంటాను. పొద్దుపోతేమాత్రం సరాసరి ఇంటికే వచ్చేస్తాను.' అన్నాడు రఘు.

'సరే!' అన్నాను.

రఘు వెళ్ళిపోయాడు. ఎండ తీవ్రత కాస్త తగ్గిన తర్వాత బయలుదేరవచ్చునుకొని పాత పత్రికలు తిరగేస్తూ కూచున్నాను. పొద్దు తెలియ లేదు. ఐదుంబావుకి ఇంటినించి బయలుదేరాను. ఉత్తరపు వీథివెంట టవర్‌క్లాక్‌దాకా నడిచాను.

మంచికాఫీ దొరికే హోటల్ కనబడితే నాకు ఎక్కడలేని 'కాఫీదాహం' పుట్టుకొస్తుంది. టవర్‌క్లాక్ దగ్గర హోటల్లో కాఫీ బాగుంటుంది. ఎదురుగా ఉన్న హోటల్లోకి ఆ రోజు తొమ్మిదో కప్పు కాఫీకోసం వెళ్ళాను.

ఎండ కొంచెం తగ్గింది; చల్లని సాయంత్రం. ఆ హోటల్లో కాఫీ, టిఫినూ బాగుంటుందని ప్రసిద్ధి. హోటల్ కిటకిటలాడుతూంది! మన దేశంలో విద్వద్గోష్ఠి, వేదపారాయణా—ఇవేవీ నేటి

నాగరికతా ప్రతిబింబాలుకావు. పుణ్యక్షేత్రాలూ, పుష్కరాలూ నేటి నాగరికతా వైశిష్ట్యాన్ని చాటటం లేదు. విద్యాలయాలు, గ్రంథాలయాలు నాగరికతా కేంద్రాలుకావు! నేటి నాగరికత తాలూకు నిజస్వరూపాన్ని చాటే కేంద్రాలు ఈ హోటళ్ళే. ఇది నేను అనుభవపూర్వకంగా గ్రహించిన సత్యం, కాఫీహోటల్లో కప్పులుకడిగే చప్పుడూ, కాఫీ ప్రియులు కాఫీ చప్పరిస్తూ ప్రదర్శించే పారవశ్యం, జనం కాషియర్ బల్లదగ్గిర బిల్లు చెల్లిస్తూ కనబరిచే నిర్లక్ష్యభావం—ఇవే నేటి నాగరికతలో ఉత్కృష్టమైన విలువలు. ఇలాంటి భావాల్ని మననం చేసుకుంటూ, ఖాళీసీటుకోసం వెదికాను. సిల్కుషర్టు, గోల్డ్ కవరింగ్ గుండీలు, పచ్చరాతి ఉంగరం, గోల్డ్ రిమ్ కళ్ళజోడు, మల్లుధోవతి ధరించి మహానందంగా కనబడుతూన్న వ్యక్తి ఇంగ్లీషులో 'దయచేసి ఇలా వస్తారా సార్,' అని చిరపరిచితుడిలా పిలిచాడు. ఆయన తియ్యని మాటలకీ, ప్రేమకీ నేను పాత్రుణ్ణికాను. ఆ వినయం, ఆ టక్కులూ అన్నీ హోటల్‌కి సంబంధించినంతమటుకేఅని కొంతఆలస్యంగా గ్రహించగలిగాను.

హోటల్లో కొంచెం చీకటిగాఉన్నమూల ఓ బల్ల ఖాళీగఉంది. అటువైపు దారిచూపాడు ఆ అపరిచితవ్యక్తి. తక్షణం ఖాళీచోట్లో వెళ్ళి కూచున్నాను. హోటల్ కుర్రవాడు నా ఎదుట నిలబడి, 'ఏంకావాలి సార్?' అని అడిగాడు. 'కాఫీ! చక్కెర, డికాక్షన్ హెచ్చు'! అన్నాను నేను.

'వేరే ఏమీవద్దా సార్?' అని రెండోసారి అడిగాడు హోటల్ కుర్రాడు. నాలో అణగారిఉన్న కోరికలు విజృభించసాగాయి. వాటిని మనస్సులోనే అణచుకుంటూ, బల్లచుట్టూ కలయజూశాను. పరిచయాలు ఎన్నోరకాలు. రైలు పరిచయంలాంటిదే హోటల్ పరిచయమున్నూ, ఇదో కొత్తరకం! అక్కడ కూచున్నంతసేపూ కులాసాగా కబుర్లాడుకునేందుకి తగిన వ్యక్తి దొరుకుతాడేమో అన్నట్టు చుట్టూ మరోసారి కలయజూశాను.

చూద్దునుగదా, ఆయన నా ఎదుటే కూచున్నాడు! అవును, ఆయనే! రఘూ నేనూ ఆ రోజు రోడ్డుమీద పోతూండగా, రఘూ చూడటానికి ఇష్టపడని వ్యక్తి వచ్చి ఇప్పుడు నా ముందు కూచున్నాడు. ఆయనే! సదాశివ మమ్మేలియార్ అని చెప్పాడే; ఆయనే! సందేహమేమీలేదు. అదే జరీ కండువా, అదే వాకింగ్ స్టిక్, అదే ముఖం. అదే మీసాలు, సాక్షాత్తూ ఆయనే!

అతనూ ఒక్కనిమిషం నాకేసి పరీక్షగా చూశాడు; ముఖం చిట్లించుకున్నాడు; మీసాలు దువ్వడం మొదలుపెట్టాడు. భుజంమీద కండువా ఒక్కసారిలాగి సరిచేసుకున్నాడు మరోసారి పరీక్షగా నాకేసి చూశాడు.

ఈ లోగా ఆయనవైపు జాగ్రత్తగా చూడగలిగాను. సాధారణంగా మొట్టమొదటిసారి ఆయన్ని చూసేవాళ్లెవరయినా చాలా పెద్దమనిషి అనే అనుకుంటారు. ముఖంలో, వేషంలో, భావనలో ఓ రకమైన హుందాతనం ఉట్టిపడుతూంది. ఆ హుందాతనాన్ని అస్పష్టంగా, లీలగా కదిలే నీడలాంటిదేదో కప్పిపుచ్చుతున్నట్టు ఉంది! నిదానించి చూస్తే తొలిచూపుల్లో ఊహించుకున్నదంతా తప్పేనని అనిపిస్తూంది.

కాస్త తెల్లబడిన మీసాలు, ఎత్తైన విగ్రహం, ఎర్రని దేహచ్ఛాయ, విశాలమైన నుదురు, కణతలమీద వెనక్కి తిరిగిన తెల్లవెంట్రుకలు, పొడువైన చేతులు, కాడల్లాంటి వేళ్ళు, తళతళ మెరిసే జరీకండువా, సిల్కుజుబ్బా, ఆకుపచ్చ నీలం ఎరుపు రాళ్ళు పొదిగిన ఉంగరాలు—ఇదీ ఆయన వేషం! ఆయన ఉంగరాల్ని గమనిస్తూ, ఒక్కసారి నా వేలివైపూ చూసుకున్నాను. నా ఉంగరం వెలుగులు చిమ్మటం లేదు. మబ్బులు కమ్మిన మేఘంలా ఉంది.

సదాశివ మమ్మేలియార్ ఆ ఉంగరాన్ని గూర్చే మాట్లాడుతూ సంభాషణ మొదలుపెట్టటం

ఆశ్చర్యం వేసింది. 'మంచి నీలమే! ఈ రోజుల్లో ఇలాంటి నీలం దొరకటం కష్టం సార్!' అన్నాడు, నా ఉంగరంవేపు చూస్తూ.

నా ఉంగరాన్ని మమ్మేలియార్ ఉంగరాన్ని మళ్ళా, మళ్ళా చూస్తూ 'ఏమంత మంచినీలం కాదే,' ఒక్కొక్కమాటే మెల్లమెల్లగా అన్నాను.

'మీ మామగారి ప్రెజెంటా? మీ ఉంగరం ఖరీదైందిఅంటే వొప్పుకోరన్నమాట!' అన్నాడు మమ్మేలియార్.

'మంచి ఆరితేరిన ఘటం! కొత్తవాళ్లతో చలాకీగా మాట్లాడే తెలివితేటలున్నాయి. గట్టివాడే!' అని మనసులోనే అనుకుంటూ, ఒక నవ్వునవ్వి, 'బేష్! అంత త్వరగా తంజావూరువాళ్లని పట్టు పడిపోయారే!' అన్నాను.

మమ్మేలియార్ ఆశ్చర్యం ప్రకటిస్తూ అన్నాడు: 'మీదేఊరు?'

'నేనూ తంజావూరుజిల్లావాణ్ణే లెండి! కుంభకోణందగ్గర సాత్తనూర్!' అన్నాను చిరునవ్వు నవ్వుతూ.

'అలా చెప్పండిమరి! ఇహమీదట కాస్త జాగర్తగా మసలుకోవాలి!' అన్నాడు గట్టిగా నవ్వుతూ.

నేనూ ఫక్కున నవ్వేశాను.

కుర్రవాడు కాఫీతెచ్చి బల్లమీద పెట్టాడు. కాఫీ కప్పులోకివంచి ఆరుస్తూ, 'ఏమయినాసరే, తంజావూరులో ఇప్పటిదాకా మంచికాఫీ దొరుకుతూంది. ఇంతమంచికాఫీ ఏ ఊళ్ళోనూ దొరకదు,' అన్నాను.

'ఈ హోటల్లో కాఫీ మరీ బాగుంటుంది' అన్నాడు సదాశివమమ్మేలియార్.

నాకు నచ్చిన ఇంకో కాఫీక్లబ్‌ని గురించి చెప్పాలనుకున్నాను. వీలయితే మాటలమధ్య సదాశివ మమ్మేలియార్ అన్నగారి ఇద్దరు కుర్రవాళ్ళని ఆ కాఫీక్లబ్బులో చూసిన సంగతికూడా చెప్పాలనుకుంటూ మొదలుపెట్టాను: 'అయ్యన్‌మార్కెట్ వీథిలో, పాత్రసామాను అంగడులమధ్య......'

'అవునవును. ఆ మణి అయ్యర్ క్లబ్‌లో కూడా కాఫీ బాగుంటుంది. కాని దానికన్నా 'వీట్ హల్వా' అక్కడ బాగుంటుంది. పూర్వం ఆ హోటల్లోంచి రోజూ రెండుశేర్ల హల్వా మా ఇంటికొనుస్తూండేది' అన్నాడు సదాశివ మమ్మేలియార్. నిట్టూరుస్తూ, వగరుస్తూ మాట్లాడలేదాయన! గర్వం ఎక్కడా పిసరంతకూడా ధ్వనించలేదు ఆ మాటల్లో. వెనుకటిలాగా ఇప్పుడు ఏదీ జరగటం లేదు అన్న అత్యల్ప విషయాన్ని నాతో ఏకరువు పెడుతూన్నట్టు నెమ్మదిగా మాట్లాడాడు.

నేను కాఫీ చప్పరిస్తూ కొద్ది కొద్దిగా తాగాను. నేను ఆరంభించే లోగానే కాఫీ పూర్తిగా తాగేశాడు సదాశివ మమ్మేలియార్! బిల్లురాసి బల్లమీద ఆయన ముందుంచాడు హోటల్ కుర్రవాడు. వెంటనేలేచి వెళ్ళిపోలేదాయన. నేను కాఫీ పూర్తిగా తాగేదాకా లేవకుండా కాచుకూర్చున్నాడు.

'మీరు బలేవాళ్ళండి! ఊరికి కొత్త అయినా వచ్చి రావటంతోటే ఊళ్ళో హోటళ్ల మంచి చెడ్డలన్నీ తెలుసుకున్నారే,' అన్నాడు సదాశివ మమ్మేలియార్ విస్తుపోతూ.

కుర్రవాడు నా బిల్లు తీసుకొచ్చాడు. 'ఇలా ఇవ్వు!' అంటూ నా బిల్లుకూడా ఆయన తీసుకోబోయాడు 'అక్కర్లేదు; నేనే ఇచ్చేస్తాను. మీ బిల్లుకూడా నా చేతికివ్వండి' అని మర్యాదకోసం అడిగాను. అడిగిన వెంటనే తడుముకోకుండా బిల్లు నా చేతికిచ్చేశాడు!

కౌంటర్ దగ్గర బిల్లు చెల్లించి వీథిలోకి నడిచాము. టవర్‌క్లాక్‌లో ఐదు ముప్పావు కావస్తూంది. ఇంకా చీకటి పడలేదు. వాలుగా పడు

తూన్న అస్తమయ కిరణాల వెలుగులో టవర్‌క్లాక్ పై భాగం ధగధగ మెరుస్తోంది! వీథిలో ఎర్ర ధూళిరేగి నలువైపులా వ్యాపించింది. మల్లెపువ్వు లాంటి తెల్లధోవతి అంచు చేత్తో వయ్యారంగ పట్టుకుని, పెద్దమనిషి తరహాగా, హుందాగా, బరువుగా అడుగులువేస్తూ ముందుకి నడిచాడు సదాశివమమ్మేలియార్.

కొంతదూరం నడిచాక నన్నుచూసి సన్నగా నవ్వుతూ, 'ఈవినింగ్ వాక్ వెళుతున్నారుకాదూ? స్టేషన్‌వైపు వెళదాం, ఏమంటారు? నేనూ అటు వైపే వెళ్ళాలి!' అన్నాడు.

'అలాగే వెళదాం!'అంటూ బరువుగా అడుగులువేస్తూ మమ్మేలియార్‌వెంట నడిచాను నేను.

రోడ్డుప్రక్కన నిలబడి గప్పాలు కొడుతున్న యువకులు నాకేసిచూస్తూ నవ్వుతూన్నట్టుంది. కొంతదూరం వెళ్ళాక తిరిగిచూశాను. నన్నుచూసే నవ్వుతున్నారు వాళ్ళు. వెనక్కితిరిగి చూసేసరికి ఒక్కక్షణం నవ్వడం ఆపి రోడ్డువైపు చూస్తూ మళ్ళీ నవ్వడం మొదలుపెట్టారు. వాళ్ళల్లో ఒ గడుగ్గాయి గట్టిగా, నాకు బాగా వినిపించేటట్టు, 'ఈ రోజు మంచిశాల్తీ దొరికిందయ్యా!' అని నవ్వాడు. నాకూ నవ్వొచ్చింది.

ఆ యువకులు పొగరుబోత్తనంగా మాట్లాడటం నాకు వినబడింది. సదాశివమమ్మేలియార్‌కి కూడా వినబడి ఉండాలికదా? వినిఉంటే ఏమనుకుంటున్నాడో ముఖకళవళికల్నిబట్టి తెలుసుకోవాలనుకుని ఆయనవైపు చూశాను. మాద్దునుగదా, చక్కగా మీసాలు దువ్వుకుంటున్నాడాయన. నాకు స్పష్టంగా తెలిసే మార్పేమీలేదు ఆయన ముఖంలో; ఏభావమూ స్ఫురించలేదు.

ఈలోగా వాళ్ళల్లో మరో యువకుడు మొదట మాట్లాడినవాడికి సమాధానం చెప్పుతూన్నట్టు, నాకు వినబడేటట్టు, 'కొత్తశాల్తీయే! చూస్తే తెలీటంలేదూ? ఎవరో తెలివితక్కువ శాల్తీ! ఇంటికి వెళ్ళేతర్వాత తల్లిగారి ఒడిలో తలదాచుకుని ఏడ్చేరకం!' అన్నాడు.

'హుమ్, హుమ్' అని రాగాలుతీస్తూ ఏడుపు కూడా అభినయించాడు. ఆ గడుగ్గాయి నన్నిలా పరిహసించటం నాకూ నవ్వుగానే ఉంది! చిరునవ్వు నవ్వుతూ వెనక్కి తిరిగి చూశాను. నేను నవ్వుతూన్నట్టు కనిపెట్టేశారు వాళ్ళు. వాళ్ళు మాట్లాడిందంతా నాకు వినబడిందని వాళ్ళకీ తెలిసిపోయింది. వాళ్ళ చూపులే ఈ సంగతి బయట పెట్టినయి.

సదాశివ మమ్మేలియార్ అన్నాడు. 'ఇప్పుడు వెలుతురులో చూస్తే మీ ముఖం గుర్తుకు వస్తోంది. మిమ్మల్ని ఇక్కడే సరిగ్గా ఇదేచోట రెండు మూడు రోజులక్రితం చూసినట్టు జ్ఞాపకం. నే ఎరుగున్న ఎవరో పెద్దమనిషితో చూశాను. అంచేతే జ్ఞాపకం ఉంచుకోగలిగాను. ఎవరతను? ఎవరితోటి చూశానూ......? చటుక్కుని జ్ఞాపకం రావటం లేదే.........!'

నేను అర్ధోక్తిలో అడ్డుతగిలి 'నా స్నేహితుడు రఘురామన్ వెంట వెళుతున్నాను. చిన్నప్పట్నించి ఇద్దరం కలిసి చదువుకున్నాం...ఉత్తరపు వీథిలో..' అంటూ ఏదో అనబోయాను.

'అవునవును...ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది. రఘూతోటే వెళుతున్నారుకదూ? ఆ రోజు మీకేసి ఎగాదిగా చూశాను. ఏదో పనిమీద తొందరగా పోతున్నారు. పిలిచి పలుకరిద్దామనుకున్నాను. కాని మళ్ళీ ఏదులే అనుకుని వెళ్ళిపోయాను; రఘూతో నాకు బాగా పరిచయమే...' అన్నాడు మమ్మేలియార్.

'రఘూ అంటే నా కెంతో ఇష్టం! నాతో కలిసి చదువుకున్నవాడు! ఇరవై, ఇరవై ఐదేళ్ళ స్నేహం మాది! అన్నదమ్ముళ్ళాంటి వాళ్ళం!' అన్నాను ఉత్సాహంగా.

'రఘులాంటి మనిషి లక్షమందిలో ఒకరిద్దరు దొరకొచ్చు! మా బాబు బంగారం! నాకూ రఘూ బాగా తెలుసు.'

రఘూనిగూర్చి అన్నాడు కనుక సరిపోయింది. తక్కినవాళ్ల నెవరినిగురించి అయినా ఇలా మాట్లాడితే నమ్మడానికి వీల్లేదు. కోతలు కోస్తున్నాడు అనుకునేవాణ్ణే. అక్కణ్ణించి ఎలాగైనా తప్పించుకుని బైటపడేవాణ్ణే. రఘూనిగూర్చి వేరే అభిప్రాయం అంటూ ఉండదు! ఎవరు చెప్పినా అంతే చెప్పాలి! సదాశివమమ్మేలియార్ ఉన్నమాటే అంటున్నాడు! మమ్మేలియార్‌కి రఘూఅంటే ఎంత అభిమానం! ఎంత గౌరవం! మరి మమ్మేలియార్ పేరెత్తితే, రఘూకి అంత చిరాకెందుకు? అతనంటే ఎంత నిర్లక్ష్యం! ఎంత అసహ్యం! అలా విసుక్కుంటాడెందుకో మరి? ఏమీ బోధపడటంలేదు.

'మీరు ఈ ఊరొచ్చి ఎన్నాళ్లయింది?' సదాశివమమ్మేలియార్ అడిగాడు.

'వారం రోజులయుంటుంది. సరస్వతీమహల్లో చదువుకోటానికి వచ్చాను. ఇంకో నాలుగైదురోజులుంటాను,' అన్నాను.

'అదా సంగతి!......ఆ రోజు మా తమ్ముడు చెప్పాడు, సరస్వతీమహల్ గేటుదగ్గర రఘు ఎవరో కొత్తమనిషితో మాట్లాడుతూంటే చూశానని,' అన్నాడు సదాశివమమ్మేలియార్.

ఇద్దరం మాట్లాడుకుంటూ కొత్తచెఱువు బ్రిడ్జిదాకా నడిచాము. బ్రిడ్జిమీద ప్రహరీగోడ కానుకొని విరబోసినజుట్టు తడి ఆర్చుకొంటున్న ఒకతను, దూరంగా వస్తున్న మా ఇద్దర్నీ చూశాడు. వెంటనే లేచి నిలబడి మాకేసి వస్తున్నాడు. మా దగ్గిరికిరాగానే, 'ఏమిటి సదాశివ భావా! రోజూ వెళ్లేచోటికేనా?' అని అడిగాడు మమ్మేలియార్ కేసి చూస్తూ.

ఇలా ప్రశ్నించినాయన వయస్సు ముఖాన్ని బట్టిచూస్తే యాభైయో, యాభై రెండో ఉండొచ్చు. శరీరంలో పటుత్వం తగ్గలేదు. కాస్త జాగ్రత్తగా పరిశీలనగాచూసి ఉండకపోతే, బహుశా చిల్లరకొట్టు మొదలియారేమో నని మోసపోయేవాణ్ణే!...

'మా పక్కింటాయన. గొప్ప మిరాసీదారు. వ్యాపారస్థులు. ఇవి చాలక ఇటీవలే జిల్లా కంట్రాక్టు ఒకటి తీసుకున్నారు. పేరు రత్నవేలు మొదలియార్' అన్నాడు మమ్మేలియార్.

మొదలియార్‌కేసి చూస్తూ, 'నమస్కారం' అంటూ చేతులు మోడ్చాను.

'పేరులోమట్టుకేకాదు, రత్నాలపరీక్షలోకూడా ఆరితేరినవారు వీరు,' అన్నాడు మమ్మేలియార్ నాకేసి తిరిగి నవ్వుతూ.

నేను చేతులు మోడ్చి నమస్కరిస్తూన్నప్పుడు నా వ్రేలికిఉన్న ఉంగరం మమ్మేలియార్ దృష్టి నాకర్షించిందేమో!

మొదలియార్‌కేసి చూస్తూ, 'సార్‌దగ్గర నీలంరాయి ఉంగరం ఉంది. శ్రేష్ఠమైన ఉంగరం,' అంటూ సదాశివమమ్మేలియార్ నా ఉంగరాన్ని ఊడదీసి ఇవ్వమని పుచ్చుకున్నాడు. పరీక్షించి చూడమని ఉంగరం మొదలియార్ చేతికిచ్చాడు.

మొదలియార్ ఉంగరాన్ని నిర్లక్ష్యంగా అందుకుంటూ ఓరకంట ఓసారిచూసి, వెంటనే 'కొత్తనీలం' అని తీర్పు చెప్పేశాడు! ఉంగరం నా చేతికిచ్చాడు.

అసలు నా ఉంగరం కొత్తనీలమా? పాతనీలమా? అన్న సంగతి నాకనవసరం! నా ఉంగరం మూలాన వీళ్లిద్దరూ తమతమ నిజస్వరూపాలతో బైటపడుతున్నారుగద! అంతకంటే ఇంకేం కావాలి?

'కొత్తనీలం' అని మొదలియార్ అన్నందుకు

కోపం వచ్చిందేమో ! 'కొత్తనీలానికీ పాతనీలానికీ పొద్దుగ్రుంకేవేళలో ఇలా నడిరోడ్డున నిలబడి చూస్తే తేడా కనిపిస్తుందా?' అన్నాడు సదాశివ మమ్మేలియార్.


ఇలా అన్నతర్వాత మొదలియార్ వేపు చూస్తూ మమ్మేలియార్ కన్ను గీటాడేమో అని నా అనుమానం !

కొంచెంసేపయింతర్వాత సదాశివమమ్మేలియార్ 'మంచిభాగ్యవంతులు తమ అల్లుడిగారికి కొత్త నీలం ఉంగరం కొని పెడతారా? మీకు రత్న పరీక్షలో బాగా పరిచయంలేదేమో ! అన్నాడు, మొదలియార్ కేసిచూస్తూ.

ఆప్పైన, 'మొదలియార్‌గారూ, ఇహ ఉంటారా? మేం వెళ్లొస్తాం' అంటూ శీఘ్రంగా ముందుకి నడిచాడు. పదడుగులు నడిచాక వెనక్కి తిరిగి చూశాను. మొదలియార్ ముఖంనిండా అసంతృప్తి !


నా కుటుంబం ధనికకుటుంబమై యుండాలి అని మమ్మేలియార్ ఊహ. ఆ సంగతి అందరి తోటీ గొప్పగా, ఒడుపుగా వెల్లడిస్తూ నా మెప్పు కోరుతున్నాడు. మమ్మేలియార్ తెలివికి లోలోన మెచ్చుకుంటూ, స్టేషన్‌దాకా అతనితో నడిచాను.

(సశేషం)



సిరికొండ శిలాశాసనము

శ్రీ బి. ఎన్. శాస్త్రి



'సిరికొండ' కోట, ఆలయములు మంటపముల దృశ్యము

నల్లగొండ మండలములోని సూర్యాపేట తాలూకాలోని 'సిరికొండ' గ్రామము వెలుపల నాగులబండ వద్ద కల్యాణిచాళుక్యులనాటి శిలాశాసనమున్నది. సూర్యాపేట—ఖమ్మంరోడ్డుపైన సూర్యాపేటనుండి పదిమైళ్ల దూరములోనున్న 'మోతె'స్టేజినుండి సుమారు మూడుమైళ్లదూరములో 'సిరికొండ' గ్రామమున్నది. 'మోతె'స్టేజినుండి 'సిరికొండ' గ్రామమువరకు సమితి రోడ్డున్నది.

'సిరికొండ'కొండపై కోట కట్టబడినది. అతిప్రాచీనమై శిథిలావస్థలోనున్న ఈ కోట కల్యాణి చాళుక్యుల కాలమున నిర్మింపబడినది. కొండ అంచులో 'సిరికొండ' గ్రామమున్నది. నేడది పెద్ద గ్రామము. గ్రామపంచాయతీ కలదు. పూర్వము వైభవముతో వొప్పారినది.

'సిరికొండ' గ్రామమునకు మూడువైపుల చెఱువులున్నవి. కొండ అంచులనుండి కట్టలు పోయబడి, కొండనీరు, చుట్టుప్రక్కల వరదనీరు వచ్చి నిలుచునట్లు తటాకములు నిర్మింపబడినవి.

'సిరికొండ' గ్రామము వెలుపల కొండకు తూర్పున, నాగులబండ వద్ద, పశ్చిమచాళుక్య వంశీయుడగు, ప్రతాపచక్రవర్తి రెండవ జగదేకమల్లునికాలపు శిలాశాసనమున్నది. ఈ శాసనమును

రెండవ జగదేకమల్లుని సామంతుఁడును, మహామండలేశ్వరుఁడును ఐన కందూరి ఉదయనచోడ మహారాజునుండి, కొండపల్లినాఁడును శాసనబద్ధముగా బడసిన 'కేతయ' శివాలయముల నెత్తించి, ఆలయములలోని దేవరలకు, అంగరంగభోగములకు, హవిబలి అర్చనాదులకు, భూమి దానమిచ్చు సందర్భమున వేయించెను. ఈ శాసనము తెలుగుభాషలో వేయింపబడినది. శాసనాంతమున వ్యాసగీతాశ్లోకము లున్నవి.

సిరికొండ :

సిరికొండ ప్రాచీనమైన గ్రామము. పూర్వమీ గ్రామము కేతయ మహామాండలికుని రాజధాని నగరము. నేఁడు గ్రామమున శిథిలరూపముననున్న ఆలయములు, గుళ్లు, కోనేరులు, ఇండ్లపునాదులు కనిపించుచున్నవి. పూర్వ మీ గ్రామము జైనులకు, బౌద్ధులకు ఆవాసముగ నుండెను. జైనమత మాంధ్రదేశమున సన్నగిల్లుకాలమున బౌద్ధమతము విజృంభించినది. బౌద్ధము రాజాదరము కోల్పోవుకాలమున వైదికము విజృంభించినది. వైదికమతమున మొదట శైవము, తరువాత వైష్ణవము వ్యాపించినవి. సిరికొండప్రాంతము తొలుత జైనులకు, తరువాత బౌద్ధులకు నివాసస్థానముగ నుండెను. బౌద్ధజైనమతములకు సంబంధించిన శిల్పములు, విగ్రహములు ఈ ప్రాంతమున విశేషముగా కనిపించుచున్నవి. శైవము వ్యాప్తిలోనున్న కాలమున, జైనబౌద్ధవిగ్రహములు, శైవుల ఆగ్రహమునకు గురియై, దేవాలయములను, మఠములను వీడి దిగుడుబావులలో స్థాన మేర్పరచుకొనినవి. బావుల పూడిక తీయుచుండ బయలుపడిన బౌద్ధ జైన మతములకు సంబంధించిన విగ్రహములను గ్రామీణులు, ముత్యాలమ్మగుడిలోను, దిగుడుబావి వద్దగల తుమ్మచెట్లదగ్గరను నిలిపినారు.

వేలకొండపల్లి, ఫణిగిరి, గాజులబండ, సిరికొండ, జగ్గయ్యపేట, రామిరెడ్డిపల్లి, ఇంద్రపాలనగరము, బౌద్ధుల కావాసనగరములు. బౌద్ధసన్యాసులకు, ఛాత్రులకు, నిలయములైన ఈ నగరములు, బౌద్ధవిద్యాలయములుగా ప్రసిద్ధిచెందినవి. కల్యాణి చాళుక్యులకాలమున జైనమతము పోషింపబడినది. కాలక్రమమున జైనబౌద్ధమతములు వైదికమత ప్రాబల్యమువలనను, ప్రజల నిరాదరణమువలనను క్షీణించినవి.

సిరికొండ గ్రామముననున్న ఆలయములలో శివాలయము, వేణుగోపాలస్వామి ఆలయము ముఖ్యమైనవి. శివాలయము కూలిపోయి శిథిలరూపమున కనిపించుచున్నది. శివలింగము, తల నఱికివేయబడిన నందివిగ్రహము, చూచుట కందముగా నున్నవి. గ్రామమునగల మరికొన్ని ఆలయములు నామరూపములు లేకుండా శిథిలమైనది. నాగులబండ వద్దగల శివాలయము శిథిలమైనది. ఆలయ శిథిలములకు చిహ్నములుగా, నాగులు చెక్కబడినరాళ్లు, లింగము, పానవట్టము, శిలాశాసనము కనిపించుచున్నవి.

సిరికొండగ్రామమున రెండు తెల్లరాతి శాసనము లున్నవి. ఈ శాసనశిలలు విరిగిపోయినవి. ఇవి ప్రాచీనమైనవికావు. ఈ రెండు శిలలు ఇండ్ల మూలమలుపులకు పాతబడినవి. అక్షరములు చెదిరిపోయి చదువుట కనుకూలముగాలేవు.

'సిరికొండ'గుట్ట ఒకేరాతితో ఏర్పడినట్లున్నది. మొదట విశాలమైన పరుపుబండ, మధ్య ఎత్తైనకొండ, తూర్పువైపు కొంతవరకు పరుపుబండ కలిగి సుమారు నాలుగుమైళ్ల చుట్టుకొలత కలిగియున్నది. కొండ నెక్కుటకు మెట్లున్నవి. ఇవి చెక్కుచెదరకుండా నున్నవి. కొండచుట్టుకోటగోడ నిర్మింపబడినది. సున్నము-రాయి కలిపి నిర్మించిన ప్రాకారకుడ్య మక్కడక్కడ కూలిపోయినది. కొండపైన శివాలయములు, మంటపములు, ఇండ్లపునాదులు, బంకులు, ధాన్యాగారముల అడుగులు, రాణివాసగృహములు కనిపించుచున్నవి. భువనగిరి దుర్గమువలె సిరికొండదుర్గము

ఏకశిలాదుర్గము. కాని భువనగిరిదుర్గము చాల ఎత్తైనది. సిరికొండ చిన్నకొండ. కొండవాలులో మూడు చెఱువులు నిర్మింపబడినవి.

సిరికొండ నేలకొండపల్లికి ముప్పైమైళ్ల దూరమున నున్నది. నేలకొండపల్లి కందూరి చోడులరాజ్యమునను్న మండలము. కొండపల్లినాడు లోనిదే సిరికొండరాజ్యము. కొండపల్లినాడును శాసనబద్ధముగా బడిసి కేతయనాయకుడు సిరికొండరాజ్యమును పాలించుచుండెనని శాసనమువలన తెలియుచున్నది. ఈ ప్రాంతమున కందూరిచోడులకు సంబంధించిన అనేకశాసనములు కనిపించుచున్నవి. అందు ముఖ్యముగా నేలకొండపల్లి[1] ఆగామోతుకూరు[2] పానగల్లు[3] కందుకూరు[4] మల్లేపల్లి[5] ఏలేశ్వరం[6] ప్రాంతములలో నున్నవి కందూరిచోడుల చరిత్ర తెలిసికొనుటకు తోడ్పడుచున్నవి.

సిరికొండగ్రామమునగల ఆలయములలో శివాలయము, వేణుగోపాలస్వామి ఆలయములు పేర్కొనదగినవి.

శివాలయము :

ఈ ఆలయము గ్రామము మధ్యలో నున్నది. చుట్టుప్రాకారముకలిగి, మంటపద్వారము, విశాల

---

1. Hyderabad Archaeological Series-No. 19. Km. 15.


2. అప్రకటిత శాసనము.

3. Hyderabad Archaeological Series-No. 13–2; Page 96; 105-109.

4. అప్రకటిత శాసనము.

5. A. P. Govt. Arc. Series No. 22. No. 307.

6. A. P. Govt. Arc. Series No. 22. Nos. 333; 339; 344; 357; 358.



సిరికొండలోని నారాయణదేవర ఆలయము.
వేణుగోపాలస్వామి ఆలయమని నేడు పిలువబడుచున్నది.

మైన 16 స్తంభముల మంటపము, గర్భగుడి కలిగి చూడముచ్చటగానున్నది. కాని ఈ దేవాలయము శిథిలమైనది. స్తంభములు ఒరిగి, కప్పు కూలి మండపములు ఆకారమును కోల్పోయినవి. ఆలయమునగల శివలింగము ఎత్తైనది. గర్భగుడి ముందుగల మంటపమున నందివిగ్రహమున్నది. నల్లరాతితో చక్కగా మలచబడిన ఈ నందివిగ్రహము తల విఱిగిపోయినది. ఈ ఆలయద్వార మిప్పుడు మూసివేయబడినది. ఆలయప్రాకార కుడ్య మక్కడక్కడ పడిపోయినది. పడిపోయినరాళ్లతో దొడ్లు, ఆలయముచుట్టుగల కుడ్యములపై ఇండ్లు, గుడిసెలు, గ్రామీణులు నిర్మించినారు. చాళుక్య శిల్పసంపదతో నొప్పారు ఈ ఆలయము శిథిలమై యుండుట విచారింపదగినది.

వేణుగోపాలస్వామి ఆలయము :

ఈ ఆలయము చుట్టు ప్రాకారకుడ్యముకలిగి చెక్కుచెదరక నిలిచియున్నది. ఇది శివాలయమునకు కొలదిదూరములో నున్నది. ఆలయ మతివిశాలమైనది. బహుశః శాసనమున పేర్కొనబడిన నారాయణదేవర ఆలయ మిదియేయై యుండవచ్చును. ఈ ఆలయమున గర్భగుడిలోగల మూర్తి—నారాయణ దేవర లేక వేణుగోపాలస్వామి విగ్రహము లేకుండా శూన్యముగా నున్నది.

ఆలయముముందుద్వారము నాలుగు స్తంభములపై నిర్మింపబడి చక్కని చెక్కడములతో నొప్పారుచున్నది. ఆలయముముందు మంటపమున్నది. ఈ మంటపముముందు నాలుగు స్తంభములతో చిన్న మంటపమును కలిగియున్నది. గర్భగుడి నానుకొని యున్న మంటపము చేరుటకు మెట్లు ఇక్కడే ఉన్నవి. గర్భగుడి నానుకొనియున్న మంటపము విశాలమై నాలుగు వరుసలలో వరుసకు నాలుగు స్తంభముల చొప్పున 16 స్తంభములు కలిగి యున్నది. దాని తరువాత గర్భగుడి నానుకొని అంతరాళికమున్నది. అంతరాళికము నానుకొని ముఖమండపము నిర్మింపబడినది. గుడిగోపురము ఎత్తైనది. ఆలయ ఆవరణములో ఆంజనేయస్వామి విగ్రహము, ద్వారపాలకుల విగ్రహము లున్నవి. ఆలయ స్తంభములపై ఏనుగులు చెక్కబడినవి. ఆలయము పైభాగమున, ద్వారతోరణముల పైభాగమున, కప్పుకు క్రిందుగా కొన్నిగోపురప్రతిమలు చెక్కబడినవి. ఇవి ఆలయ శిఖరాకారమును సూచించునట్లు చెక్కబడినవి. ఈ ఆలయము గ్రామీణులలో కొందరికి, విశ్రాంతిస్థలముగా, మరికొందరికి పేకాట స్థలముగాను వినియోగపడుచున్నది.

శాసనము—ఆకారాదికములు :

ఈ శాసనములు నాగులబండ శివాలయమున కనతిదూరములో పొలముప్రక్క పడియుండ, సిరికొండ గ్రామవాస్తవ్యులగు శ్రీ ఎన్. సత్యనారాయణ రెడ్డిగారు శాసనశిలను నాగులబండమీదికి చేర్పించి, చెక్కడముకలిగిన రాతిదిమ్మెపై నిలిపినారు. శాసనము నల్లరాతిపై చెక్కబడినది. ఈ శాసనశిల మూడువైపుల కేతయనాయకుడు వేయించిన శాసనమును నాలుగవప్రక్క వేరొక శాసనమును చెక్కబడినవి. నాలుగవప్రక్క చెక్కబడిన శాసన మర్వాచీనమైనది. ఇందలి అక్షరములు అఱిగి, లోతుగా చెక్కబడియుండనందున చెదిరిపోయినవి. అక్షరములు చదువుటకు వీలులేకుండా నున్నవి. ఫొటో ప్రతులలోగాని, పేపరుపైనగాని ఈ శాసనము చక్కగా రాలేదు.

మొదటి శాసనము మూడువైపుల తెలుగు భాషలో వేయింపబడినది. కందూరి ఉదయనచోడ మహారాజునుండి కొండపల్లినాడును శాసనబద్ధముగా బడసి సిరికొండరాజ్యమును మహామాండలిక కేతయ పాలించుచు, దేవాలయముల నిర్మించి, పూజాదికము లకు భూమిని దానమిచ్చు సందర్భమున ఈ శాసనమును వేయించెను.

ఈ శాసనశిల పొడవు 1.30 మీటర్లు, వెడల్పు 1, 3 ప్రక్కలు 0.37 మీటర్లు,

2, 4 ప్రక్కలు 0.32 మీటర్లు. శాసనశిఖరము 0.20 మీటర్లు. శాసనము చెక్కబడిన భాగము 1.10 మీటర్లు. మొదటిప్రక్క శాసనారంభమున సూర్యచంద్రుల చిహ్నములు, నంది, పానవట్టముతోకూడిన శివలింగము, వృషభము చెక్కబడినవి. ఇవి యన్నియు శైవమతచిహ్నములు.

ఈ శాసనమున మొదటిప్రక్క 27 పంక్తులు, రెండవప్రక్క 35 పంక్తులు, మూఁడవ ప్రక్క 19 పంక్తులు మొత్తము 81 పంక్తులున్నవి.

లిపి :

ఈ శాసనమున పండ్రెండవ శతాబ్ది పూర్వార్థమున ఆంధ్రదేశమున ముఖ్యముగా తెలంగాణా ప్రాంతమున వాడుకలోనున్న లిపి వాడబడినది. ఇది తెలుఁగు కన్నడలిపి. శిల్పి కడుజాగరూకతతో అక్షరములను చెక్కినాఁడు. ఐనను అచ్చటచ్చట కొన్ని అక్షరములను చెక్కుట మరచిపోయి, అక్షరముల పైనగాని, క్రిందగాని, మరచిపోయిన అక్షరములను చెక్కినాడు. శాసనమున మొదటిప్రక్క 24—27 వరుసలలో చివరిభాగము విరిగిపోయినది. అచట కొన్నిఅక్షరములులేవు. శాసనాక్షరములు మొదటి ప్రక్క పెద్దవిగను, రెండవప్రక్క చిన్నవిగను చెక్కబడినవి. మూఁడవప్రక్క చెక్కబడిన అక్షరములు అచ్చటచ్చట చెదిరినట్లు కనిపించినను మొత్తముపై శాసనము సుందరముగ చెక్కబడినది. మొదటిప్రక్క 16 వ పంక్తిలో 'మణ్డలేశ్వర కందూరి'లో 'ర' అక్షరము మొదట చెక్కుట మరచిపోయి తరువాత × గుర్తువేసి క్రింద, అనగా 'శ్వ', 'కం' మధ్యన 'ర' వ్రాయబడినది. అట్లే 18 వ పంక్తిలో 'కులనంక కాఱు' అనుచోట 'ల' మొదట చెక్కుట మరచి పోయి తరువాత వ్రాయబడినది. శాసనాక్షరములు కొన్ని చోట్ల చెదిరిపోయినవి. ఈ శాసనాక్షరములు మేడయభట్టు బొల్లేపల్లి శాసనము[7] కందూరి ఉదయనచోడ [8]మహారాజును పేర్కొను జడ్చర్ల రాచూరు[9] శాసనములు, మల్లియణభట్టు చందుపట్లకోనేరు శిలాశాసనాక్షరములను[10] పోలియున్నవి.

భాష :

ఈ శాసనమంతయు తెలుఁగు భాషలో వ్రాయబడినది. శాసనాంతమున మూఁడవప్రక్క పండ్రెండవపంక్తి చివరినుండి 'బహుభిర్వ్వసుధాదత్తా' అను శ్లోక మారంభమగుచున్నది. శాసనము చివర మూఁడు శ్లోకములున్నవి. శాసనమున ద్విత్వాక్షరములు, 'ఱ' వాడబడినవి. ఆ కాలమున వెలసిన శాసనములన్నింటియందును ఇట్లే కనిపించును. రెండు మూడు చోట్ల అనుస్వారమునకు బదులు అనునాసికాక్షరములు వ్రాయబడినవి.

ప్రవర్థమాన బదులు— ప్రవర్ద్ధమాన
చంద్రార్క — చంద్రార్క్క
ప్రవర్తిల్ల — ప్రవర్త్తిల్ల
సూర్యవంశోద్భవ — సూర్య్యవంశోద్భవ
గోడారుర — గోడాప్పుర
పర్వతము — పర్వ్వతము
తూర్పు — తూర్ప్పు
పంచమహాశబ్ద — పఞ్చమహాశబ్ద
మండలేశ్వర — మణ్డలేశ్వర

గుడులు, గుళ్లు, గుడ్లు; అళ్లపట్టు, అడ్లపట్టు; మఱుత్తురు, మఱుత్తుట్లు, మఱుత్తుర, మత్తుర; చెఱువు, చెఱువుల, సెఱ్ఱుల;—అనురూపవైవిధ్యపదములు శాసనమున కనిపించుచున్నవి.

---

7. భారతి—మార్చి 1969.

8. Hyderabad Archaeological Series No. 19. Mn 12 & 13.

9. ఆంధ్రపత్రిక—సౌమ్య ఉగాది సంచిక మార్చి 1969.

10. అప్రకటితము.

శాసనము వేయించిన కేతయనాయకునికి చాళుక్యనంకకాఱు, పడువాయెపరఘోషణః ఖట్వాంగ ధ్వజ, మహావృషభలాంఛన, ఆదిబిరుదము లున్నవి. కేతయమహామాండలికుడు, అసహాయ శౌరుడు, స్వామి భక్తికలవాడు. శాసనమున చాళుక్య రెండవ జగదేక మల్లుడు, కందూరి ఉదయనచోడుడు పేర్కొన బడినారు.

శాసన విషయము:

ఈ శాసనమును మహామాండలిక కేతయ నాయకుడు వేయించెను. శాసనము మొదట చాళుక్య వంశీయుండగు ప్రతాపచక్రవర్తి రెండవ జగదేక మల్లుడు పేర్కొనబడినాడు. జగదేకమల్లుడీ శాసన మున 'సమస్తభువనాశ్రయ శ్రీ పృథ్వీవల్లభ మహా రాజాధిరాజపరమేశ్వర పరమభట్టారక సత్యాశ్రయ కులతిలక చాళుక్యాభరణ శ్రీమత్ప్రతాపచక్రవర్తి జగదేకమల్లదేవర' అనియు, అతని సామంతుడు మహా మండలేశ్వరుడును ఐన కందూరి ఉదయనచోడ మహారాజు 'సమధిగత పంచమహాశబ్ద మహామణ్డ లేశ్వర పరమమాహేశ్వర కోడూర్పురవరేశ్వర సూర్య వంశోద్భవకులతిలక కాశ్యపగోత్ర కరికాలాన్వయ నామాది సమస్తప్రశస్తిసహితం శ్రీ మన్మహామణ్డ లేశ్వర కందూరి ఉదయనచోడమహారాజు, అని వర్ణింపబడినారు.'

మహామాండలిక కేతయ నాయకునికి అనేక బిరుదము లున్నట్లు శాసనమువలన తెలియు చున్నది. 'వేంగీదేశ చాళుక్యనంకకాఱు, పరమండల చూఱకాఱు, కాంచీపురరక్షక, కడువాయెపరఘోషణ, ఖట్వాంగధ్వజ, మహావృషభలాంఛన, భారద్వాజ గోత్ర, పల్లవకుల తిలక పాదాంబుజ సేవిత, గోడూప్పుణాపరాధీశ్వర, యన్యకామకుల కుముదినీ ముఖచంద్ర, మన్యదేవేంద్ర, బంధుజనాశ్రయి, శరణాగత వజ్రపంజర—మన్నియ బ్రహ్మరాక్షస, దుష్టాశ్వమల్ల—కునూడ్ల శాసనపతి, దేవగురు ద్విజభక్తులు నూఱుమరజముండునయిన శ్రీమన్మహా మండలిక కేతయ గొండపల్లినాడు శాసనబద్ధంబుగా బడిసి సిరికొణ్డ రాజ్యంబుసేయు చుండగా' అని శాసనమున నున్నది.

మహామాండలికుడైన కేతయ నాయకుడు సుఖసంకథా వినోదంబుల సిరికొండ రాజ్యము చేయుచు, జవ్వనాయకుని సమక్షమున దేవాలయ ముల నెత్తించి, ఆ దేవాలయములందు దేవరలకు హవి బలి వివిధార్చనలకుగాను, ధారాపూర్వకముగా భూమిదానమిచ్చెను.

సిరికొండపైనిగల జవ్వేశ్వరదేవరతో కలిపి, పంచలింగములకు, సిరికొండ తూర్పుదిశలో 15 మడ్లు అడ్లపట్టునేల. ఆ దేవరలకే మరికొన్ని చోట్ల పుట్టి, పుట్టిపండు నేలలను, నారాయణ దేవరకు, భీమేశ్వర దేవరకు, కేదార దేవరకు, వివిధములైన అర్చనలకు పలుతావులందు భూమిని దానమిచ్చెను.

పర్వతము వాయవ్యమున కేతసముద్రము వెనుక పర్వతముమీది పంచలింగాలకు మూడు మఱు తుఱ్ఱ భూమి, భీమేశ్వర దేవరకు మూండు మఱుతుఱ్ఱు, నారాయణదేవరకు రెండు మఱు తుఱ్ఱు, కేదార దేవరకు రెండు మఱుతుర్లు, జవ దేవరకు మఱుతుఱ్ఱు రెండ్డ, బ్రాహ్మణులకు మఱుతుఱ్ఱపడి, సోమసముద్రము, సూరసముద్రము, భీమసముద్రము, ఈ మూండు సముద్రములక్రింద నీరు నేల దానముగా నిచ్చెను. ధూప దీప నైవేద్య ములకు, హవి బలి అర్చనలకు, బ్రాహ్మణులకు, వివిధములైన భూములను దానమిచ్చి శాసనము వేయించెను. కేతసముద్రమును నెఱువు కేతయ పేర వెలసినట్టిది.

సిరికొండ కొండమీద నరసింహస్వామి ఆలయమున్నది. బహుశః ఈ ఆలయము కేతయ నాయకుని కాలమున వెలసియుండలేదేమో! శాస నాంతమున దానఫలమును తెలుపు శ్లోకము లున్నవి.

కాలనిర్ణయము:

ఈ శాసనము శా. శ. 1070 విభవ సంవత్సరము ఫాల్గుణ శుద్ధపాడ్యమి గురువారము

నాఁడు వేయింపబడనది. శా. శ. 1070=క్రీ. శ. 1148. చాళుక్య రెండవ జగదేకమల్లుని పరిపాలనా కాలము క్రీ. శ. 1136 – 1155; ఈ శాసనము రెండవ జగదేకమల్లుని పంద్రెండవ విజయరాజ్య సంవత్సరమున వేయింపబడినది. బొల్లేపల్లి శాసనము11 జగదేకమల్లుని పదియవ రాజ్య సంవత్సరమున అనగా శా. శ. 1068 లేక క్రీ. శ. 1146 లో వేయించినట్టిది.

కందూరి ఉదయనచోడ మహారాజు కాలము క్రీ. శ. 1140—1176; కాకతి ప్రోలరాజు కుంతోరి దేశపు రాజును జయించిన గోవిందరాజును యుద్ధమునందోడించి అతని రాజ్యమును ఉదయ రాజున కిచ్చినట్లు హనుమకొండ వేయిస్తంభాలగుడి శాసనమువలన తెలియుచున్నది. కుంతోరిదేశము నేలకొండపల్లి ప్రాంతముకాదని భావింపవచ్చును. ఈ కొండపల్లినాడును శ. సం. 1070 నాటికే ఉదయనచోడమహారాజు కేయ మహామాండలికునకు శాసనబద్ధము గావించియొసంగెను.

ఉదయనచోడమహారాజు రాజ్యము కృష్ణానదీ తీరము దక్షిణసరిహద్దుగాగలది. మహబూబునగర మండలమున గద్వాల, అలంపూరు తాలూకాలు మినహా, తక్కిన ప్రాంతమంతయును, నల్లగొండ మండలము పూర్తిగను, ఖమ్మంజిల్లాలోని నేలకొండపల్లి ప్రాంతము ఉదయనచోడుని రాజ్యమున చేరియుండెను. కందూరిచోడుల రాజధానులుగా వర్ధిల్లిన నగరములు నల్లగొండమహబూబునగర మండలములలో నున్నవి. నల్లగొండ మండలమున ఉదయనచోడుని సామంతు లనేకులుండియుందురు. అందు నేలకొండపల్లి ప్రాంతపాలకుడు సిరికొండ రాజ్యము నేలువాఁడు, కేతయమాండలికుఁడు. అట్లే పానుగల్లు, భువనగిరి, కందుకూరు ప్రాంతములందు సామంతు లుండియుందురు. కందూరు, వర్ధమాన పురము, పానగల్లు మున్నగునవి కందూరిచోడుల రాజధానీ నగరములు.

కాకతిప్రోలరాజు రెండవ జగదేకమల్లుని సామంతుడు. మహామండలేశ్వరుడు. అట్లే ఉదయన చోడుడు రెండవ జగదేమల్లుని సామంతుడు. మహామండలేశ్వరుడు. కాకతిప్రోలరాజు రెండవ జగదేకమల్లుని మరణానంతరము జైత్రయాత్రచేసి అనేకసామంతులను, మాండలికరాజులను జయించి యుండును. ఉదయనచోడుడు కాకతిప్రోలరాజుతో సమానమైనవాడు. కాకతిప్రోలరాజు చాళుక్య చక్రవర్తియగు తైలపు నోడించినపిదప, ఉదయనుడు కాకతి ప్రభువుతో చెలిమి గోరియుండును. కాకతి ప్రోలరాజు ఉదయనునకు కొంతరాజ్యమిచ్చి, తన ఆధిక్యమును చూపియుండును.

కాకతిరుద్రదేవుని కాలమున కల్యాణి ప్రభువులు రాజ్యముకోల్పోవ ఉదయనుడు, అతని కుమారులు భీమగోకర్ణులు, రాజ్యకాంక్షచే రుద్రదేవు నెదిరించి ఓడిపోయి, అతని సామంతులుగనుండనంగీకరించి, పద్మావతీదేవిని రుద్రదేవునికిచ్చి వివాహ మొనర్చియుందురు.

సిరికొండరాజ్యము కాలక్రమమున కేతయ వంశీయుల చేయిజారి కందూరి చోడుల వశమై యుండెనని భావింపవచ్చును. గణపతిదేవ చక్రవర్తి, రుద్రమాంబ పాలించు కాలమున మహబూబు నగర మండలము గోనవంశీయుల అధికారము నందుండెను. ఆ కాలమున కందూరి చోడుల రాజ్యము నల్లగొండమండలముననే పరిమితమై యుండెను. కందూరి చోడుల శాసనములలో మల్లేపల్లి శాసనము శ. సం. 1157 నాటిది. అనగా క్రీ. శ. 1235 లో వేయింపబడినది. అగామోత్కూరు శాసనము శ. సం. 1204 అనగా క్రీ శ. 1282 లో వేయింపబడినది. కాకతి రుద్రమ

---

11. భారతి – మార్చి 1969.

12. వేయిస్తంభాలగుడిశాసనము, పంక్తులు 30—33.

పాలించు నాటికి నల్లగొండ మండలమును కందూరి చోడులు పాలించుచుండిరని తెలియుచున్నది. అప్పటికి మహబూబునగరమండలమున కందూరి చోడుల పాలన మంతరించెను. గణపతిదేవచక్రవర్తి పాలించు నాటికే కందూరిచోడులు కందూరునాడుపై ఆధిపత్యమును కోల్పోయియుందురు.

ఉదయనచోడుని యనంతరము, భీమ, గోకర్ణులకాలమున కందూరిచోడులు నల్లగొండ మండలములోని పానుగల్లుపట్టణమును తమ రాజధానిగా నేర్పఱచుకొనిరి. క్రీ. శ. 1235 లో వేయింపబడిన మర్లపల్లి శాసనమున భీమదేవ చోడమహారాజు పేర్కొనబడినాడు. ఇతని వంశీయుడు లేక పుత్రుడైన రామనాథదేవచోడమహారాజు ఆగామోతుకూరు శాసనమును వేయించెను. ఈ శాసనకాలము క్రీ. శ. 1282. రామనాథదేవ చోడమహారాజు నల్లగొండ మండలమును కాకతి రుద్రమాంబ సామంతుడుగా పాలించెను.

సిరికొండపాలకులు తొలుత కందూరిచోడుల సామంతులు. అటుపిమ్మట వీరు కాకతీయుల సామంతులుగనో, దండనాథులుగనో నుండిరని భావింపవచ్చును.

శాసనము—మూలము

మొదటి ప్రక్క

1. స్వస్తి సమస్తభువనాశ్రయ శ్రీ పృథ్వీవల్లభ
2. మహారాజాధిరాజపరమేశ్వర పరమ
3. భట్టారక సత్యాశ్రయకులతిలక చాళు
4. క్యాభరణ శ్రీమత్త్రిభువనమల్లదేవచక్రవర్తి జగదే
5. క మల్లదేవర విజయరాజ్య ముత్తరోత్తరాభి
6 వృద్ధి ప్రవర్ధమాన మాచంద్రార్కతార మా
7. సముద్ర పర్యంత మఖిలలోక సుఖప్ర
8 దంబై ప్రవర్తిల్ల స్వస్తి శకవర్షములు
9. 1070 యగు విభవ సంవత్సర ఫాల్గు
10. ణ శుద్ధ 1 గుయు గురువారమున
11. స్వస్తి సమధిగత పంచమహాశబ్ద మ
12. హా మణ్డలేశ్వర పరమమాహేశ్వర కోడూ
13. ర్పురవరేశ్వర సూర్యవంశోద్భవనకు
14. లతిలక కాశ్యపగోత్ర కరికాలాన్వయ
15. నామాది సమస్త ప్రశస్తి సహితం శ్రీమన్మ
16. హా మణ్డలేశ్వర కందూరి ఉదయనచో
17, డ మహారాజులచేత స్వస్తిశ్రీ వేంగిదే
18. శ చాళుక్య నంకకాఱ పరమండల చూఱకా
19. ఱ కాంచీపురరక్షక కడువాయెవఱఘో

20. షణ ఖట్వాంగధ్వజ మహావృషభలాంఛన
21. భారద్వాజగోత్ర పల్లవకులతిలక పాదాం
22. బుజసేవిత గోదావ్రీతీరవరాధీశ్వర య
23. వ్యకామకులకుముదినీ ముఖచం(ద్ర)
24. మన్య దేవేంద్ర బంధుజనాశ్రయ శర(ణా)
25. గత వజ్రపంజర చెన్నమన్నెయగణ్డ
26. వ్యశాస్య చూళికాలబిరుద మన్నియ (బ్రహ్మ)
27. రాక్షస దుష్టాశ్వమల్ల తురగరేవ(ంతుండ)

రెండవ ప్రక్క

1. యని యాన మల్లడ కునూడ్ల శాసన
2. పతి దేవగురు ద్విజభక్తులు నూఱు
3. మరజముండునయిన
4. శ్రీ మన్మహామండలిక కేత
5. య గొండపల్లినాడు శా
6. సన బద్ధంబుగా బడసి సిరికొణ్డ
7. రాజ్యంబు సేయుచుండగా నందు వి
8. నోదంబులను న్ద క——(ది జావ్వనా)
9. యకునకు సెజ్జ యెత్తించిన గు
10. డ్ల దేవరలకు హవిబలివివిధార్చనలకు ధా
11. రా పూర్వకము సెసిపెట్టినదత్తి
12. పర్వతముమీది జాప్యేశ్వర దేవర
13. సహితమైన లింగములకు సిరికొం
14. డతూర్పు దిశా భాగమునలుబెయెను
15. మట్లొంబండు యాడ్లపట్టు భూమి మతి
16. యు నా దేవరలకు నడిమి భూమిమీద
17. వాడె నిరువుట్టి యాండ్లపట్టు—డును
18. కము ముంది—కలక డమంచాలు
19. ముప్పందుము॥ దేవరలకు రావిపాటిం
20. బుట్టెండు॥ ఆ దేవరలకలకాపాలుంబుట్టిం
21. డు। ఆ దేవరలక యెలమావింపన్నెండు। ఆ
22. దేవరక్కు మో—ండు — భీమేశ్వరదే
23. వరకు ఏనుమట్లుంబండు యాడ్లపట్టు వారాయు

24. ణ దేవరకు నీరువుట్టెయాడ్లపట్టు భీమేశ్వర దే
25. వరకు సుంకము బండిం దూమెండు ధాన్యము పో
26. కలబండి నెంభయిపోకలు తలమాడునంచెడి
27. పోఁకలు ఆకుమోపున సెంచయ యాకులు డ
28. ట్టుపలుక మూనెండు మోపునపట్టెండ్లున కరము
29. నందు నివేద్యమునఖండదీపము॥ కేదారదేవ
30. రకు మూండు మట్లాడ్లపట్టు॥ పర్వ్వతము ప
31. శ్చిమము జలు కేదార దేవరకు పుట్టెండాడ్లపట్టు
32. పర్వ్వతము ఉత్తరము అచుతేశ్వరదే
33. వరకు నిరుడు——బయ్యా—డు—దే ఉత్త
34. రము సూర సముద్రము పల—పార
35. ను చు రు.

మూఁడవ ప్రక్క

1. జినదేవరకు నీరుమట్టియాడ్లపట్టు॥ బ్రాహ్మలకు నిరు
2. వయెమద్దిడ్లపట్టు॥ సంకునికంబుట్టి॥ పర్వ్వతము వా
3. యవ్యమున కేతసముద్రము వెనుకంపర్వ్వతము మీం
4. ది పశ్చలింగములకు మఱుత్తుర్ల మూడు॥ భీమేశ్వర
5. దేవరకు మఱుత్తుర్ల మూడు॥ నారాయణదేవ
6. రకు మఱుత్తుర్ల రెండు॥ కేదారదేవరకు మఱుత్తుర్ల
7. రెండు॥ జినదేవరకు మఱుత్తుర్ల రెండు॥ బ్రాహ్మ
8. లకు మఱుత్తుర్ల పది॥ సకనికెద్ద॥ సూరసముద్ర
9. ము సోమసముద్రము భీమసముద్రము మూం
10. డు సెఱ్ఱలయందునుం గౌరియఱకు మాన్యము
11. మఱుత్తర నొక మఱుత్తర నుంబండ్లమునం అమ్ముగా
12. వి యాగాదయిసవెఱ్ఱ పొలమించున బ॥ బహు
13. భిర్వసుధాదత్తా బహుభిశ్చానుపాలితా య
14. స్యయస్య యదా భూమి స్తస్యతస్య తదా ఫ
15. లం॥ స్వదత్తాంపరదత్తాంవా యోహరేతి వసుం
16. ధరా షష్టిర్వ్వషసహస్రాణి విష్ఠాయాం జాయ
17. తే క్రిమి॥ ద్వేషన్తి యే మత్సరలోభభాజనతా
18. ఇమంధమ్మ మధమ్మ విలాఘగోఘ్న మాతృఘ్న పితృ
19. ఘ్న లోకాస్సేవేవ్రజన్తి విప్రఘ్న గతింబభూవ.

ఇపుడు వీస్తున్న గాలి

ఉన్నదాన్నంతా వూడ్చిపారేసి
కొత్తదేదీ దొరక్క
దాని స్వరూపమే గోదరించక
పశ్చాత్తప్తులవుతున్నారు చివరికి!
అర్థంకాని సూత్రాలతో
అల్లినవల విసిరి
జనాన్ని ఒడుపుగా పట్టేశామనుకుని
వాళ్లే ఎదురేటే పూనకం వచ్చినట్టు
చిందులేస్తున్న వాళ్లు మరో తెగ!
అంతా ఈ గాలి విసురులోనే
దుమారం రపించే దుస్థితిలోనే.

ముందూ వెనకా ఆలోచించని
కుర్రకారు మనస్తత్వ మీగాలిది.
ఇది కసుగాయల్ని రాల్చేది
లేలేత కొమ్మల్ని కూల్చేది
దుమ్ము కంట్లో కొట్టేది
దుముకుతూ సాగేది.
ఈ విసురు తగ్గేదాకా
ఈ దుమ్ము ధూళీ అణిగేదాకా
ఆకారాలు స్పష్టంగా కనిపించవు
స్వభావాలు సూటిగా తెలిసిరావు.
ఆశ కల్పించేదేదో
నిరాశను సూచించేదేదో
పొల్లెంతో గట్టిదెంతో
నికరంగా తేలదు.
అందాకా ఈ తికమక తగ్గదు.
ఆ క్షణానికోసం ఎదురుచూడక తప్పదు.

పదం-పదాంశం

శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తి

వాక్యం—పదం

భాషా వ్యాపారంలో మనం సాధారణంగా అనేవి, వినేవి వాక్యాలుగానే ఉంటాయి. ఈ వాక్యాలు కొన్ని చిన్నవి, కొన్ని పెద్దవి. ఎంత చిన్న వాక్యమైనా ఒక పదంకన్నా తక్కువ పరిమాణంలో ఉండటానికి వీల్లేదు. ఉదాహరణకు 'అది ఎవరి ఇల్లు?' అని ప్రశ్నిస్తే దానికి జవాబుగా 'మాది' అనవచ్చు. ఇది ఏక పదమైనా వాక్యమనే చెప్పాలి; అంటే, 'అది మాది' అనే సంపూర్ణ వాక్యానికి సంక్షిప్త రూపం.

వాక్యానికి కనిష్ఠరూపం పదమైనా ప్రతి పదాన్ని సందర్భవిరహితంగా వాక్యం అంటానికి వీల్లేదు. ఒక కోశంలో ఉన్న పదాలను ఒకదాని తరవాత ఒకటి చదివినప్పుడు అవి వాక్యాలుకావు. స్థూలంగా వాక్యాన్ని నిర్వచించవలసివస్తే 'రెండు విరామాలమధ్య సహజమైన వ్యవహారంలో ఏర్పడే వాగ్రూపం, అనవచ్చు. అంటే ప్రతివాక్యానికీ ముందూ చివరా విరామం, నిశ్శబ్దత హద్దులుగా ఉంటాయి. ఈ హద్దులమధ్య ఉన్న వాగ్వ్యాపారానికి (అంటే వాక్యానికి) అంతకుముందు, ఆ తరవాత వచ్చే వాక్యాలకు నిర్మాణాత్మకమైన సంబంధం నిరూపించటం సాధ్యంకాదు. అంటే భాషావ్యవహారంలో ఒక వాక్యం పూర్తి అయిన తరువాత దాని స్వరూపాన్నిబట్టి ఆ తరవాత వచ్చే వాక్యం స్వరూపం ఎలా ఉంటుందో నిర యించలేము.

వాక్యం అర్థవంతంగా ఉంటుంది. కేవలం పదసంయోజన వల్లనే వాక్యాలేర్పడవు. అర్థరహితమైన వాక్యాలు సహజమైన భాషావ్యవహారంలో ఉండవు. పదం వాక్యానికి సంక్షిప్త రూపం అన్నాం కాబట్టి ప్రతిపదమూ అర్థవంతంగానే ఉండాలి.

పదాంశ నిర్ణయం :

తరచుగా పదంలో భాగాలకు—పదాంశాలకు—వ్యవహర్తలు ఊహించదగిన అర్థాలుంటాయి. ఉదాహరణకు 'బొమ్మలు' అనే పదంలో రెండు అర్థవంతమైన పదాంశాలున్నాయి. 1. బొమ్మ 2. లు (బహువచన ప్రత్యయం). 'బొమ్మ'ను అంతకంటె చిన్నముక్కలుగా విడగొడితే దాని అర్థం పోతుంది— 'బ్—ఒ—మ్ — మ్—అ' అని. అందువల్ల తెలుగులో 'బొమ్మ' అర్థవంతమైన కనిష్ఠరూపం. అలానే ఒకటికంటె ఎక్కువసంఖ్యనుగురించి మాట్లాడేటప్పుడు నామానికి 'లు' చేరుస్తాం. దీని అర్థం బహువచన బోధకత. దీన్ని 'ల్—ఉ' అని ఇంకా చిన్నముక్కలుగా విడగొట్టే అదేవిధంగా ఒక్కొక్కముక్కకు వేరే అర్థం నిరూపించటం సాధ్యంకాదు. అందువల్ల '—లు' కూడా తెలుగులో అర్థవంతమైన కనిష్ఠరూపమనే చెప్పాలి. 'బొమ్మ', 'లు' అనే రెండు ముక్కలనూ కలపటంవల్ల 'బొమ్మలు' అనే పదం ఏర్పడ్డది. 'బొమ్మ'అన్నా పదమే అవుతుంది. కాని '—లు' పదంకాదు. ఎందుకంటే, ఏ సందర్భంలోనూ '—లు' ఒక వాక్యానికి సంక్షిప్త రూపంగా ఉపయోగించలేంకాబట్టి. భాషలో ఉన్న పదాలన్నిటినీ అర్థవంతమైన కనిష్ఠాంశాలు కింద విభజించవచ్చు. ఇలా విభజించటానికి సాధ్యమైన ప్రతిముక్కను పదాంశం అందాం. ఇలాంటి పదాంశాలు, ఒక నియతమైన క్రమంలో కలియటంవల

పదా లేర్పడతాయి. 'బొమ్మ—లు' పదం, కాని 'లు—బొమ్మ' పదంకాదు. ఒక్కొక్కప్పుడు ఒక పదాన్ని అంతకంటె చిన్నముక్కలుగా విడగొట్ట టానికి సాధ్యంకానప్పుడు అదే పదాంశంకూడా అవుతుంది. దీన్నిబట్టి ఒకేపదం పదాంశంకూడా కావచ్చు. కాని ప్రతిపదాంశమూ పదంతో తుల్యం కాదు. 'బొమ్మ' ఒక పదం, ఒక పదాంశం; 'బొమ్మలు' ఒక పదం; రెండు పదాంశాలు, '—లు' పదాంశమే కాని పదంకాదు.

పై చర్చనుబట్టి భాషలో అర్థవంతమైన కనిష్ఠరూపం పదాంశమని నిర్వచించవచ్చు. కేవల వర్ణాలయిన అ, ఆ, ఇ, ఈ, క, గ, చ, జ మొదలైనవాటివల్ల పదాలు ఏర్పడుతున్నా వాటికి అర్థంలేదుకాబట్టి అవి పదాంశాలు కావు. తెలుగు వర్ణ సమామ్నాయంలో 'ఆ' ఒకవర్ణం; కాని 'వాడా?' 'పుస్తకమా?' 'వస్తాడా?' మొదలైన వాక్యాల్లో చివరచేరిన 'ఆ' ప్రశ్నార్థాన్ని సూచిస్తుంది. ఇది అర్థవంతమైందికాబట్టి ఏకవర్ణమైనా పదాంశమే. ఒక పదాంశం పొడవు ఒక వర్ణంమొదలు అనేక (పది పదిహేను) వర్ణాలదాకా ఉండవచ్చు.

పదాంశం—సపదాంశం :

కొన్నిపదాంశా లెప్పుడూ వాక్యపరిసరాలు మారినా రూపంలో ఏవిధమైనమార్పూ లేకుండా వస్తాయి. నేటి తెలుగులో దీర్ఘాచ్చు చివరఉన్న పదాంశాలన్నీ మూలంగా ఈ తెగకు చెందినవి; ఉదా. జరీ, దగా, లంగా, లుంగీ, పకోడీ ఇలాంటివి. ఆంగ్లంలో Box, Tree, Cat, Fan మొదలైనవి ఎక్కడవచ్చినా ఒకేరూపంతో ఉంటాయి. కాని కొన్ని పదాంశాలు పరిసర భేదాన్నిబట్టి రూపభేదాన్ని పొందుతాయి. ఉదా. 'వచ్చ్—ఇ' (=వచ్చి) క్త్వార్థకం, రెండు పదాంశాలు; 'వస్-తూ' (=వస్తూ) శత్రర్థకం, రెండు పదాంశాలు. ఈ పదాంశాల్లో ఆగమనార్థకమైన ధాతువు అచ్చుకుముందు 'వచ్చ్' అనీ, 'త' వర్ణానికిముందు 'వస్' అనీ రెండు రూపాలతో కనిపిస్తున్నది. ఈ విధమైన రూపభేదమున్నా ధాత్వర్థంలో మార్పేమీ లేదు, అంటే, 'వచ్చి-వస్తూ' అనే పదాలుకు వేరు వేరు అర్థాలు క్త్వార్థక శత్రర్థక ప్రత్యయాలయిన 'ఇ-తూ'ల వల్ల ఏర్పడ్డవికాని ధాతువులో ఉన్న రూపభేదాన్ని బట్టికాదు. అందువల్ల ఒక పదాంశానికి ఒకటి కంటె ఎక్కువ రూపాలు, పరిసరాల (ముందూ వెనకా ఉన్న వర్ణాల) భేదాన్నిబట్టి ఏర్పడవచ్చు. అర్థంలో మార్పు రాకుండా ఏర్పడ్డ రూపాంతరాలను సపదాంశాలనవచ్చు. ఒకే వర్ణం పరిసరాలనుబట్టి చాలా రకాలు (సవర్ణాలు)గా ఉచ్చరించినట్టు, ఒకే పదాంశం పరిసర భేదాన్నిబట్టి భాషా వ్యవహారంలో రూపాంతరాల (సపదాంశాల)తో ప్రవర్తిస్తుంది.

పదాంశం—అర్థస్వరూపం :

ప్రతి పదాంశమూ అర్థవంతంగా ఉండాలని చెప్పాం. కొన్ని చోట్ల అర్థం స్పష్టంగా ఉంటుంది. కొన్ని చోట్ల అర్థం ఉన్నదని మనకు తెలిసినా దాన్ని స్పష్టీకరించటం క్లిష్టమవుతుంది. నామాలు, క్రియలూ, విశేషణాలూ అయిన పదాంశాల (ఉదా. ఇల్లు, వచ్చు, గొప్ప మొదలైనవాటి) అర్థాలు వ్యవహర్తలు చప్పున గ్రహించగలరు. వ్యక్తీకరించగలరు కూడా. కాని బహువచన '—లు', క్త్వార్థక '—ఇ', శత్రర్థక '—తూ' మొదలైన వాటి అర్థాలను శాస్త్రజ్ఞుడు గుర్తించగలిగినట్టు సామాన్య భాషా వ్యవహర్త గుర్తించలేడు. ఆర్థిక దృష్టితో భాషలోఉన్న పదాంశాలన్నిటినీ రెండురకాలుగా విభజించవచ్చు. 1. విశ్వజ్ఞానపరాలు, 2. భాషాజ్ఞానపరాలు. మొదటి రకానికి చెందిన పదాంశాలు ప్రపంచ భాషలన్నిటిలోనూ తుల్యార్థయోగంలో ఉంటాయి. రెండో తెగకు చెందినవి ప్రతిభాషకూ, భాషా కుటుంబానికి విలక్షణంగా ఉంటాయి.

ధాతువు—ప్రత్యయం :

కొన్ని పదాంశాలు పదాలుగాకూడా ఉండవచ్చని చెప్పాం. 'బొమ్మ, గోడ' మొ.నవి. వీటికి స్వతంత్ర ప్రయోగ యోగ్యత ఉంటుంది. కొన్ని పదాంశాలెప్పుడూ అనుబంధాలుగానే వస్తాయి. —లు, —ఇ, —తూ, —కు, —ను మొ.వి. దీన్నిబట్టి పదాంశాలను స్వతంత్రాలని, అనుబంధాలని రెండు రకాల విభజించవచ్చు. ప్రత్యయాలన్నీ అనుబంధపదాంశాలే. ధాతువులు కొన్నిస్వతంత్రాలు; అనుబంధాలుగాకూడా ఉండవచ్చు. పదాంశాలు పదనిర్మాణావయవాలు కాబట్టి ధాతువులనీ, ప్రత్యయాలనీ రెండు రకాలుగా ఉంటాయి. ఏ భాషలోఅయినా ప్రతిపదంలోనూ కనీసం ఒక ధాతువైనా ఉంటుంది. ధాతువు ఒక పదంచెప్పే అర్థంలో ప్రధానభాగాన్ని తెలియజేస్తుంది. ఉదాహరణకు 'అమ్మ, అమ్మకం, అమ్మబడి, అమ్ముతున్నాడు', మొదలైన రూపాలన్నిటిలో అనుస్యూతంగావచ్చే ప్రధానార్థాన్ని సూచించే పదాంశం 'అమ్మ'అనే క్రియాధాతువు. పదనిర్మాణంలో ధాతువుపోగా మిగిలినవి ప్రత్యయాలు. ఇవి ఎప్పుడూ ధాతువులకు అనుబంధాలుగానే వస్తాయి. ఏభాషలోఅయినా ప్రత్యయాలసంఖ్యకంటె ధాతువులసంఖ్య ఎక్కువగా ఉంటుంది. కాని ధాతువులకంటె ప్రత్యయాలకు వాడుక ఎక్కువ.

పదంలో ప్రధానార్థవాహకం ధాతువులవి నిర్వచించుకొన్నాం; కాని ఉపసర్గలున్న భాషల్లో ధాత్వర్థాన్ని ఇదమిత్థమని నిరూపించటం కష్టం. సంస్కృతంలో ప్ర—హార, ఆ—హార, వి—హార, సం—హార, ఉప—హార మొదలైనపదాల్లో ధాతుభాగం 'హార'అనే రూపంతోఉన్నా దాని అర్థం నిర్ణయించటం కష్టం. అలానే ఆంగ్లంలో **con–ceive, per–ceive, re–ceive, de–ceive** మొ.న రూపాల్లో—ceive—ధాతువైనా దాని అర్థం నిరూపించటం కష్టం.[1] ఇందువల్ల ధాతు నిరూపణలో అర్థమేకాకుండా ఇతర పద్ధతులుకూడా మరి కొన్ని ఉండాలి. ఊనిక ప్రధానమైన భాషల్లో ధాతుభాగంమీద ఊనిక పడుతుంది. కొన్నిభాషల్లో పదంలో ధాతువుకు నియతమైనస్థానం ఉంటుంది. ద్రావిడభాషల్లో ఉపసర్గలులేవుకాబట్టి ధాతువెప్పుడూ పదాదినే ఉంటుందని నిరపవాదంగా చెప్పవచ్చు. చైనీస్‌భాషలో పదాలుకాని ప్రత్యయాలు లేవు కాబట్టి ధాతువులన్నీ పదాలే.

ధాతువు—ప్రాతిపదిక :

ప్రత్యయానికి నిబద్ధమైన పదరూపాన్ని ప్రాతిపదిక అనవచ్చు; ఉదా. 'అన్నిటికి'లో 'కి' ప్రత్యయం, 'అన్నిటి'అనే ప్రాతిపదికకు చేరుతుంది. ఇది ఔపవిభక్తికరూపం. '—టి'అనే ఉపవిభక్తి 'అన్ని' అనే ప్రాతిపదికకు చేరుతుంది. 'అన్ని' కనిష్ఠరూపంకాబట్టి అదే ధాతువుకూడా అవుతుంది. పై చర్చనుబట్టి 'అన్నిటికి' పదం; అన్ని—, అన్నిటి—, ప్రాతిపదికలు; 'అన్ని' ధాతువు. అలానే 'చెప్పించక' అనే వ్యతిరేకక్త్వార్థక క్రియాపదంలో '—అక' ప్రత్యయానికి ముందున్న 'చెప్పించ్—' ప్రాతిపదిక, ధాతువు 'చెప్పు'. 'బొమ్మలకు' అనే పదంలో 'బొమ్మల' ప్రాతిపదిక; 'బొమ్మల' అనే పదంలో '—అ' ప్రత్యయం, బొమ్మలు ప్రాతిపదిక; బొమ్మలు పదమైనప్పుడు 'బొమ్మ' ప్రాతిపదిక, '—లు' ప్రత్యయం. ఇక్కడ ధాతువు కూడా 'బొమ్మ' అవుతుంది. దీన్నిబట్టి ధాతువులన్నీ ప్రాతిపదికలు కావచ్చు కాని, ప్రాతిపదికలన్నీ ధాతువులు కాకపోవచ్చు.

ప్రత్యయ విభాగం :

ప్రత్యయాలన్నీ అనుబంధపదాంశాలేకాని పదాలు కావు. పదంలో వాటి స్థాన భేదాన్నిబట్టి ప్రత్యయాల్ని మూడు రకాలుగా విభజించవచ్చు.

---

1. అసలు ధాతువు 'హృ'.

ధాతు పూర్వాలు, ధాతు పరాలు, ధాత్వంతరాలు. సంస్కృత భాషలో ఉన్న 'ప్ర, పరి, ఉప' మొ.న ఉపసర్గలన్నీ ధాతుపూర్వాలు. ద్రావిడ భాషల్లో ధాతుపరకప్రత్యయాలే కాని ఉపసర్గలు లేవు; ఉదా. కు, ను, రు, మొదలైనవి. సెమిటిక్ కుటుంబానికి చెందిన భాషల్లో ధాతువుమధ్య కొన్ని ప్రత్యయాలు వస్తాయి; ఉదా. హీబ్రూ భాషలో గ్నాబ్=దొంగిలించు; గనబ్=దొంగిలించాడు. గొనెబ్=దొంగతనం—ఈ పదాల్లో 'g—n—b' ధాతువు; ఇక్కడ ప్రత్యయాలు ధాతువుతో కలిసి ఉన్నాయి కాని కేవలం పూర్వాన, పరాన రాలేదు. ఇంగ్లీషులో sing- sang-sung ఇలాటివి. సంస్కృతంలో 'రుధ్' ధాతువుకు రూపనిష్పత్తిలో '-న—' అనే వికరణ ప్రత్యయం చేరుతుంది. ఉదా. రుణద్ధి.

ధాతు పదాంశాలు కొన్ని, పదాలతో తుల్యంగా ఉన్నా—అంటే స్వతంత్ర ప్రయోగ యోగ్యత కలిగి ఉన్నా—కొన్ని ధాతువులు సర్వత్రా ప్రత్యయాల మాదిరి అనుబంధాలుగానే వస్తాయి. క్రియా ధాతువులన్నీ ఇటువంటివే. విశేషణ ధాతువులు 'అ, ఈ, ఏ'లు జోరీగ; కందిరీగ, పన్నీరు, దూమెరుగు, తూనీగ మొదలైన సమస్త శబ్దాల్లో ఉన్న 'జోర్-, కందిర్—, పన్, దూ—, తూన్—' మొదలైనవి ఎప్పుడూ అనుబంధాలుగానే వచ్చే ధాతువులు. ఇవి తరచు ఇతర ధాతువుల ముందు రావు గాబట్టి వీటిని ఉపసర్గలనడానికి వీల్లేదు. తమిళంలో 'పని' అంటే మంచు. 'పన్నీరు' అంటే మంచునీరు. 'దూ' అంటే బహుశా కొద్ది, తక్కువ, తేలిక అని అర్థాలు. 'దూముడి' అంటే వదులుముడి అని అర్థం. పరాన వచ్చిన ఇల్లు, బొమ్మ, చెట్టు, గోడ, మొ. వి. స్వతంత్ర పదాంశాలు.

పదాంశరూపభేదాలు :

ప్రతి పదాంశానికి ఒక రూపమూ అర్థమూ ఉంటాయని చెప్పుకొన్నాం. క్వాచిత్కంగా భాషల్లో నిర్మాణాన్నిబట్టి రూపంలేకుండా అర్థం ఉన్నవి, అర్థంలేకుండా రూపం ఉన్నవి కూడా కొన్ని సపదాంశాలుండవచ్చు. ఒక పదాంశానికి చాలాపదాల్లో రూపాంతరాలు కనిపిస్తూ, అదే పరిసరాల్లో కొన్ని పదాల్లో రూపం లేకపోయినా ఆ పదాంశార్థం వస్తుంటే శూన్యరూపంగా ఆ పదాంశం ఉన్నట్లు గుర్తించాలి. వీటిని రూపశూన్య సపదాంశాలనవచ్చు. తెలుగులో వ్యతిరేకక్రియల్లో మూడు పదాంశాలుంటాయి: ధాతువు, వ్యతిరేకార్థక ప్రత్యయం—అ—: పురుషార్థక ప్రత్యయం; ఉదా.

చెప్ప్—అ—డు   వండ్—అ-డు
అమ్మ్—అ—డు   తిన్—అ—డు
కొన్—అ—డు   పిలవ్—అ-డు

కాని 'తెచ్చు' ధాతువుకు 'తే—?—డు', 'వచ్చు' ధాతువుకు 'రా—?—డు' వ్యతిరేకరూపాలు.

ఈ చివరి వాటిలో వ్యతిరేకార్థాన్ని బోధించే 'అ' ప్రత్యయం లేకపోయినా దాని అర్థం నిల్చి ఉంది. ఉండవలసిన—అ—అనేరూపం లేకపోయినా అర్థం వస్తుందికాబట్టి '—అ—' రావలసిన స్థానంలో ఒక సున్నా గుర్తుపెట్టుకొని దీన్ని రూపశూన్య సపదాంశమనవచ్చు. ఈ క్రియల్లో వ్యతిరేకార్థకతను సూచించే పదాంశానికి రెండు సపదాంశాలున్నాయని సూచించవచ్చు. 1. —అ— 2. —0—. ఇలానే ఆంగ్లంలో చాలాచోట్ల బహువచన ప్రత్యయంగా వచ్చే —s,—es కు బదులు కొన్నిపదాల తరవాత బహువచన ప్రత్యయం శూన్యరూపంలో వస్తుంది. ఉదా. sheep, deer, fish, మొ.వి.

భాషల్లో శూన్యసపదాంశాలుంటాయి కాని శూన్యపదాంశాలుండవు అంటే, ఒక పదాంశానికి రూపం క్వాచిత్కంగా లేనిచోట్ల నిర్మాణపూరణ దృష్టితో సృష్టించుకున్నది శూన్య సపదాంశం. అర్థం స్పష్టంగా లేకపోయినా రూపం కన్పించే పదాంశాలుకూడా కొన్ని ఉన్నాయి. ఉదా. పల్లె

టూరు, దుక్కిటెద్దు, పేదరాలు, మొదలైన వాటిల్లో ఆగమాలుగావచ్చే '-ట్-, -ర్-', వర్ణాలు పూర్వాపర పదాంశాల్లో వేటికీ చెందవు. పల్లె, దుక్కి, పేద, ఊరు, ఎద్దు, ఆలు, అని వీటి రూపాలు వ్యస్తంగాకూడా కనిపిస్తాయి. '-ట్-, -ర్-' రూపాలకు ప్రత్యేకమైన అర్థంలేదు కాబట్టి వాటిని అర్థశూన్య పదాంశాలనవచ్చు. కాని ఒక దృష్టితోచూస్తే 'పల్లె—ఊరు', 'దుక్కి—ఎద్దు', 'పేద—ఆలు' అనే పదాలు ఆగమరహితంగా రావు కాబట్టి, ఈ రెండు పదాల సార్థకత, ప్రయోగ యోగ్యత ఈ ఆగమాలవల్లనే సిద్ధిస్తున్నది కాబట్టి, రెండేసి పదాలను కలపటమే వీటి అర్థంగా చెప్పుకోవచ్చు. అలాటప్పుడు అర్థశూన్య పదాంశాలు భాషలో ఉండవనే చెప్పవచ్చు. వీటి అర్థం భాషానిర్మాణపరమైనదిగాని విశ్వజ్ఞానపరమైనది కాదు. పదహారు, పదిహేడు, మొ. వాటిల్లో 'హ' కారం ఇలాటిదే.

పదాంశం—పరిసర భేదాలు :

పదాంశానికి ఒకటికంటె ఎక్కువ రూపాలు ఉండవచ్చనీ, అవి ఎప్పుడూ భిన్నపరిసరాల్లోనే వస్తుంటాయని, అలాంటి పరిసరభేదాన్నిబట్టి వాటి రూపభేదం సూత్రప్రాయంగా నిరూపించవచ్చుననీ అనుకొన్నాం. ఇలాంటి సపదాంశాలకు రూపంలో కొద్ది తేడాలుంటాయి; కాని అర్థంలో మార్పుండదు. ఇలా కొద్ది తేడాలతోవచ్చిన రూపాంతరాలనన్నిటినీ ఏకపదాంశభాగాలుగా గుర్తించాలి. ప్రతి సపదాంశమూ వేరువేరు పరిసరాల్లోనే వస్తుంది కాని రెండు మూడు సపదాంశాలకు ఒకే పరిసరం ఉండదు.

1. వస్—తూ : వస్తూ
   వచ్చ్—ఇ : వచ్చి
   రా—క : రాక
2. విం—టూ : వింటూ
   విన్—ఇ : విని
   విన్—అక : వినక
3. చూస్—తూ : చూస్తూ
   చూస్—ఇ : చూసి
   చూడ్—అక : చూడక

మొదటి వరసలో ధాతువు వస్—, వచ్చ్—, రా—అని మూడు రూపాలతో కనిపిస్తుంది. ఈమూడు మూడు రకాల పరిసరాల్లో వస్తున్నాయి. అచ్చు ముందు 'వచ్చ్' అని, 'త'కారం పరమైనప్పుడు 'వస్' అని, ఇతరత్రా 'రా' అని. ఈ పరిసరాలను తారుమారు చేస్తే అనిష్టరూపాలు ఏర్పడతాయి. (* వసి, *వచ్తూ, *వస్క, *వచ్క). ఈ నియమం తెలుగు మాట్లాడే ఏ వ్యవహర్తా ఉల్లంఘించ లేదు. ఇలాంటి ప్రవృత్తిని 'అన్యోన్యపూరక వ్యాప్తి' అని కొందరు తెలుగులో అంటున్నారు. ఒక పదాంశానికి చెందిన సపదాంశాలను ఈ కింది విధంగా సూచిస్తారు.

వచ్చ్, వస్, రా	'come'
విం, విన్	'hear'
చూస్, చూడ్	'see'
తూ, టూ	శత్రర్థక ప్రత్యయం
అక, ∅	వ్యతిరేకార్థక ప్రత్యయం
ఇ	క్త్వార్థక ప్రత్యయం

సపదాంశభేదాలు పరిసరపదాంశభాగాలయిన వర్ణాల ఉచ్చారణనుబట్టి నిర్దేశించటానికి వీలు కావచ్చు. '—తూ'లో ఉన్న 'త'వర్ణం 'వస్—'లో ఉన్న 'స'వర్ణం దంత్యాలు; 'వచ్చ్—తూ' అనే రూపం తెలుగు ఉచ్చారణలో సాధ్యంకాదు, కాబట్టి 'చ'వర్ణం 'స'వర్ణంగా మారింది. ధాతుసపదాంశంలోఉన్న వర్ణాల ఉచ్చారణకు, పరిసర సపదాంశాల ఉచ్చారణకు సన్నిహితసంబంధం నిరూపించవచ్చు. కొన్నిటిమధ్య ఇలాటి సంబంధం నిరూపించటం సాధ్యంకాదు. 'మెచ్చి, మెచ్చక'అనే రూపాలు భాషలోఉన్నా, 'వచ్చి, వచ్చక' అనేవి లేవు. 'వచ్చ్'స్థానంలో 'రా' ఉండటానికి 'అక'లోని వర్ణాల ఉచ్చారణకు సన్నిహితసంబంధంలేదు.

ధాత్వంతరం	Infix
ప్రాతిపదిక	Stem
స్వతంత్రరూపం	Free form
అనుబంధ రూపం	Bound form
పరిసరం	Environment
అర్థశూన్య పదాంశం	Empty morph
రూపశూన్య సపదాంశం	Zero morph
అన్యోన్య పరిపూరక వ్యాప్తి	Complementary distribution
పరిసర వర్ణ నియతి	Phonological conditioning
పరిసర రూప నియతి	Morphological conditioning
పదకల్పకావ్యయం	Clitic
అక్షరం	Syllable
ఉత్పత్తి	Derivation
నిష్పత్తి	Inflexion
ప్రాథమికధాతువు	Primary root



ఈ చర్చనుబట్టి ఒక పదాంశానికి రూపాంతరాలైన సపదాంశాల అన్యోన్యసంబంధం పరిసరవర్ణనియతమని, పరిసరరూపనియతమని రెండు రకాల విభజించవచ్చు. వస్తాడు, వస్తే మొదలైనచోట్ల కూడా 'త' వర్ణానికిముందు 'వచ్' బదులు 'వస్' అనే సపదాంశమే కనిపిస్తుంది. అంటే తెలుగులో 'చ్త' ఉచ్చారణలో సాధ్యంకాదు కాబట్టి. కాని '—అక', లేక '—క' ప్రత్యయంముందు 'వచ్' బదులు 'రా—' ఉచ్చారణేతర కారణాలవల్ల వస్తున్నది. అంటే వీటి పరస్పరోచ్చారణలకు సహజ సంబంధంలేదు. మొదటి రకమైన సంబంధంగల సపదాంశాలను ~ ఈ గుర్తుతోను, రెండో రకమైన సంబంధమున్న సపదాంశాలను ∞ ఈ గుర్తుతోను వేరుచేస్తారు. (వచ్ ~ వస్ ∞ రా.)

ఇతర పదాంశభేదాలు :

ప్రత్యయాలూ, పదాలూకాని అనుబంధ పదాంశాలు ఒక తెగకు చెందినవి ఉన్నాయి; ఉదా. — ఆ-ప్రశ్నార్థకం,-ఏ ఏవార్థకం, —ఓ—సందేహార్థకం, — కదా - కిలార్థకం, మొదలైనవి. వీటికి స్వతంత్రప్రయోగయోగ్యతలేదు కాబట్టి పదాలు అనటానికి వీల్లేదు. అయినా నామం, క్రియ, విశేషణం, మొదలైన ప్రత్యేకభాషా భాగాలకిచెందిన ప్రత్యయాల (ను, డు, ము, రు, తో, మొ. వి) మాదిరివికూడా కావు. ఇవి చేరే రూపం స్వతంత్రప్రయోగ యోగ్యతకల పదమన్నా, పదబంధమన్నా, వాక్యమన్నా అవుతుంది. ఈ కారణాలవల్ల వీటిని ప్రత్యయాలనకుండా పదకల్పకావ్యయాలనవచ్చు.

ఇంతేకాకుండా అక్షరపరిగణనను బట్టి ఏకాచ్కాలు, ద్వ్యచ్కాలు, త్ర్యచ్కాలు, మొ. విధంగా పదాంశాలను విభజించవచ్చు. ఉదాహరణకు ద్రావిడభాషల్లో ప్రాథమిక ధాతువులెప్పుడూ ఏకాచ్కాలుగానే ఉంటాయి. సెమెటిక్ కుటుంబ భాషల్లో ధాతువు మూడు హల్లులతో ఉంటుంది.

కొన్ని ప్రత్యయాలు, పదాల ఉత్పత్తి ప్రక్రియలోను, మరికొన్ని నిష్పత్తి ప్రక్రియలోను వినియోగిస్తాయి. కృత్తద్ధిత ప్రత్యయాలు మొదటి తెగకు చెందినవి: మాటకారి, దిగుదల, అందకత్తె, చదువరి మొదలైన శబ్దాల్లో కనిపించే '—తనం, —కారి, —దల, —కత్తె—అరి' నామోత్పత్తి ప్రక్రియలో కనిపిస్తాయి. ప్రేరణార్థకంలో వచ్చే '—ఇంచు, —పు' మొదలైనవి క్రియాప్రాతిపదికల నిర్మాణంలో వస్తాయి. నామ, క్రియా విభక్తులు —కు, —ను, —తో, —డు, —రు, —వు, —ను, —ము, మొ.వి రెండో తెగకు చెందినవి. ఒకే పదంలో ఈ రెండు రకాల ప్రత్యయాలూ వచ్చినప్పుడు నిష్పాదక ప్రత్యయాలెప్పుడూ ఉత్పాదక ప్రత్యయాల తర్వాతనే కాని ముందురావు: ఉదా : మంచి – తనం—లో. ధాతువు : మంచి; తద్ధితం :—తనం; విభక్తి :—లో.

అనుబంధం:

ఈ వ్యాసంలో ప్రయోగించిన పారిభాషికపదాలకు ఇంగ్లీషులో సమాన పదాలు

పదం	Word
పదాంశం	Morpheme, Morph
సపదాంశం	Allomorph
రూపం	Morph, form
ధాతువు	Root
ప్రత్యయం	Affix
ధాతుపూర్వ	Prefix
ధాతుపరం	Suffix

తల వున్న డాక్టర్ని తాను ఎంతతొందరగా వెళ్ళి తీసుకువస్తే అంత మేలుంటుందని బుర్రలో తడుతూనేవుంది; కాని రోగిని తను కంగారుపెట్టిన వాడవుతే?

'ఒరేయ్ రంగా, నేను చెప్పేమాటలు నువు నమ్మవు!' అన్నాడు కూనేశ్వరుడు, రంగారావును సూటిగా చూస్తూ.

'నమ్మతా—చచ్చినట్టు నమ్మతా— నువు నన్ను నమ్ము!' అని చటుక్కున సమాధానం చెప్పిన రంగారావుకు కూనాయి చూపూ, వాడి మాటల ధోరణిలోనూ విపరీత లక్షణాలేవో వున్నట్టు సందేహం కలిగింది.

'అబ్బ! నీ మేడమెట్లుమండ! యిప్పటి కింకా దడ తగ్గకపోయె!' అన్నాడు కూనేశ్వరుడు.

'అంతేగద! అయితే ఫరవాలేదు! నీ భార్యా బిడ్డలూ, మీవాళ్లంతా బాగున్నారా?' అడిగాడు రంగారావు కూనేశ్వరుణ్ణి పరిశీలిస్తూ.

'ఆ వరద మండిపోను! ఎంతమందిని పొట్టన పెట్టుకుంది! మేం బాపట్లలోనే వుంటున్నాంగనక మొలోతు నీళ్లలోనే బయట పడ్డాం. ఒరే రంగా! మనకు రోజులు కలిసొస్తే నీ మొహాన వుమ్మేసినవాళ్లే నీ మెళ్ళో పూలదండ వేస్తారు. తెలిసిందా? సరిగ్గా నాకదే జరిగింది!' అన్నాడు కూనేశ్వరుడు కొంచెం కళ్లు పెద్దవి చేస్తూ.

'ఒరే కూనాయ్. నీకీ జన్మలోమంచిరోజులు వొచ్చినయ్యని నేను వింటం జరుగుతే నీకోసమన్నా తిరుపతి వెళ్ళి జుట్టు తీయించుకొస్తా! ఈ వరద సందర్భంలో పొరపాటున నీకేమన్నా పెట్టెలు దొరక లేదుగదా?' అనడిగాడు రంగారావు, కూనేశ్వరుణ్ణి సందేహంగా చూస్తూ.

'ఛీ ఛీ! అంతఖర్మేం పట్టలేదు! నాకు రెండులక్షలఎనభైవేల చిల్లర లాట్రీలో వచ్చింది!' అనేశాడు కూనేశ్వరుడు, నూటఎనభై డిగ్రీలమేర చూస్తున్న కళ్లతో.

'చంపేశావు!' అనో కేకపెట్టి కుర్చీకి అంటుకుపొయ్యాడు రంగారావు.

'మన ముఖ్యమంత్రి తన స్వహస్తంతో చెక్కు నా చేతికిచ్చాడు! ఆ చెక్కును బాంకిలో నా ఎక్కౌంటులో వేసుకున్నా!' అన్నాడు కూనేశ్వరుడు చిరునవ్వుతో.

కొన్ని క్షణాలపాటు కూనేశ్వరుణ్ణి నఖశిఖ పర్యంతం ఎక్సురే కళ్లతో ఎగాదిగాచూసి, ప్రస్తుతం జరిగిందంతా ఒక్కసారి నెమరేసుకుని, వరదవార్తలుతప్ప తను యితర విషయాలను పేపర్లలో అంతగా పట్టించుకోకపోయినా కూనాయ్ చెబుతున్నది అక్షరాలా నిజమై వుంటుందని నమ్మాడు రంగారావు. ఎందుకంటే అకస్మాత్తుగా చావు కబురు విన్నా, లాట్రీలో లక్షలొచ్చినయ్యని తెలిసినా ఏ మనిషయినా షాకు తింటంలో ఆశ్చర్యం లేదు! బహుశ కూనేశ్వరుడికి బాపట్లలో తగిలిన షాకు మద్రాసుదాకా వెంటాడినా ఆశ్చర్యపడ నవసరం లేదు.

'నువు నూరేళ్లు బతుకు! నీలాంటి అదృష్ట వంతుడు కొన్ని లక్షల మందిలో ఒక్కడే వుంటాడు! లాట్రీ ధనదేవత లక్షలమంది అభాగ్యుల్లో ఒకణ్ణే వరిస్తుంది! నీ దరిద్రం తీరినందుకు నిన్ను మనసారా అభినందిస్తున్నా!' అన్నాడు రంగారావు.

'నువు నన్నభినందిస్తున్నందుకు నాకెంతైనా సంతోషంగావుంది! కాని యింతటితో నా దరిద్రం నిజంగా తీరిందా అనే ప్రశ్న నన్ను వెంటాడి పీడిస్తున్నది. ఈ లాట్రీ నామనసదో రకంగా తయారైంది! నాలో ఏవో కొన్ని వింత అలజళ్లు బయల్దేరినై!' అన్నాడు కూనేశ్వరుడు, రంగారావు నదో రకంగా చూస్తూ.

'నీ మనసేదో రకంగా తయారవటం పరమ

కూనేశ్వరుడి కబ్బిన అదృష్టం

శ్రీ మా. గోఖలే

రిస్టువాచి టైము చూసుకుంటూ హడావిడిగా అద్దెకొంపకు తాళంవేసి కాలేజీకి బయల్దేరిన రంగారావు, మేడమెట్లు దిగేందుకు అట్లా కాలు మోపాడో లేదో — కిందనుండి మేడమెట్లెగబాక్కుంటూ రొప్పుతూ పైకొస్తున్న కూనేశ్వరుణ్ణి చూసి, మెట్టుమీద కాలుపెట్టినవాడు పెట్టినట్టే నుంచుని పొయ్యాడు.

'నువు – నువు —వుండవనుకున్నా'— అంటూ రంగారావును తోసుకుంటూ ఎగరొప్పుతో ఒక్క క్షణం అట్లాగే నుంచుని—చటుక్కున వరండాలో చతికిలపడ్డాడు కూనేశ్వరుడు, రంగారావు వేపు వింతగా చూస్తూ.

కూనాయ్ ఆ మొహం — అకస్మాత్తుగా వాడొచ్చి ఆ విధంగా చతికిలపడిపోయిన తీరూ మూరుపాళ్ళా పరిశీలించిన రంగారావుకు గుండెలో ఏదో చిక్కబట్టి నట్టయింది.

నిన్న టపాలోనే ఎంకా కూనేశ్వరుడినుంచి తనకు వుత్తరం వచ్చింది. విమానం పగిలి సముద్రం మధ్యపడినట్టు తనబతుకు బద్దలైందని వాడు రాసిన వుత్తరం యింకా తన టేబిలుమీదే వుంది. వివరాలైతే రాయలేదు కాని జీవితం వాడికో దయ్యం లాగా కనుపిస్తున్నట్టు వాడు అడ్డగోలుగా రాసిం దాన్నిబట్టి తను వూహించ గలిగాడు. అయితే వాడా రాసిన వుత్తరం తనకు పదిరోజుల తరువాతగాని చేరలేదు. ఈ పదిరోజుల్లోనే బాపట్ల తాలూకాలో భయంకరమైన వరద బీభత్సవం జరిగింది. కూనేశ్వరుడిది బాపట్ల దగ్గర ఒక చిన్న పల్లె టూరు. బాపట్లలో ఓ బాంకులో కాషియరుగా వుద్యోగం చేసుకుంటున్నాడు. బట్టతలపై వడగళ్ళ వాన పడ్డట్టు—అంతంత మాత్రంగా వుంటున్న వీడి కుటుంబానికేం ప్రమాదం జరగ లేదుగదా! వాడు వరదల్లో నానిన మనిషల్లేనే కనుపించాడు. ఇంకేమాత్రం తాత్సారం చేసినా ఏ క్షణాన కూనాయ్ వెక్కివెక్కి ఏడ్చినా ఆశ్చర్యం లేదు! యింకా నయం! తన భార్య పంకజం యిద్దరు పిల్లలతో మొన్ననే గూడూర్లో వుంటున్న తన అన్నదగ్గర కెళ్ళింది! పంకజం అసలే గుండె నీరసం మనిషి!

కూనేశ్వరుణ్ణి జాలిగా లేవదీసి, తలుపు తాళంతీసి సోఫాలో కూచోబెట్టి ఫానువేసి, తను ఎదురు కుర్చీలో కూచుని వాణ్ణి లోతుగా చూశాడు రంగారావు.

'అబ్బ! నాకింకా దడ తగ్గలేదు!' అన్నాడు కూనేశ్వరుడు దీర్ఘంగా శ్వాసవిడుస్తూ.

'ఫరవాలేదు—నువు తొందరపడకు - కొంచెం తాపీగానే మాట్లాడు—' అంటున్న రంగారావుకు యిటీవల తను వింటున్నా, చదువుతున్నా గుండె జబ్బుల వార్తలు మెదళ్ళో గిర్రున తిరిగినై.

'నాకు అప్పుడప్పుడు రక్తపోటు వస్తూ వుంటుంది! నీ కుటుంబం యింట్లో లేనట్టున్నారే?' అన్నాడు కూనేశ్వరుడు గుండెమీద నెమ్మదిగా రాసుకుంటూ.

'పంకజం, పిల్లలు గూడూర్దాకా వెళ్ళారు. మరేం ఫరవాలేదు, కొంచెం ఆగుతే పోటు అదే సర్దుకుంటుంది' అని రంగారావంటున్నా నాలుగిళ్ళవ

సహజం! అందుకు నువేం కంగారు పడక్కర్లేదు! నీ స్థితి నేను తేలిగ్గా అర్థం చేసుకోగలను! జిహ్వా చాపల్యంతో మృత్యువాతనుపడి బతికినవాడు, ఎన్నో రుచిగల పదార్థాల్ని ఒకేసారి తినాలని కొట్టుకులాడ్తాడు. దరిద్రంతో చస్తున్న వాణ్ణి ధనదేవతొచ్చి ఆలింగనం చేసుకుంటే ఆ చస్తున్న వాడు నిఠారుగా లేచి కూచోటమే కాదు, వూహకందని నూతన శక్తులేవో వాడి నావహిస్తయ్! అంటే అట్లాంటి శక్తులేవో నీలో ఆవిర్భవించినై గనక అలజళ్లుంటం సహజం!' అన్నాడు రంగారావు.

'సైకాలజీ గురించి కవిత్వ ధోరణిలో నువు చెప్పింది బాగానే వుంది! నాకు నిజంగా ఏ రేసుల్లోనో, లాట్రీల్లోనో రెండు మూడు లక్షలు తగుల్తే నేను చేయవలసిన పన్లను గురించి కొన్ని ఆలోచన లుండేవి! చిత్రమేమిటంటే తీరా నాకా అదృష్టం అబ్బేసరికి ఆ ఆలోచనల్లో ఒక్కటైనా నన్ను తాకటంలేదు!' అన్నాడు కూనేశ్వరుడు, రంగారావును వింతగా చూస్తూ.

'అవును, తాకకపోవచ్చు. మచ్చుకు వాటిలో ఒక్క ఆలోచనయినా నాకు వినిపిస్తే నిన్ను కొంతైనా అర్థంచేసుకుంటా!' అన్నాడు రంగారావు.

'ఒరే రంగా, నీకన్న నా కాప్తమిత్రు డింకోడులేడు. దాపరికంలేకుండా ప్రస్తుతం నన్నొచ్చి అంటుకున్న ఆలోచనల్ని గురించి నీకు చెప్పేస్తా. ఏ రేసుల్లోనో, లాట్రీల్లోనో ఛాన్సు తగల్టంతప్ప నా జీవితాన్ని నా వుద్యోగంతో గట్టెక్కించగలననే ఆశ నాకేకోశానా లేకుండాపోయింది. దైవికంగా యిప్పుడు నాకా ఛాన్సు తగిలినమాట నిజమే. చేసిన అప్పులూ, నిలువునా వొల్చుకున్న నా భార్య తాలూకూ నగలూ, నేను బ్యాంకుడబ్బు తీసుకున్న సందర్భంలో నా మామ నన్నాదుకున్న తాలూకూ డబ్బూ మొత్తం ఎవర్ది వారికి వడ్డీతో సహా తీర్చివేసేద్దామనుకోటమేకాదు, ఎవరైనా అభాగ్యుల అవసరాలకు కొంత మొత్తం స్విద్దామను కున్నాకూడా; కాని యిప్పట్లో ఆ ఆలోచనలవల్ల అంత గట్టి ప్రయోజనం వుండదని నాకు తోస్తున్నది. ఎందుకంటే నా జీవితానికో వెలుగు బాట ఏర్పడాలంటే యిప్పుడు నా చేతికొచ్చినధనం యింకోసారి లభ్యంకావటం కల్లోనిమాట! ఆ బాట ఏర్పడ్డానికి ఎంతో కాలవ్యవధికూడా అవసరంలేదని నాకు తెలుసు. అవి ఏర్పడిన మరుక్షణం నేను ఋణవిముక్తుణ్ణవటమేకాదు, పది కుటుంబాల్ని తేలిగ్గా పోషిస్తా! బహుశ నేనంటున్నది నీకిప్పట్లో అర్థంకాకపోవచ్చు' అన్నాడు కూనేశ్వరుడు గంభీరంగా చూస్తూ.

'ఇందులో అర్థంకానంత గూడార్థాలేమున్నయిరా కూనాయ్! నీ చరిత్రకు బీజా లెక్కడేర్పడి ఎటుగా ప్రయాణిస్తున్నదీ నాకు కళ్లకు కట్టినట్టు తెలుస్తున్నది! మంచీ, చెడూ, నీతీ అనే మాటల విలువ నీకు పట్టింపువుంటే నీ ఆలోచన లింకోరకంగా వుంటయ్. జూదాలకూ, రేసులకూ నీ భార్య నగలన్నీ వొలిచేశావంటే నువు గోహత్యచేసినంత మహాపాపం చేశావు! బెంగుళూరు రేసుల్లో క్షవరంచేసిన బాంకిడబ్బు తీరా బాంకివాళ్లు పసిబట్టి నీ కుతిక పట్టుకునేసరికి, కాస్త గోప్యంగా బతుకుతున్న నీ మామ నందులోకి లాగి, నువు బయటపడి, ఆయన పరువు నుతికేసి దండా నారేశావు! ఒరే కూనాయ్! నలుగురిచేత నీఅంత మంచివాడు లేడనిపించుకునేందుకు చికిత్స చేయడానికి యిప్పుడు నీ చేతికోమాంచిమందు దొరికింది! ఈ సదవకాశాన్ని నువ్వేనాడే వుపయోగించుకో!' అన్నాడు రంగారావు.

'ఆ చికిత్స నువ్వూ నేనూ చేయకుండానే జరిగింది! నాకు లాట్రీలో రెండు లక్షల ఎనభైవేలొచ్చిందని విసీ వినటమే తడవుగా నన్ను తిట్టిన వాళ్లంతా మిడతలల్లే నా దగ్గరవాలి, విప్పారిన మొహాల్తో నన్నభినందించారు! నాకు పరిహారం లేదని రాసిపెట్టిన వాళ్లే ధనదేవతొచ్చి నావొళ్లో కూచోటం చూసేసరికి వెంటనే ఆ రాసింది వాళ్లే తుడిచేసుకున్నారు! ఒరే రంగా, యిది డబ్బు. ఎని

అవినీతుల్ని పాపాల్నయినా యిట్టే హరించేస్తుంది! చేసిన సహస్ర పుణ్యాలను ఒక్క పాపకార్యం తుడిచేస్తుందనే వాక్కుకు యిది ప్రత్యామ్నాయ సిద్ధాంతం. అదే డబ్బు సిద్ధాంతమనే నిజాన్ని నేనెప్పుడో తెలుసుకున్నా అందుకే డబ్బార్జనకోసం నేనెన్నాయుధాల్నయినా ప్రయోగించా! రేపు ఎట్లా గడుస్తుందా అనే పీడా దృశ్యాలు ప్రత్యక్షమయ్యే నాకు, తెల్లవార్లేస్తే బాంకు వుద్యోగంలో వేలు, లక్షలు బొత్తులు గట్టి యింకోరికోసం భద్రపర్చటం నాకెంత బాధాకరంగా వుంటుందో నేనెవరికీ చెప్పలేను! ఒక్కో లక్షాధికారి మా బాంకులో అడుగు పెడ్తుంటే ఏజంటు దగ్గర్నుంచి మా ఎకౌంటెంటువరకూ ఎవరో తన్నినట్టు కుర్చీల్లోంచి లేచి దండాలు పెట్టటం నేను రోజూ చూస్తూంటా! కొందరు మా బాంకిలో వేలకొద్దీ అప్పులు తీసుకుని, మరదేం వ్యాపారాలు చేస్తారో ఏమో, వారం తిరక్కముందే యిట్టే ఆ అప్పులు తీర్చేసి, వేలు లాభాలు చేసుకోటం నాకెంత ఆశ్చర్యం వేసేదో! యింతకీ ఒక్కమాటలో నీకు క్లుప్తంగా చెప్పాలంటే, రోజూ వేలకొద్దీ పచ్చనోట్లు నన్ను తాకుతూ పక్కనబడి పోతయ్యేగాని నన్ను కన్నెత్తయినా చూడవే! అందుకే ఆ ధనదేవత నన్ను కటాక్షించి తీరాలనే నిశ్చయానికొచ్చా! చివరకది జరిగిందికూడా! ముందు జరగబొయ్యేదికూడా అంతే!' అన్నాడు కూనేశ్వరుడు.

'ఒరే కూనాయ్, నువు లక్ష చెప్పు. నీమతం అంటే డబ్బుకోసం నువు అవలంబించే పద్ధతుల్నిమటుకు నేను సమర్థించలేను' అన్నాడు రంగారావు.

'...అంటే నేను చచ్చిచావకుండా సంకెళ్లేసుకుని ఆ బాంకి వుద్యోగంలోనే నల్గి మాడినట్టు మాడమంటావా?' అనడిగాడు కూనేశ్వరుడు.

'అని నేనంటం లేదు. నిత్యావసరాలు తీరని కొన్ని లక్షలు, కోట్లమంది అభాగ్యులు మనదేశంలో వున్నారు. వాళ్ల స్థితి మెరుగు పడేందుకు పరిస్థితులు మారటం అవసరంకూడా. మనం వాచి పోయిన స్వాతంత్ర్యం మనదేశంపొందినాక వాళ్లస్థితి మెరుగైందని నేనంటంలేదు. కాని యీ అవసరాలు తీరనివాళ్లంతా అవినీతికీ జూదాలకీ పూనుకుంటే మనం ఎక్కడికి పోతున్నామనే నేనంటం' అన్నాడు రంగరావు.

'ఒరేయ్, నీ కాగిట్టని అవినీతీ, జూదా లనే మాటలకర్థం ఏమిటనడుగుతున్నా. ఆ మాటలు మనకామోదకరమైనవిగా మన ప్రభుత్వం, ప్రజలూ ఎప్పుడో వొప్పుకున్నారు. నువింకా వాటిని పట్టుకు వెళ్లాట్టం నాకేమంత వివేకంగా తోచటం లేదు. మనదేశంలో తాగేందుకూ, జూదాలాడేందుకు, క్లబ్బులకూ, రేసులకూ, లాట్రీలకూ మన ప్రభుత్వం మంజూరు చేసిన లైసెన్సులున్నయ్. లైసెన్సుకు లోబడిన పై అలవాట్లన్నీ నాకున్నయ్. అందుకు నువ్వు నన్ను తప్పుపట్టడం బొత్తిగా అర్థరహితమైందని నువ్వు వొప్పుకోవటం మంచిది. నేను బి. ఏ. ఎకనమిక్సు ప్రెసిడెన్సీ ఫస్టున పాసైనాననే విషయం నీకు తెలిసిందే. నాకీ పిండాకూడు యోగ్యత ధనార్జనకు ప్రతిబంధకమని నాకామధ్యే కనువిప్పయింది. ఎందుకంటే ఏ యోగ్యతల్తో నిమిత్తంలేకుండా లక్షలు గడించేవాళ్ల సొమ్ము నేను భద్రంగా వాళ్లపేర కట్టలు కట్టేందుకే నా వుద్యోగం పరిమితమైందని తెలిసిన మరుక్షణం నా వొంటినిండా చీమలు, జెర్రులు పాకుతున్నట్టనిపించింది! అందుకే నాకు పట్టుకున్నవ్యాధి నివారణకు రేసులూ లాట్రీలకు మించిన మందు లేదనిపించింది. ఇందాక నువ్వన్నావే డబ్బు మానవుడిలో నూతన శక్తుల్ని పుట్టిస్తుందని; ఆ శక్తుల్ని పరీక్షించేందుకే నేను మద్రాసు వచ్చింది!' అన్నాడు కూనేశ్వరుడు.

'ఒరే కూనేశ్వరుడూ! యిప్పుడు నేను నిన్ను సొంతం అర్థంచేసుకున్నా. నీ మేధస్సు గాడి తప్పిందంటంలో నాకేమాత్రం సందేహంలేదు.

బొంకుబొంకినకొద్దీ నిజమైనట్లు భ్రాంతి కలిగించినా బొంకుబొంకేననే నిజంతో పాపం నీకు నిమిత్తంలేదని నాకు తోస్తున్నది. ప్రతిబూతునూ, అవినీతినీ, హత్యల్నీ, కిరాతకచర్యల్నీ, హింసనూ, మంచినిచెడుగానూ, చెడును మంచిగానూ సమర్థించి నమ్మించేందుకు మన భాషలో వచ్చేన్ని మాటలూ, వాటిని పంపిణీచేసేందుకు తలవెంట్రుకలన్ని పత్రికలూ, వేదికలెక్కి గొంతులు చించుకునేందుకు సరిపడినన్ని మతాలూ మనకు కొల్లలుగా వున్నయ్. బౌద్ధులు, శైవులు, వైష్ణవులు ఒకరిగొంతుకొకరు పిసికినా, హిందువులు, ముస్లిములు యివాళ నడివీధుల్లో హత్యలు చేసుకుంటున్నా ఎవరి చర్యలు వారికి సమర్థనీయంగానే వుంటయ్! అట్లాగే యీనాటి రాజకీయమతాలు కూడా. ఒక మతావార్ని యింకో మతావారు ఎవ్వరైనా దుమ్మెత్తిపోసినా, కుతికలుకోసినా ఎవరి ప్రయోజనాల్ని వారు వెనకేసుకొని సమర్థించుకునేందుకు ఎన్నిమాటలు, ఎన్నిపత్రికల్ని ఖరాబు చేస్తారో మనం నిత్యం చూసే విషయమే. వేల మొత్తాల్తో జూదాలు నడిచే క్లబ్బులు, రేసులు, లాటరీలు, తాగుడువల్ల ప్రజాసౌకర్యాలు తీర్చేందుకు ప్రభుత్వానికి రాబడి వుంటుందని యెవరైనా కుతర్కంచేస్తే చేయవచ్చుగాని, ఆ చెత్తంతా మన హీనస్థితిని నిరూపించేందుకు మచ్చుతునకలుగా వుపయోగపడ్తయ్యనేదిమటుకు ఖాయం. నేననేదల్లా నీ భార్య నగలమ్మి, నీ మామను ముంచీ, బాంకు డబ్బుపహరించీ, వాళ్ళచేత వుమ్మేయించుకొనిమటుకు నీ వెలుగుబాటల సంగతి చూసుకోవద్దని. నాకు కాలేజీకి టైమైంది. నువు నాతోవచ్చి యేవన్నా తిని, తాళాలిస్తా యిక్కడికేవచ్చి గమ్మున పడుకో, సాయంత్రం నేనొచ్చేదాకా' అంటూనే లేచాడు రంగారావు.

'ఎక్కడికిరా నువు పోయేదీ—నువావిధంగా త్రిశంకుస్థితిలో నన్వొదిలేసి నీదార్న నువుపోతే నేను బాధ భరించలేను. దగ్గరెక్కడైనా ఫోను వుంటే కాలేజీకి సెలవుచెప్పి, కొంచెం కాఫీటిఫిన్ లాంటివి ఏర్పాటుచేయిస్తే నీఅంతనీతిపరుడు యింకోడుండడు'—అన్నాడు కూనేశ్వరుడు.

ఆ మాటకొస్తే కూనేశ్వరుడి లోతు సొంతం చూడంది తెంచేసుకున్నట్టు తను కాలేజీకి వెళ్ళటం రంగారావుకు అంత రుచించలేదు.

'సరే, యివాళ నువు వెనకటి కూనాయివి కాదాయె! లక్షాధికారివైపోతివేమరి! ధనదేవత నిన్నేమి ఘనకార్యాలు చేయమంటుందో, నీ అలజళ్ల నైజమేమిటో ఆసాంతం తెలుసుకోంది నాకుమటుకు కాలాడుతుందిట్రా కూనాయ్! కిందఘంటివాళ్లకు ఫోనుంది, ఆ చేత్తోనే వాళ్లబ్బాయి నెవర్నైన హోటలుకుపంపే ఏర్పాటుకూడా చూస్తా; నువీలోపు, అక్కడే తువాళ్లున్నయ్, ఆ స్నానాలగదిలో ఒళ్లు శుది చేసుకో' అని మెట్లుదిగి కిందికి వెళ్లాడు రంగారావు.

ఓ అరగంటలో కాఫీ, టిఫెన్లయినాక నసాళం అంటేట్టు సిగరెట్ దమ్ముపడ్తున్న కూనేశ్వరుడికి రంగారావెంతసేపటికీ కప్పులూ, ప్లేట్లు కడిగి సద్దటంనుంచి బయటపడకపోవటం కొంచెంవిచారం కలిగించి, కేకేశాడు 'ఒరే రంగా, నువా తెలిసీతెలియని ఆడపనుల్లచేయటం నేను చూళ్లేను! నువు ఎంత సర్దినా అవి వుండవలసిన తీరుగానే వుంటయిగానీ, యిటొచ్చి కూచో.'

'నీకేం లక్షాధికారివి! మా ఆవిడ క్యాంపుకు వెళ్ళినా, ఆవిడ వాసన నన్నంటి పెట్టుకునే వుంటుంది! తను మళ్ళీ ఇంటికి తిరిగి వచ్చేప్పటికి పెట్టిన వస్తువు పెట్టిన చోట వుండటమూ, ఇల్లు అద్దమల్లే క్లీనుగా వుండటమూ చూస్తే ఆవిడ ఆత్మ ఎంతానందిస్తుందో నీకేం తెలుసు!' చేతులు తుడుచుకుంటూ వొచ్చి కుర్చీలో కూచున్నాడు రంగారావు.

'ఒరే రంగా, నేనో గట్టి కార్యాన్ని సాధిద్దామనుకుంటున్నా!' అన్నాడు కూనేశ్వరుడు.

'గట్టి కార్యమా ఘనకార్యమా?' అడిగాడు రంగరావు.

'రెండింటికీ పనికొస్తుంది!' అన్నాడు కూనేశ్వరుడు.

'ఏమిటది?' అడిగాడు రంగారావు.

'నేనో సినిమా తీద్దామనుకుంటున్నా!' అన్నాడు కూనేశ్వరుడు రంగారావును పరిశీలిస్తూ.

'నువేదో నిజంగా ఘనకార్యం చేస్తావనే భ్రాంతి కలిగింది. ఒరే కూనాయ్, నీ మనసు బాగా పనిచేస్తున్నదా?' అడిగాడు రంగారావు.

'నిక్షేపంగా పనిచేస్తున్నది! ఏం సినిమా తీయటం ఘనకార్యం కాదంటావా? అసలు సినిమాలంటే నీకు గిట్టుతుందో లేదో ముందు చెప్పు' అడిగాడు కూనేశ్వరుడు.

'అది అందరూ చేస్తున్న పనేగదా, యిందులో ఘనతకు సంబంధించిం దేముంటుందా అని అన్నానే గాని నువ్వు మరోలా అనుకోబోకు' అన్నాడు రంగారావు.

'నీ ధోరణి బొత్తిగా నాకు నచ్చటం లేదు. వింతగాకూడా వుంది! నీ వాలకంచూస్తే సినిమా లంటే నీకేదో దొబ్బుడాయున్నట్టుంది! ఎందుకంటే సినిమా పేరెత్తినా, సినిమా మనుషుల్ని చూసినా ఎగిరి గంతేసే మనుషులు కొన్నివందలు, వేలమందిని నే నెరుగుదును! వాళ్ల అభిప్రాయాలు కాదంటావా ఏమిటి ఖర్మ!' అన్నాడు కూనేశ్వరుడు.

'అనే ఖర్మ నా కెందుకు! భలాని సినిమా బాగుందంటే బాగుందీ లేదంటేలేదని చెప్పడమే నా వంతు' అన్నాడు రంగారావు.

'రక్షించావు! అయితే సినిమా ప్రభావం నీకు బొత్తిగా తెలియదంటం సబబుగాదు. అన్నట్టు నీకు తెలిసిన కొందరు సినిమా మిత్రులున్నారని లోగడ నువు చెప్పినట్టుకూడా నాకు జాపకం' అన్నాడు కూనేశ్వరుడు.

'నేనీ మద్రాసులో మన తెలుగు సినిమాలు చూసేందుకు వాళ్ళే నాకాధారం. ఒక్కోసారి ఒక్కో మన తెలుగు సినిమాచూస్తే వచ్చే వికారం నివారణ చేసుకుంటానికి యింకో సినిమాచూసి చివరకు అదొక అలవాటుకింద చేసుకున్నా' అన్నాడు రంగరావు.

'అది నీ ఖర్మ! లక్షలమంది ప్రజలుచూసి ఆనందించే సినిమాలు నీకు నచ్చడం లేదంటే అది మీ కాలేజీ తత్వాలకుండే జబ్బేమోనని నా కనుమానంగా వుంది' అన్నాడు కూనేశ్వరుడు.

'కోప్పడకురా కూనాయ్! మా కాలేజీల తత్వం గురించి నీ అంచనా శుద్ధ తప్పు. కాలేజీ విద్యార్థులు సినిమా ప్రేక్షకజనం కారని నువెందుకు పొరబడ్డావో నాకాశ్చర్యంగా వుంది. వాళ్లు పాఠాల కన్న సినిమాల్ని గురించీ సినిమా స్టార్సు గురించి ఎంతాసక్తితో ఛదువుతారో నీ దృష్టికి పడకపోవటం వింతగానే వుంది!' అన్నాడు రంగరావు.

'నా దృష్టిన పడినా నా కాశ్చర్యం కలగదు. ఒరే రంగా, నా దగ్గరంటే అన్నావుగని, పొరపాట్నన్నా నువు సినిమాల్ని గురించి ఎద్దేవగా బయటెక్కడయినా అన్నావంటే మటుకు నీ తోలు వొలిచి నిన్ను ప్రజావ్యతిరేకిగా జమకట్టేందుకు మనుషులున్నారని నీకు చెప్పగలను! ఎందుకంటే యివాళ సినిమాలంటేవున్న గాఢమైన మోజుతోనే వాటిపై ప్రజలు కనకవర్షం కురిపిస్తున్నారనేది మటుకు ముమ్మాటికీ నిజం' అన్నాడు కూనేశ్వరుడు.

'పిండకూడూ బీరాకూడూ! నూటికి డెబ్భయ్ వంతులు సినిమాలు నష్టపడుతున్నయ్యని సినిమా రంగంలోని నా మిత్రులే అంటున్నారు. ప్రతిచెత్త సినిమాకూ చచ్చినా ప్రజలు డబ్బివ్వరని నువు తెలుసుకోటం మంచిది!' అన్నాడు రంగరావు.

'ఓరి పిచ్చినాయినా, ఆ విషయం నీ కన్న

నాకు బాగా తెలుసు! వాళ్ళకు నచ్చిన సినిమాల మీదే కనకవర్షం కురిపిస్తున్నారని నా వుద్దేశ్యంగా నువెందు కనుకోకూడదూ? ఒరే రంగా, సినిమా రంగం ఒక వ్యాపారరంగం. ఇతర వ్యాపారాల్లాగనే దీనికీ లాభనష్టాలు రెండూవుంటం సహజం. చివరకు సినిమా తీయటం ఒక లాట్రీ లాంటిదనో, రేసుల్లాంటిదనో, జూదమనో బుజావు చేయడానికి నువ్వు ప్రయత్నించవచ్చు; కాని నాకలాంటి మహిమల్ని గురించి మంచినీళ్ళ ప్రాయంగా తెలుసు గనక నేనంత సులభంగా నీకు లొంగను! అయితే సినిమా వ్యాపారానికో ప్రత్యేకమైన రక్తమాంసాలో కూడిన మేలిమి రంగొకటి వుంది! ఆ మేలిమిరంగు తెరపై అడుగడుగునా కనుపిస్తూ ప్రేక్షక జనాన్ని యిట్టే పట్టేస్తుంది! సరైన మాట తట్టక నేను మేలిమిరం గంటున్నాను. నువు దాన్ని ఎట్లా సర్దుకున్నా నా కభ్యంతరం లేదు! అందుకే సినిమాలకు జనం ఎగబడుతున్నారు! ఆ మనుషులకు వూరేగింపులు జరిపి, హారతులిచ్చి బ్రహ్మరథం పడుతున్నారు! వూరూరా ఆ మనుషుల పేర సంఘాలున్నయ్యని నీకు ఎన్నయినా దాఖలాలు చూపిస్తా! సినిమాకున్న యీ ప్రత్యేక సౌందర్యమే—యీ సౌందర్యమనేమాటకూడా నేను అతికినట్టు వాడకపోతే నువు సరిచేసుకోవచ్చు - నన్ను బలంగా బంధించేసి, నా జీవితానికో పుణ్యం, పురుషార్థాలంటూ ప్రసాదిస్తుందనే గాఢవిశ్వాసం నాలో కలిగింది!' అన్నాడు కూనేశ్వరుడు ఆవేశంతో.

'శుభం! నీ అదృష్టరేఖల్ని చూసిన నేను నిన్నెందుకు కాదనాలి! నిన్నెంతమంది దుమ్మెత్తి పోసినా లాట్రీలో నీకు లక్షలురాకుండా ఆపగలిగారా మరి! అట్లాగే నువ్వు తలబెట్టబొయ్యే సినిమా వ్యాపారం నీకు ధన వస్తు వాహన కీర్తిపుణ్యాల నెందుకు ప్రసాదించకూడదు! ఈ సందర్భంలోనే నన్నో చిన్నధర్మసందేహంకూడా యింకా పీడిస్తూనే వుంది! నేనడిగిన ప్రశ్నకు నువు వెంటనే సమాధానం చెప్పాలి. అకస్మాత్తుగా నీకు లాట్రీలో రెండులక్షలఎనభైవేలు వచ్చేసరికిముందు నీకు అనిపించిందేమిటి?' అనడిగాడు రంగారావు.

'నా దరిద్రం తీరిందని!' అన్నాడు కూనేశ్వరుడు.

'యిప్పుడూ నీకట్లాగే అనిపిస్తున్నదా?' అడిగాడు రంగారావు.

'అంతకుమించి అనిపిస్తున్నది! ఒరే రంగా! నువ్వొత్త పిచ్చినాయనవి! సందర్భాల్నిబట్టి తెలివితేటలనేవి కొన్నిగీతలమధ్యే గూడుకట్టుకునే స్వభావం గలవి! నీ తెలివితేటలు నీ కాలేజీలకుండే వాతావరణం గీతల్ని దాటిపోలేకపోవటం నీ తప్పుకాదు! అందువల్ల రోజూమారుతున్న యీ లోకానికి నువు పాతవాడివి! నీ పాతచూపుకు యీనాటి లోకం నీవేపుకన్నా తిరిగిచూడదు! నీవడిగిన ప్రశ్న వుద్దేశ్యాన్ని నేను గ్రహించలేదనుకోకు! నీకో చిన్న విషయం చెబుతా! డబ్బుకు అయస్కాంతశక్తి వుంది! యీ అయస్కాంతశక్తికి కొత్తడబ్బు నాకర్షించే స్వభావంకూడావుంది! డబ్బు ఖర్చవుతే దాని అయస్కాంతశక్తి దానంతటదే నశిస్తుందికూడా—అంటే నువు దాన్ని సద్వినియోగం చేయకపోతేనే అది సంభవిస్తుంది! ప్రస్తుతం నాకు లాట్రీలో వొచ్చిన డబ్బు నేను సద్వినియోగంచేస్తే అది నాకొక మూలశక్తిగా వుపకరిస్తుంది! అందుకే నీకు సినిమా రంగంలో తెలిసిన మిత్రులున్నారుగనుక వాళ్ళను నాకు పరిచయం చేయమనడుగుతున్నా. అందులో పనికివచ్చేవార్ని ఎన్నుకోవడం నా వంతు. మన పత్రికల ధర్మమాఅని సినిమా వ్యక్తుల పుట్టుపూర్వోత్తరాల్ని గురించిన విషయ సామగ్రిని నేనెప్పుడో చదివి జీర్ణించుకున్నా! యిహ నువు నన్ను కాదనటానికి వీల్లేదు' అని రంగారావు రెండు చేతులూ పట్టుకున్నాడు కూనేశ్వరుడు.

* * *

తను కల్లోకూడా అనుకుంటానికి వీల్లేని

బదిలీ అయింది రంగారావుకు మద్రాసునుండి. మద్రాసులో ఏ తెగకు చెందినవారైనా ఎవరి మానాన వారు గోప్యంగా బతకొచ్చనే అభిప్రాయం రంగారావు కేనాడో కలిగింది. ఏ పొరుగింటివారోనూ ఎవరికీ సంబంధాలుండవు, కావాలని పూసుకుంటే తప్ప. ఇక్కడి యే రాజకీయముఠాలవాళ్లూ నడి బజార్లల్లో ఒకరి గుడ్డల్నింకొకరు చింపుకొని దుమ్మెత్తిపోసుకోటం ఏనాడూ రంగారావుకు చూసినట్టు జ్ఞాపకంలేదు. విశ్వప్రయత్నంమీద ఏణ్ణర్థం దాటినాకగాని తన వుద్యోగాన్ని మళ్లీ మద్రాసుకు మార్పించుకోలేకపొయ్యాడు రంగారావు.

తను బదిలీఅయి మద్రాసునుండి వెళ్లే ముందే కూనేశ్వరుణ్ణి సినిమారంగంలో తన మిత్రులకు పరిచయంచేసివెళ్లాడు రంగారావు. ఆ పరిచయంచేసిన నాలుగోరోజుకే కూనాయ్ తనకు కనుపించి సినిమా వాతావరణంలో తను కొత్తగా కనిబెట్టిన విశేషాలూ, టాప్‌స్టార్సుతో తను ఎంత పూసుకుతిరుగుతున్నదీ తనకు చెప్పవలసిన పద్ధతిలో చెప్పేసివెళ్లాడు. ఈ ఏణ్ణర్థంలో తను బదిలీ అయినప్రాంతానికి వాణ్ణుంచి రెండే వుత్తరాలు తనకొచ్చినై; అదీ తను వెళ్లిన మూడునెలలలోపే. తరువాత కూనాయి విషయం తనకు తెలియలేదు. ఆ రెండో వుత్తరంలో వాడు తన 'లోకేశ్వర్ ప్రొడక్షన్స్'అనేపేర ప్రముఖస్టార్సును బుక్‌చేసి అతి త్వరలోనే షూటింగు ప్రారంభిస్తున్నాననీ తనను యిప్పుడందరూ 'లోకేశ్వర్'అని పిలుస్తున్నారనీ రాశాడు. తనో ప్రముఖవ్యక్తి నౌతున్నానని సూచించేందుకే కూనాయుూవుత్తరం రాశాడని రంగారావు మనసులో ఎక్కడో ఎందుకో కొద్దిగా తాకినట్టనిపించింది.

మద్రాసు వచ్చిన రెండోరోజునే టెలిఫోన్ డైరెక్టరీలో 'లోకేశ్వర్ ప్రొడక్షన్స్'పేరు ఎంత గాలించినా దొరక్క, లోగడ కూనాయి తనకు రాసిన ఎడ్రసు కో లోకల్‌వుత్తరమున్నక్క తను మద్రాసు వచ్చినట్టూ, అదృష్టవశాత్తుముందు తన ఖాళీ చేసిన ఇంట్లోనే తను మళ్లీ చేరినట్టు రాసి పడేశాడు రంగారావు. తను కాస్త స్థిమితపడేలోపు తన వుత్తరంఅందిన కూనాయ్ తన్నొచ్చికలవగలడనుకున్న రంగారావుకు ఆశాభంగం కలిగింది. అయితే ఒక రోజు తను పాండీబజారు గీతాకేఫ్ దగ్గర వున్నప్పుడు దైవికంగా తన ముందుగా కూనాయ్ కార్లో పోతుంటంచూసి చెయివూపాడు రంగారావు. కాని కూనాయ్ వెళ్తున్నకారు ఆగకుండా వెళ్లిపోయింది. తనను కూనాయ్ చూసివుంటాడు అనే సందేహంలోపడ్డ రంగారావుకు బహుశ సినిమా అంతస్తుల్లో వుంటున్న కూనాయికి ప్రస్తుతం తనతో అంత అవసరం వుండకపోవచ్చుననే భావం కూడా కలక్కపోలేదు. కాని తను చూసిన ఆ కార్లో మనిషి నిజంగా కూనాయేనా అనే స్వల్ప సందేహంకూడా పీడిస్తున్నదే మరి! ఆ మనిషి కూనాయల్లేవున్న సినిమా వేషగాడల్లే వున్నాడు! ఏమైనా అనుకున్నంత తేలిగ్గా రంగారావుకు కూనేశ్వరుడు కనుపించలేదు.

ఆ నాడు సాయంత్రం రంగారావు తీరుబడి చేసుకొని భార్య పంకజం, యిద్దరు పిల్లలతో మెరీనా బీచ్‌కి వెళ్లాడు. పిల్లలిద్దరూ సముద్రపు అలలకు కొట్టుకొచ్చిన వింత వింత గవ్వల్ని కుతిదీరినన్ని వేటాడి, తడియిసకతో పిచ్చికగూళ్లు కట్టుకుంటున్నారు. తన పక్కనే కూచుని ఆడ కబుర్లు చెబుతున్న పంకజం ఎవరో గుంజినట్టు పదిబారల దూరంలో తెలిసిన యిద్దరు పెద్ద ఇళ్ల ఆడమనుషుల దగ్గరకెళ్లి వాళ్లతో యిచ్చకాలాడుతుంటం అసంతృప్తితో ఆమోదించిన రంగారావు ఎత్తుగా సంధ్య కాంతుల్లో ఎగరెగిరి పడుతున్న నీలాల తెల్లటి సముద్రం అలల వైపుకు మెల్లిగా తనదృష్టి మళ్లించాడు.

టపీమని ఓ పెద్దఅల విరుచుకు పడిందో లేదో—వులిక్కిపడి తల ఎత్తి చూచిన రంగా

రావుకు తన ఎదురుగా కూనేశ్వరుడు ప్రత్యక్షమైనాడు. తను కార్లో చూసిన మనిషి యీ కూనాయేనని చప్పున అనుకున్నాడు రంగారావు.

గడ్డందాకా గొంతుకూ వొంటికీ బిగిసిన ఎర్రపొట్టిచేతులన్నైలాను బనీనూ, కాళ్ళకు అంటకుట్టిన టెర్లిన్ పాంటూ, నల్లద్దాల తెల్లఫ్రేము గాగిల్సూ, పెన్సిల్తో గీసిసట్టున్న మీసాలు, కత్తిరించిన అంగుళం చిరుగడ్డం, బ్లాక్ అండ్ వైట్ సిగిరెట్టు డబ్బా, సిగర్ లైటుతో సినిమానటుడల్లే నిలువునా కనుపించిన కూనేశ్వరుణ్ణి ఒక్కక్షణం కనురెప్పలాడిస్తూ చూసిన రంగారావు 'ఏరోయ్ కూనా— లోకేశ్వర్! అనుకోకుండా యిలా దర్శన మిచ్చావేమిటి!' అని సహంలోనే మాట సవరించుకున్న రంగారావు, కూనేశ్వరుడికి కొంచెం వెనకనే సినిమా స్టార్లల్లేవున్న యిద్దరూ ఆడా, ఒక మొగ మనిషినికూడా గమనించాడు.

కొంచెందూరంలోనే తెలిసిన యిద్దరు ఆడ మనుషులతో మాట్లాడుతున్న రంగారావుభార్య పంకజానికి తనభర్తను నలుగురు సినిమాస్టార్లు చుట్టుముట్టడం కంటబడింది. ఆ క్షణంనుంచీ ఒక కన్ను యిటు ఆడమిత్రులకూ, యింకో కన్ను అటు తన భర్తను చుట్టుముట్టిన సినిమా మనుషులవైపూ విభజించి సతమత మవుతున్న పంకజం, యింకో అరగంటకు తన భర్త సినిమా వ్యక్తుల్నుండి విడుదలకావటం కనిబెట్టి, మిత్రులకు సెలవిప్పించి అరనిమిషంలో రంగారావు దగ్గర కొచ్చి వాలింది.

'ఎవరండీ ఆ మనుషులూ?' మరుక్షణంలోనే అడిగింది పంకజం రంగారావును ఆనుకొని కూచుంటూ.

'నువు నన్ను వొదిలేసివెళ్ళకపోతే నీకేబాధా వుండేదికాదుగదా!' అన్నాడు రంగారావు, పంకజాన్ని మోచేత్తో చిన్నగా పొడుస్తూ.

'అబ్బ వుండండి– యిక్కడి జనం కళ్ళన్నీ వాళ్ళమీదే వున్నయ్, కొంపదీసి వాళ్ళు సినిమా స్టార్స్కాదుగదా?' అడిగింది పంకజం.

'ఇంకోరి కళ్ళేమిటి ఖర్మ, నీ కళ్ళని వొప్పుకోరాదూ?' అన్నాడు రంగరావు.

'నాకంత ఖర్మేంపట్టలా! ఆ సినిమా వాళ్ళను ఎవరైనా యిట్టే పసిబడ్తారు, నాకన్న వెయ్యిరెట్లెక్కువగా! యిహ చెప్పండి వాళ్ళెవరో' అన్నది పంకజం.

'అందులో ఎర్రబనీను మనిషి మన కూనాయ్! మిగతా ముగ్గురూ వాడి సినిమా మిత్రులు' అన్నాడు రంగారావు.

'ఎవరు—మీ స్నేహితుడు కూనేశ్వరావా! ఎంతచిత్రం! నేను చచ్చినా ఆయిన్ని పోల్చుకోలేదు! యిప్పుడాయన పేరు లోకేశ్వర్ కాదుటండీ?' అన్నది పంకజం

'భగవంతుడు నీకెంత జ్ఞాపకశక్తిచ్చాడూ! వాడెప్పుడో రాసిన వుత్తరంలోని ఆ విషయం నాకు జ్ఞాపకంచావక వాణ్ణి 'కూనాయ్' అనబోయి సహంలోనే నాలుక కొరుక్కున్నా' అన్నాడు రంగారావు.

'యింకా నయం! అంతపనీ మీరు చేసుంటే ఆయనెంత బాధపడుండేవాడో పాపం!' అన్నది పంకజం.

'పాపం వాడి సంగతేమోగాని ముందు ప్రత్యక్షంగా నీ బాధమటుకు చూశా!' అన్నాడు రంగారావు.

'మరీ చిత్రమండీ మీది! 'కూనాయ్' అని ఆ నోరు సాగదీసి అనుంటే మీకే తెలిసేది!' అన్నది పంకజం రంగారావును చిన్నతోపుతోస్తూ.

'ఒప్పుకున్నా! ముమ్మాటికి నీ మాట ఒప్పుకొని తీరాకూడా!' అన్నాడు రంగారావు పంకజం పాదం నొక్కుతూ.

'అవునండీ, ఆయన లాట్రీలో వచ్చిన డబ్బుతో సినిమాలు తీస్తున్నాడన్నారు, యిప్పటి

కేమేం తీసి ఎంత డబ్బు గడించాడో మీకేమన్నా చెప్పాడా?' అడిగింది పంకజం.

'వాడు మొదట ప్రారంభించిన చిత్రమే సహంలో వుందనీ, యిప్పటికి ఏడున్నర లక్షల ఖర్చయిందనీ అంటాడు' అన్నాడు రంగారావు.

'అమ్మ బాబోయ్! సహానికే అన్నిలక్షల ఖర్చే! లాట్రీలో వచ్చింది రెండు లక్షల ఎనభై వేలయితే, ఆయనకంత డబ్బెక్కడ్దండీ?' అడిగింది పంకజం.

'అదేమో నాకు తెలియదు; కూనాయి చెప్పిన మాటలే నేనంటున్నా. యిప్పుడు వాడితో వచ్చిన యింకొకతను కోటీశ్వరుడట. ఆయనతో భాగస్వామిగా యింకో చిత్రంకూడా మొదలు పెట్టాట్ట' అన్నాడు రంగారావు.

'ఇదేం ఖర్మండీ యీాయనకూ! ఆ సహంలో వున్నదాన్ని ముందు పూర్తిచేసుకుంటే ఆ పెట్టిన డబ్బు రాబట్టుకోవచ్చుగా? అప్పుడే రెండో చిత్రం కూడా దేనికండీ? అసలింతడబ్బు ఎక్కణ్ణించి వొస్తున్నదో యీాయనకు?' అనడిగింది పంకజం.

'అసలు నువడుగుతున్న ప్రశ్నలన్నీ నేను అడక్కముందే కూనాయ్ స్థితేమిటో కొంత నేనర్థం చేసుకున్నా. ప్రస్తుతం వాడు నడిసముద్రంలో వున్నా, నేనేమాత్రం పసికట్టకూడదని వాడి వుద్దేశ్యం! నేనో యాభైవేలు వాడికి సర్దితే రెండు వారాల్లో తన చిత్రాన్ని పూర్తిచేసి పెద్ద రేటువడ్డీతో నా అప్పు నాకు నెల తిరక్కముందే తీర్చేస్తానంటాడు!' అన్నాడు రంగారావు.

'ఏమిటీ! ఏభైవేలేమిటీ, మీరు సర్దట మేమిటి? ఆ మనిషికేమైనా మతిపోయిందా ఏమిటి! పాపం, ఓ ఫ్రీ కాలేజీ ప్రొఫెసర్లు ఆయన కంటికి లక్షాధికార్లల్లే కనుపిస్తారా ఏమిటి ఖర్మ! ఆ మాటకొస్తే పట్టుమని పదివేలన్నా మనదగ్గర పుట్టవే!' అన్నది పంకజం.

'అంతకూడాలేదు — చివరకు, అయిదువేలన్నా ప్రస్తుతానికి చూడమన్నాడు. ముందు వాడడిగిన యాభైవేలు నేనుగాని, యింకెక్కడైనాగాని యిప్పిస్తే ఆ కోటీశ్వరుడిచేత నోటు రాయించి యిప్పిస్తానన్నాడు' అన్నాడు రంగారావు.

'అదేమిటండీ మరీ వింతగావుంది! ఆ కోటీశ్వరుడికి నోటురాసియిచ్చే ఖర్మేం పట్టిందండీ, పుష్కళంగా వున్నవాడాయనుమరి?' అన్నది పంకజం.

'ఆయనకు అవసరానికి అందలేదంటాడు! నా మానాన నేను గోప్యంగా బతుకుతున్నవాణ్ణి న న్నభాను చేయవద్దనిచెప్పా. సహంచిత్రం తనకు ఏడున్నర లక్షలు ఖర్చయిందనిఅన్న నోటితోనే నేను యాభైవేలు యిప్పిస్తే రెండు వారాల్లో మిగతా చిత్రం పూర్తిచేస్తానని వాడనగలగటమే నాకు మరీ ఆశ్చర్యం కలిగించింది! అందుకే కూనాయ్ నడిసముద్రంలోపడ్డ మనిషల్లే కనుపించాడని చెప్పింది!' అన్నాడు రంగారావు.

'నిక్షేపంగా చేతికొచ్చిన రెండులక్షలఎనభై వేలు ఎన్నేళ్లుంటే తరిగేను! పాపం ఆయన భార్యాబిడ్డ లెట్లా వున్నారో!' అన్నది పంకజం నిట్టూరుస్తూ.

'అదే నేనూ ఆలోచిస్తున్నా. కాని ఆ సహంలో వున్న చిత్రాన్ని పూర్తిచేసి కూనాయ్ కుబేరుడు కాడని నువ్వూ నేను ఎట్లా చెప్పగలం? ఇదిగో పంకజం, పిల్లలింకా అక్కడే వున్నారు పిల్చుకునా. ఇంటికి వెళ్దాం' అన్నాడు రంగారావు, చీకట్లో ఎత్తుగా తెల్లనురుగులో వస్తున్న సముద్రం అలలవైపు చూస్తూ.

ఉత్తరా విలాపము

శ్రీ కాళూరి హనుమంతరావు

(గాంధారి శ్రీకృష్ణునకు అభిమన్యుని మృతదేహమును చూచి ఉత్తర విలపించిన తెర గెరిగించుట.)

కేశవ! దృప్తసింహనిభుడౌ నభిమన్యుడు తండ్రికన్న నీ
కన్నను గూడ శౌర్యమున సత్త్వమునం దధికుం డటంద్రు, దు
ర్భేద్యము నా సుతుండు రచియించిన వ్యూహమునున్ పగిల్చి తా
నొక్కడె మృత్యువై ఇతరులెందరికో, తుది తాన్ మృతింగనెన్.

అతి తేజస్కుండగు నా
అభిమన్యుడు నిహతుడయ్యె నతని శరీర
ద్యుతి తరుగ దించుకేనియు
కృష్ణా! నీ కూర్మి మేనయల్లుని గనుమా!

విరటుని పుత్రిక అర్జును
కోడలు కడు నార్తయై కనుంగొని భర్తన్
అల్లన డగ్గరి ఆతని
పై చేయిడి బాల మిగుల శోకము పొందున్.

చక్కని కంఠముం గలిగి ఫుల్లసరోజము వోలె గ్రాలు సౌ
భద్రుని మోముపైన తన మోమిడి బిగ్గకవుంగిలించె కా
మ్యాకృతి యైన ఉత్తర, సురామదమూర్ఛిత యౌచు గాఢల
జ్జామధురాస్యయై అతనితో మును ప్రేమ బెనంగునట్లుగన్.

శోణితక్లిన్నమున్ స్వర్ణనిర్మిత మగు
కవచమున్ విప్పి అతని దేహమును గాంచు,
చూచి చూచి ఆతని మోము నిన్ను జూచి
"మడిసె పద్మాక్ష త్వత్సుమనయను డ"నును.

(పద్యమునకు యతిప్రాసలు బరువని వదిలివేయబడినవి).

"బలమునన్ వీర్యమునందు తేజమునందు రూపమున
కృష్ణ! భవాదృశుం డితడు భువిగనాలె జీవితమ్మెడలి;
కడు సుకుమారమ్ము మృదుల రాంకవాజినశాయియైన
నీ శరీరము నాథ! ఇపుడు భూమిపై నొచ్చెడిన్ మిగుల.

ఆయత హస్తిహస్త సమముల్ గుణకర్షణకర్కశమ్ములున్
అంగదభూషితమ్ములగు దీర్ఘభుజమ్ముల చాచి పెల్లు వ్యా
యామమొనర్చి శ్రాంతుడయినట్లు సుఖమ్ముగ నిద్రపోదువో
నాథ! కడున్ విలాప మొనరించు ననుంగని ఊరడించకే.

అపరాధమ్మేదియు నీ
యెడలన్ నే జేయలేదు, పూర్వము నన్నున్
దూరమున గాంచియున్ భా
షింతువు నేడేల మాటలాడవు నాతో?

ఆర్య సుభద్రను త్రిదశో
పములగు పితరులను మిగుల దుఃఖ నిమగ్నన్
ననువీడి ఇప్పుడెవటికి
ఏకాకిగ పోవజూచెదవు నీ వార్యా!"

అని తన యొడిలో నాతని
శిరమిడి రక్తమయ కేశముల హస్తమునన్
తొలగించి అతని మోమున
మోమిడి పలుమారు లడుగు జీవితునివలెన్.

"స్వర్గసీయుడవు విశ్వమెల్ల రక్షించు వాసుదేవునకు
శంకరజేత గాండీవి పుత్రుడ వనఘ! నీ వెటులు
పాండవుల్ సకల మాత్స్యులును పాంచాలులున్ చూచు చుండ
వధమొందితివి నాథవంతుడయ్యు ననాథుని రీతి.

అతిరథుల్ కీర్తియుతులగు వారికి మనసెట్టు లొప్పె
బాలు నేకాకిని నిన్ను క్రూరమ్ముగన్ వధియింప
ఛీ! ఈ జయద్రథ ద్రోణ కర్ణ కృప ద్రౌణులెల్ల
క్రూరులు నీచు లీ రీతి విధవ నొనర్చిరి నన్ను.

ఉత్తరా విలాపము

బహు సమాక్రాంతి హతుడవైనట్టి నిన్ను
తలచి తలచి పద్మేక్షణ! నీపితరుల
కెటులు రాజ్యలాభమ్మునగాని సకల
శత్రు నాశమునన్ గాని ప్రీతికలుగు?

వీరమరణమ్మునన్ నీవు గెలిచికొనిన
పుణ్య లోకమ్ములకు నిన్ను ననుగమించి
వత్తు దమమును ధర్మంబు ననుసరించి
ప్రాణవల్లభ! నన్ ప్రతీక్షింపు మచట.

రణహతుని నిన్ను గాంచియు
సభాగినిని నే సజీవనయి ఇటనుంటిన్
ధర నెవ్వడేనియున్ మృతి
గన జాలునె మృత్యుకాల మయ్యేడు దాకన్.

శ్లక్ష్ణము మందహాస యుతమా మధురోక్తిని ఆర్యపుత్ర! ఏ భామను నన్ను బోలె అలరింతువు నీవిపు, డప్సరోగణ స్వాంతము లెల్ల కొల్లగొని యుందువు స్వర్గమునందు, ప్రాణనాథా! స్మరియింతె నన్నమరకాంతలతో విహరించు వేళలన్?

ఇంతమాత్రమె నాకు నీతోడి చెలిమి
ఆరుమాసములంతె నా భాగ్యమాయె
సప్తమంబగు క్రూర మాసమ్మునందు
ప్రాణవల్లభ! మృతి చెందినావు నీవు'

ఈ పగిదిన్ భృశమ్ము పలవించెడు నుత్తర మోఘ జీవితాశన్ కడు నూరడించి ఎటులో అటనుండి తొలంగజేసి మత్స్యాధిపుపత్ని లయ్యెడ సృగాల సకృత్ వ్రజ గృధ్ర సందయక్షిప్తము నాత్మభర్తృశవమున్ గని హా! యని అర్చి ఆర్తలై.

(మహాభారతమునుండి అనువాదము)

రామణీయకము*

శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

మహాకవి కావ్యములలోని కథనకౌశలమును, రస సృష్టిని చూచినమీదట, ఇప్పు డాతని రచనాసర్వస్వములోని రామణీయకసృష్టిని పరికింతము. నిజమునకు—రామణీయకశబ్దము వ్యాపకమై రసమును గూడ చెప్పగల్గినను ఈ ప్రకరణమున రసేతరమైన వర్ణనాలంకారాది శిల్పమునకు రామణీయక శబ్దమును సంకేతముగా నుపయోగింతము.

ఒక కవియొక్క భావనాప్రతిభకు ఆతడు చేసిన వర్ణనము దర్పణమై తక్కిన కవులనుండి ఆతనిని వేరుచేసి అతని మహత్త్వమును కొలిచి చూపును.

'దర్శనా ద్వర్ణనా చ్చాపి
రూఢా లోకే కవిశ్రుతిః.'

పదిమంది జనులు లోకవృత్తమును అనంత సృష్టిలీలను దినదినమును చూచుచునే యుండవచ్చును. కాని, వారు తాము చూచిన వస్తువుల అనుభూతిసాంద్రతను, సౌందర్యరహస్యమును, విప్పి చెప్పలేరు. ఆ చెప్పుట ఒక్కకవియైనవానికే సాధ్యమగును. ఆ పదిమందితోపాటు సృష్టికి కన్ను లప్పగించి చూచుచున్నంతవరకు ఆతడును ఆ సామాన్య జనులలో ఒకడే. కాని, ఆ సృష్టిప్రేరణచే మనస్సు పొంగి ఆతని ముఖమునుండి అపూర్వ వాక్కు అనల్పసంగీతము ఎప్పుడు జాలువారునో, అప్పటినుండి ఆతని పదవి వేరు. ఆతని పేరు వేరు. అప్పుడు ఆత డొక సృష్టికర్త. ఆత డొక కవి. లోకములో తాను చూచిన నీరవ చమత్కృతులకు మూగసౌందర్యములకు ఆతడు వర్ణములతో విస్పష్ట రూపము నిచ్చును. అంతియే కాదు పుట్టువస్తువులకు అద్భుత వర్ణములు పూసి పాఠకుల కట్టెదుట సాక్షాత్కరింపజేయును. ఈ రెండు విధముల చేతను వర్ణించుట అనుమాటకు ఎంతయేని సార్థకత యున్నది.

తథా హి దర్శనే స్వచ్ఛే
నిత్యే ప్యాదికవే ర్మునేః|
నోదితా కవితా లోకే
యావ జ్జాతా న వర్ణనా||

ఆదికవి వాల్మీకి ఆ యరణ్యప్రకృతిని, పరిసరములను నిత్యమును ఎన్నిసార్లు చూచినాడో చెప్పలేము గదా! కాని ఒకనాడు క్రౌంచవృత్తాంతము ఆతని మనసు నూచివేయగా కవియైనాడు. నాటినుండి ఆతనికి ప్రకృతిదేవి పిలుపు వినబడినది. ఆమె మధురకంఠధ్వని అర్థమైనది. దానితో నాతడు సీతాపహరణమునందలి గోదావరిచేష్టలను వ్యాఖ్యానించెను. దక్షిణాభిముఖముగా పరుగెత్తులేళ్ల కన్నులను చదువగల్గెను. ప్రతితరువు, ప్రతివల్లిక, ప్రతి పక్షిహృదయము స్పందించిన విధము నాలింపకలిగెను.

మానవుడును, ప్రకృతియును కవికి శాశ్వత వస్తువులను మాట నిజమే. కాని వాని బాహ్య స్వరూపములు చూచి తృప్తి పడుటలో పైతళుకులు వర్ణించుటలో కవితకు సార్థక్యము లేదు. శబ్దములను చిత్రికపట్టుటతో ఉత్ప్రేక్షాతిశయోక్తులతో కేవలము ప్రకృతి పూజా పీఠము

* కాళిదాస కళామందిరము. 5.

వద్దకు పోయినచో ఆ దేవి వెంటనే అదృశ్యయ్యై ఆమె స్థానమున వట్టి శిలా విగ్రహము ప్రత్యక్షమగును. ఆ దేవి చిఱునవ్వే వరముగా నీయవలసిన ఆనందమధుభిక్ష కరవై పోవును.

భారవి, మాఘుడు, శ్రీహర్షుడు మున్నగువారు సంస్కృతసాహిత్యమున మహాకవులుగా ప్రసిద్ధులు. వారి కావ్యములందలి ప్రకృతివర్ణనము సహజమైన కవిహృదయధ్వనికి తార్కాణముకాక, కృతకమైన శబ్దశిల్పమునకును, అర్థచిత్రణమునకును పాల్పడినది. వారి వర్ణనములు చదువునప్పుడు ప్రకృతిసుందరి ప్రత్యక్షమై తన హృదయమిచ్చి మాటలాడినట్లుగాక అలంకారములను దిగవేసికొన్న ఆడంబర యువతి దర్శనమిచ్చినట్లుండును. వారు తమయందు కొరవడిన అపూర్వ సృజనాత్మక శక్తిని ఛందోలంకారముల నగిషీ పనులతో కప్పజూచిరి. వారెత్తుకొన్న కావ్యవస్తువునకు వారి ప్రకృతివర్ణనములతో పొత్తు కుదరక వస్తువర్ణనములకు సమన్వయింపరాని అందదుకులు కాన్పించును. మహాకావ్యత్వ సిద్ధికి ఆలంకారికులేర్పరచిన నగరార్ణవ శైలాది వర్ణనములు బలవంతములుగా చొప్పించినట్లగపడును. భారవి తన కావ్యమున చేసిన శరదృతు హిమాద్రి జలక్రీడాది వర్ణనములకుగాని, మాఘుడు చేసిన రైవతకాద్రి షడృతు మధుపాన రతోత్సవాది వర్ణనములకుగాని కథతో కలసి జీవించు సామరస్యము లేదు. నైషధమునందలి కుండిన దమయంతీ వర్ణనాదికమును గొంతవరకు సమన్వయింప జూచినను అందు అకృత్రిమ శోభ కొరవడి కన్నుల మిరుమిట్లుగొలుపు అలంకారములును, కృతక భావ సమ్మర్దమును కాన్పించును.

కాళిదాసు రసదృష్టి యందెంత కుశలుడో, రామణీయక దృష్టియందును నంత చతురుడు. తన ప్రముఖ కావ్యములందలి కథావిన్యాసమునకును, రసపోషణమునకును, వస్తు వర్ణనా చాతుర్యముతో ప్రకృతి రహస్య చిత్రణముతో, మెరుగులు దిద్ది అన్యసంస్కృత మహాకావ్యములకు లేని రంగును, రుచిని, పరిమళమును కల్పించినాడు. ఈ యంశములను మన మింక సోదాహరణముగా చూడగలము.

కాళిదాసునకు ప్రకృతిశోభ ఆత్మీయమైనది. ఇతర కవులు ప్రకృతిలోని సొగసులను తమ కావ్యములందు వర్ణ్యాంశములుగా మాత్రమే పరిగ్రహింపగా ఈతడు ప్రకృతివస్తువులను తన కథాపాత్రలకు ఆత్మబంధువులనుగా కథాగమనమునకు ముఖ్యసహకారులుగా స్వీకరించును. ఇతడు నాగరక జీవితములోని సర్వవిలాసములను, భోగభాగ్యములను సమృద్ధిగా ననుభవించిన వాడయ్యును సృష్టిలీలకు పుట్టినిండ్లైన వనస్థలులందే ఎక్కువ మక్కువ చూపును. మహానాగరకుడైన దుష్యంతరాజు అడవిలో అకృత్రిమశోభతో పెరిగి పెద్దదైన శకుంతలను చూచి 'దూరీకృతాః ఖలు గుణైః ఉద్యానలతా వనలతాభిః' 'గుణాతిశయముచే వనలతలు ఉద్యానలతలను తిరస్కరించినవి' అని పల్కుటలో కాళిదాసు ప్రకృతి పక్షపాతమే ధ్వనించె ననిపించును.

కాళిదాసు ప్రకృతిని సందర్శించుటలో దాని హృదయ మవగతము చేసికొనుటలో నొక విశేషమున్నది. ఆతడు, ప్రకృతిలోని పశుపక్ష్యాదులకును, వృక్షలతాదులకును, నదీపర్వతాదులకును, మేఘవిద్యుదాదులకును, మానవహృదయముతోడి సామరస్యమును, సఖ్యమును నిపుణముగా వ్యాఖ్యానించును.

ఆతని కావ్యములందలి ఈ హరిణప్రసక్తి చూడుడు. ఇది రఘువంశమునందలి వసిష్ఠాశ్రమము. అందలి ఆ లేడిపిల్లలను పరికింపుడు. అవి పర్ణశాలల కడ్డముగా కూర్చుండును. ఆశ్రమవాసులు ప్రోవుచేసికొన్న నీవారధాన్యరాశులలో భాగము పంచుకొనును. ఆ రాశులపై కూర్చుండి ముని వాకిళ్లలో నెమ్మదిగా నెమరువేయుచు ప్రత్యక్షములగును;

'ఆకీర్ణ 'మృషిపత్నీనాం
ఉటజద్వార రోధిభిః।

అపత్యై రివ నీవార
భాగధేయోచితై ర్మృగైః॥
రఘు. 1 50.

ఆతపాత్యయ సంక్షిప్త
నీవారాసు నిషాదిభిః।
మృగై ర్వర్తిత రోమంథం
ఉటజాంగణ భూమిషు॥
రఘు. 1.52.

రఘురాజు గురుదక్షిణకై తనవద్దకు వచ్చిన మునికుమారుడు, కౌత్సుని ఆశ్రమహరిణకముల కుశలము నడుగుచున్నాడు.

క్రియానిమిత్తే ష్వపి వత్సలత్వాత్
అభగ్నకామా మునిభిః కుశేషు
త దంకశయ్యా చ్యుత నాభినాళా
కచ్చి న్మృగీణా మనఘా ప్రసూతిః॥
రఘు. 5. 8.

'వైదికకార్యముల నిమిత్తమై మునులు దర్భలను తెచ్చుకొందురు. లేడిపిల్లలు ప్రక్కకు చేరి తినివేయును. కాని, వారు వాత్సల్యముతో వానినేమియు ననరు. హరిణశిశువులు వారి ఒడులందు కూర్చుండి తమ లేతబొడ్డులను రాల్చును. అట్టి లేడిపిల్లల సంతతికి క్షేమమేగదా!'

ఇందలి ఆశ్రమములలో చనువుగా తిరుగు లేడిపిల్లలందు సుకుమారహృదయులైన తపస్వుల ప్రేమాదరములు కవివాక్కులలో ప్రత్యక్షము లగుచున్నవిగదా! వారి పరస్పరప్రీతిని రఘువువంటి సహృదయులు గమనించి హర్షింపగలరు.

రఘువంశమున దశరథుడు వసంతక్రీడ ననుభవించినతర్వాత మృగయాఖేలనమునకు దొడంగెను. అందు మొట్టమొదట కాన్పించు రమణీయదృశ్య మిది. 'ఒక లేడిగుంపు యెదురైనది. అందు పసిలేడిపిల్లలు పాలుత్రాగుచు మాటిమాటికి కాళ్ళ కడ్డపడుచుండగా, ఆడులేళ్ళు చరచర నడువ లేకున్నవి. కొన్ని లేళ్ళు కుశాంకురముల నములుచు నచ్చుచున్నవి. వానిముందు సగర్వముగా కృష్ణసారము నడుచుచున్నది.'

తస్య స్తనప్రణయిభి ర్ముహు రేణశావైః
వ్యాహన్యమాన హరిణీగమనం పురస్తాత్।
ఆవిర్బభూవ కుశగర్భముఖం మృగాణాం
యూథం తదగ్రసర గర్వితకృష్ణసారమ్॥
రఘు. 9.60.

ఎదురుపడిన లేళ్ళగుంపుపై రాజు బాణమెత్తినాడు. దానితో లేళ్ళగుంపు చెల్లచెదరై తడి కలువరేకులవంటి తమ బెదరుచూపులతో ఆ వనప్రదేశమును వినీలముగా చేసినది.

తత్ప్రార్థితం జవనవాజిగతేన రాజ్ఞా
తూణీముఖోద్ధృత శరేణ విశీర్ణపంక్తి।
శ్యామీచకార వన మాకులదృష్టిపాతైః
వాతేరితోత్పలదళ ప్రకరై రివార్ద్రైః॥

దశరథుని ఈ మృగయాప్రసక్తిలో హరిణముల ఆర్ద్రహృదయ సౌకుమార్యములను చెప్పు మరి రెండు దృశ్యములు హృదయావర్జకము లైనవి.

రాజు ఒకలేడిపై శిలీముఖమును మోపెట్టును. దాని సహచరియైన ఆడులేడి ఆ బాణమునకు తన శరీరము నడ్డుపెట్టెను. గట్టిగా లాగి, విడుచుటకు సిద్ధముగానున్న బాణమును కృపామృదుహృదయుడైన ఆత డుపసంహరించెను.

'లక్ష్యీకృతస్య హరిణస్య హరిప్రభావః
ప్రేక్ష్య స్థితాం సహచరీం వ్యవధాయ దేహం।
ఆకర్ణకృష్ట మపి కామితయా స ధన్వీ
బాణం కృపామృదుమనాః ప్రతిసంజహార'॥
రఘు. 9. 62.

ప్రేమ మాధుర్యమును హృదయ దఘ్నముగా నెరిగిన రాజు సరసత్వమును వర్ణించుటలో కాళిదాసు మనస్తత్వ పరిజ్ఞానము చిరస్మరణీయము.

మరికొన్ని లేళ్ళపై రాజు నారిని చెవికంట లాగి బాణము విడువదలచెను. కాని ఆ లేళ్ల చంచల నేత్ర సౌందర్యము ప్రౌఢకాంతల కంటి సొగసులను జ్ఞప్తిచేయగా ఆతని చేతిపట్టు శిథిలమై పోయినది.

'తస్యా పరేష్వపి మృగేషు శరాన్ముముక్షోః
కర్ణాంత మేత్య బిభిదే నిబిడాపి ముష్టిః।
త్రాసాతిమాత్ర చటులైః స్మరయత్సు నేత్రైః
ప్రౌఢప్రియా నయన విభ్రమ చేష్టితాని॥
రఘు. 9.63.

కుమార సంభవమున —

పార్వతి తపోదీక్షలోనికి పోవుచు తన అమూల్యమైన రెండు వస్తువులను రెండుచోట్ల దాచినది. అందు విలాస చేష్టితములను తీవియల వద్దను, విలోలదృష్టులను ఆడులేళ్లవద్దను. ఈ సురక్షితప్రదేశములను కవియే ఎన్ని పార్వతికి చూపి యుండెనా?

'పునర్గ్రహీతుం నియమస్థయా తయా
ద్వయేపి నిక్షేప ఇవార్పితం ద్వయం
లతాసు తన్వీషు విలాస చేష్టితమ్
విలోల దృష్టం హరిణాంగనాసు చ॥

ఆ పార్వతి తన తపస్సమయమున ఉబుసు పోకగా పిడికిళ్లతో నెవరిధాన్యము పెట్టి తనవద్దకు చేరిన లేళ్లను మచ్చిక చేసికొన్నది. అవి ఆమె యెడల బెదరుమాని కన్నులను కన్నులను కొలిచి చూచుకొనునంత చనవుగా ప్రవర్తించినవి.

అరణ్య బీజాంజలి దాన లాలితాః
తథా చ తస్యాం హరిణా విశశ్వసుః।
యథా తదీయైర్నయనైః కుతూహలాత్
పుర స్సఖీనా మమిమీత లోచనే

వర్షా ప్రారంభములందు లేళ్లు అప్పుడే మొలిచిన నేలతాడి మొలకలను తినుచు తొలికారున భూమినుండి లేచు పరిమళమును మూర్కొనుచు మేఘగమనమును తెలుపుచుండునను మేఘదూత వర్ణనము చూడదగినది.

.........కన్దలీ శ్చాను కచ్ఛమ్।
జగ్ధ్వా రణ్యే ష్వధిక సురభిం
గన్ధ మాఘ్రాయ చోర్వ్యాః।
సారంగాస్తే జలలవముచః
సూచయిష్యన్తి మార్గమ్॥
మేఘ. 1.21.

పశువులేకాదు వృక్షములు పక్షులుకూడ, మానవుల వాత్సల్యానురాగములకు పాత్రములై యుండుట ఒక మధుర దృశ్యముగా మన కిట్లు కాన్పించును.

'సేకాంతే మునికన్యాభిః తత్క్షణోజ్ఝితవృక్షకం
విస్రంభాయ విహంగానాం ఆలవాలాంబుపాయినాం॥'

'మునికన్యకలు బిడ్డలవలె ఆశ్రమములోని చిన్నిమొక్కలకు నీళ్లుపోసి పెంతురు. వారు చెట్ల పాదులలో పోసిన నీళ్లను రకరకముల పక్షులువచ్చి త్రావిపోవును.'

మానవుల ఆదరాభిమానములను చూఱగొనిన ప్రకృతి ఎట్లు వారి సుఖదుఃఖములకు మారు పల్కుచున్నదో ఈ దృశ్యములందు పరికింపుడు.

దిలీపరాజు సంతాననిమిత్తము నందినీధేను సేవ చేయుచు వ్రతస్థుడై సర్వరాజలాంఛనములను విడచి, సామాన్యపౌరునివలె అడవిలో తిరుగుచుండెను. బాటప్రక్కనున్న చెట్లు అతని అనుభావమున్జూచి పక్షికూజితము లను కంఠస్వరములతో జయజయ ధ్వానములు పల్కుచున్నట్లుండెను. రఘు 2–9.

గాలికి కదలుచున్న లేతలతలు పూజ్యుడైన రాజు తమ చెంతనుండి పోవుచుండగా పౌరకన్యలు ఆచారార్థము ఆతనిపై పేలాలను జల్లినట్లు పూలు చల్లినవి. రఘు. 2. 10.

విల్లు ధరించి పోవుచున్న రాజును చూచి ఆతని దయార్ద్రభావమును తమ అంతఃకరణములు

చెప్పగా బెదరిపోవుటకు బదులు లేళ్లు తమకు పెద్దకన్ను లున్నందులకు ఫలితముగా నాతని సౌందర్యమును జూచినవి. రఘు. 2. 11.

కాళిదాసుని అద్భుతప్రకృతిలో మనకు ఎడనెడ వనదేవతలు దర్శన మిత్తురు. వారు మనుష్యులను గౌరవింతురు. ప్రేమింతురు. ఉపచరింతురు. అయితే ఎవరీ వనదేవతలు? అని ఆశ్చర్యపడుచున్నారా?

పచ్చనిచెట్లతో, మధురఫలములతో, జలజల సాగు తీయని సెలయేళ్లతో నరులకు దర్శన మిచ్చి, వారి నాదరించు ఆరణ్యప్రకృతికే కవి పెట్టిన పవిత్రనామమిది. ఇంతటి ఆప్తమూర్తిని ఆతడు ఒక నిర్జీవమూకవస్తువుగా భావింపగల్గునా? ఈ కల్పనము నాధారముగా గొనియే భవభూతి తన నాటకమునందు వాసంతియను వనదేవతను నొక ప్రముఖపాత్రగా ప్రతిష్ఠించెను.

రఘువంశమున దిలీపుడు నందినీధేనువు వెంట పోవుచుండగా ప్రక్కనున్న వెదురుబొదల నుండి శ్రావ్యముగ వినవచ్చు సంగీతములో నాతడు తన యశోగానమును వినెనట! నట్టడివిలో నాతనికి రాజలాంఛనముగా కీర్తి గీతములను వినిపించిన ఈ వందిమాగధు లెవరు? వారు వందిమాగధులు గారు. వనదేవతలు.

స కీచకై ర్మారుత పూర్ణరంధ్రైః
కూజద్భి రాపాదిత వంశకృత్యమ్।
శుశ్రావ కుంజేషు యశః స్వ ముచ్చైః
ఉద్గీయమానం వనదేవతాభిః॥

రఘు. 12.

ఆ వనదేవతలే దశరథుని మృగయా సందర్భమున మనకిట్లు ప్రత్యక్షమగుదురు.

'తనులతా వినివేశిత విగ్రహా
భ్రమర సంక్రమి తేక్షణ వృత్తయః।
దదృశు రధ్వని తం వనదేవతాః
సునయనం నయనందిత కోసలం॥

ఇచ్చట వనసీమలందే వనదేవతా మూర్తు లున్నవని మనము గ్రహింపగలము. వారి సొగసైన శరీరములు సన్నని తీగెలందున్నవి. సొగసైన చూపులు తుమ్మెదలలో నున్నవి. అట్టి వనదేవతలు త్రోవలో దశరథుని చూచిరి.

వనదేవత మూర్తిమతియై నూతన దంపతులు, గిరిజాశంకరులు గంధమాదన పర్వతమున విహరించుచుండగా పూజ్యభావముతో పార్వతీదేవికి కల్పవృక్షమధువు నందించినదట:

'లోహి తార్క్యమణి భాజనార్పితం
కల్పవృక్షమధు బిభ్రతీ స్వయం
త్వా మియం స్థితిమతీ ముపస్థితా
గంధమాదన వనాధిదేవతా॥

రఘువు సైన్యముతో దిగ్విజయయాత్రకు బయలుదేరి, దేశమువెంట దేశముగా నగరమువెంట నగరముగా జయించుకొనుచు పోవుచుండెను. ఆ వర్ణనము మహారాజు దినచర్యగా సైనికుల యాత్రా పట్టికగా, వీరప్రతివీరుల క్రోధావేశ కోలాహల బహుళముగా సిద్ధమగుట సహజము. కాని, మహాకవి ఆ సైన్యకోలాహలములలోని వేసటను యుద్ధాహంకారములోని కారమును, ఆయా ప్రదేశములందలి సుందర ప్రకృతిదృశ్యములచే మధురానుభవములచే మరపించి మనోజ్ఞముగా జేసినాడు.

కళింగదేశములోని సైనికుల నారికేళాసవ పానక్రీడలు, తూర్పుసముద్రతీరమునందలి పండ్ల భరువుతో వంగిన పోకతోటలు—

దక్షిణమున సైన్యపరిభోగములో గజమదముతో గమగమవలచు కావేరిసొగసులు—

మలయప్రాంతమున గు ములు నలగద్రొక్కిన ఏలకిపండ్ల ధూళులు—

చందనసంయుక్తమై తీయనితలపు లూరించు మలయ దర్దుర పర్వతయుగళము—

కేరళమున మురళానదిగాలికి ఎసరేగు మొగలి పుప్పొళ్ళు—

పారశీకమునందలి ద్రాక్షపందిళ్ళలోని ఉత్తమాజినాస్తరణములు—

సింధుతీరమునందు గుఱ్ఱపుజూళుల కంటు కొన్న కుంకుమపూలరేకులు—

కాంభోజమున ఏనుగులకు కట్టుగొయ్యలైన ఊడుగుచెట్ల వంపులు—

హిమవంతమున సురపొన్నలనీడల కస్తూరి వాసనల గుబాళించు జాతిపలకలు—

ప్రాగ్జ్యోతిషమున రఘువుదాడికి తట్టుకొనలేక రాజుతోగూడ వణకుచున్న కాలాగురు వృక్షములును—

రఘు జైత్రయాత్రతోపాటు వారితోగూడ సంచారముజేసిన పాఠకుల యాత్రాఖేదమును బాపి యుల్లాసమును గల్గించుచున్నవి.

కాళిదాసుని ప్రకృతి స్నేహమునకు మేఘదూతము తిరుగులేని ఉదాహరణము.

పొగ, గాలి, నీరు, నిప్పుల కూడిక మబ్బు అని ఆ మహాకవి ఎఱుగనిదిగాదు. కాని ఆ మబ్బు ఒకేచోట పడియుండు నట్టిదిగాదు. ఋతుపవనముల పరిచాలనమువలన అది దిగ్దిగంతములకు పరుగులెత్తును. అప్పుడది సంపూర్ణ చైతన్యముతో కదలుచున్నట్లే గాన్పించును. ఈ సుందరభ్రాంతిని రమణీయేంద్రజాలభావనను కవి తన మేఘదూత సృష్టికి చక్కగా నుపయోగించుకొనెను. కావ్యకల్పనములో నది పరమసత్యము. కవితా ప్రపంచమున అది మబ్బుగాదు. గగనమున గన్పించు నా వినీల విగ్రహుడు ఒక ఆపన్నశరణ్యుడు. ఒక దీనబంధువు.

దావాన లోపద్రవమును మాన్పించి మహోపకార మొనర్చిన మేఘుని ఆమ్రకూట శిఖరి పరమ మైత్రితో శిరసావహించుట ఎంత ఆత్మ బంధుతా దృశ్యము. మేఘ. 1.17.

త్రోవలో నీ రూరు కన్నులతో నెమలి నేత్రములు మేఘునకు స్వాగతమిచ్చుట ఎంతటి మోహన చిత్రము. మేఘ. 1.23

మేఘుడు పర్వత మయూర మిత్రుడే గాడు. ఆతడు గొప్పరసికుడు. విరహకృశ నదీ సుందరులను రాగాతిశయమున, ఓలలార్చు చతురప్రియుడు.

ఆతడు వేత్రవతీ నదియొక్క అలల కదలికల నీటిని కనుబొమ్మ విరుపులతో పొగసైన రమణీ ముఖమునువలె చుంబింపగలడు. మేఘ. 1.25

ఆతని రసజ్ఞతకు ఈ పద్యము పరిపూర్ణ చిత్రము.

'కెరటాలకుదుపులకు కదలి కూయు హంస పంక్తి యొడ్డాణము ధరించి ఒయ్యారపునడకలలో నించుక సుడిపొక్కిలి బయల్పడ త్రోవలో నెదురైన నిర్వింధ్యాసుందరిని ఆతడు ఇష్టరసముల తేల్పగలడు.

'వీచిక్షోభ స్తనిత విహగశ్రేణి
కాంచీగుణాయాః
సంసర్పన్త్యాః స్ఖలితసుభగం
దర్శితావర్తనాభేః
నిర్వింధ్యాయాః పథి భవ
రసాభ్యంతరః సన్నిపత్య
స్త్రీణా మాద్యం ప్రణయవచనం
విభ్రమో హి ప్రియేషు.'

ప్రకృతిలోని సహజధర్మములను, సౌందర్య రహస్యములను స్వీకరించి వానికి మానవహృదయ సౌకుమార్యమును ఆర్ద్రాంతరంగమును గల్పించుటలో కాళిదాసుని ప్రతిభాసంపత్తి ఈ ఖండకావ్యమున నృత్యము సల్పినదని చెప్పవచ్చును.

ఇందుమతీ స్వయంవరమున సునందయను పరిచారిక రాజకుమారికి వివిధరాజకుమారులను

పరిచయముచేయుచు, వారి నాగరక జీవితమునందలి పొలుపు పోడుములను వర్ణింపలేదు. రాజకుమారి హృదయము నాకర్షించుటకు ఒక్కొక్క రాజు పాలించు ప్రాంతీయ సౌందర్యముపై ప్రకృతి శోభపై ఇంపు పుట్టించుచు చేసిన వర్ణనములోని పక్షపాతమును జూడగా కవిహృదయమునందలి ప్రకృతిపరాయణత్వము స్పష్టమగును.

సునంద శూరసేనదేశపురాజు సుషేణుని గూర్చి పలికిన ఈ మాట గమనింపుడు.

సంభావ్య భర్తార మముం యువానం
మృదుప్రవాళోత్తర పుష్పశయ్యే।
బృందావనే చైత్రరథా దనూనే
నిర్విశ్యతాం సుందరి! యౌవనశ్రీః॥

'సుందరీ, ఈ రాజకుమారుని నీవు వరించినచో, కుబేరుని చైత్రరథోద్యానమునకు ఎందును తీసిపోని బృందావనమున చివుళ్ళు, పూలు పరచిన పాన్పుపై యౌవన సంపద ననుభవింపగలవు.

అధ్యాస్య చాంభఃపృషతోక్షితాని
శైలేయ గంధీని శిలాతలాని।
కలాపినాం ప్రావృషి పశ్య నృత్తం
కాంతాసు గోవర్ధన కందరాసు॥

'ఈతని రాజ్యములోని గోవర్ధన పర్వత గుహలలో వర్షాకాలపు నీటి తుంపురులచే తడిసి శిలా పుష్పముల పరిమళముతోకూడిన శిలా ఫలకము లందుగూర్చుండి అచట నెమళ్ల నాట్యమును తనివి తీర చూడుము.'

పరిచారిక సునంద పాండ్యరాజునుగూర్చి పల్కిన ఈ మాటయును గమనింపదగినది.

'తాంబూలవల్లీ పరిణద్ధ పూగాసు
ఏలాలతాలింగిత చందనాసు
తమాల పత్రాస్తరణాసు శశ్వత్
ప్రసీద రంతుం మలయస్థలీషు.'

'రాజకుమారీ ఈతని రాజ్యమునందే మలయ పర్వతమున్నది. తాంబూల వల్లులు చుట్టుకొన్న పొగలైన పోకచెట్లు, ఏలకి తీగలచే కౌగలింపబడిన చందన వృక్షములు, ఆ ప్రదేశమును శోభామయము చేయుచుండును. అచట నొత్తుగ పరచిన తమాల పత్ర శయ్యలందు క్రీడించుట ఎంత సంప్రీతికరము!'

ఇట్లే మాహిష్మతీ పట్టణ రాజకుమారుని సందర్భమున నర్మదాసౌందర్యమును మహేంద్రరాజ సందర్భమున, హృదయంగమములైన సముద్ర దృశ్యములను వర్ణించి సునంద ఇందుమతీదేవికి వారి యందాభిముఖ్యమును సంపాదింప యత్నించెను. కవిప్రకృతి సౌందర్యోపాసనమును, అనుభవ మాధుర్యమును సునందమాటలలో ఎంతచక్కగా ప్రతిఫలించినవో సహృదయులు గమనింపగలరు.

మహాకావ్యములలో ఆలంకారికులు చేసిన నగరార్ణవాది అష్టాదశవర్ణన నిర్దేశము కాళిదాసు కావ్యములకు తరువాత వచ్చినది. కథలో సుప్రసక్తములైన విషయములుగా ఈతడు అందలి అనేకాంశములను గ్రహించి కన్నులకు కట్టినట్లుగా చిత్రించినాడు. పిదప ఈయన వర్ణించిన నగరార్ణవాద్యంశములే లక్షణకోటిలోని కెక్కి తక్కినవారికి మహాకావ్యత్వసిద్ధికి విధిగా స్వీకరింపవలసినవైనవి.

కవిభావనాసంపత్తికిని వస్తుపరిశీలనమునకును, నికషములైన నగరార్ణవాదులను ఈతడెట్లు చిత్రించినాడో ఇంచుక చూతము.

ఈతడు కుమారసంభవపు ఆరవసర్గమున గిరి సార్వభౌముని ఓషధిప్రస్థ పట్టణము ఓషధిప్రస్థమును పది శ్లోకములతో వర్ణించినాడు. మేఘదూతములో మేఘునకు మార్గనిర్దేశముచేయుచు ఉజ్జయినిని, పిమ్మట అలకాపట్టణమును వర్ణించినాడు. ఈతని నగరవర్ణనములందు స్వర్గఖండము భూమిపైకి వచ్చినదని చెప్పుటయు, సౌధములు మహోన్నతములని చెప్పుటయు, రాత్రులందు దధి

సారికలు సుఖసంచారములు చేయుదురనుటయు, ప్రియాంశములుగా కన్పట్టును. ఓషధిప్రస్థ సందర్భమున నిట్లు చెప్పెను.

'అలకా మతివాహ్యైవ వసతిం వసుసంపదాం ।
స్వర్గాభిష్యంద వమనం కృత్వే వోపనివేశితం ॥

ధనసమృద్ధి కాస్పదమైన కుబేరుని యలకా పట్టణమును పరిమితము చేయుటకును, స్వర్గములో లెక్కకు మిక్కిలియైన పౌరులకు వేఱొక వసతి కల్పించుటకును, ఈ పట్టణము నిర్మింపబడినదా యన్నట్లున్నది.

మేఘ దూతమున ఉజ్జయినీ సందర్భములో ఈ భావమే భంగ్యంతరముగా చెప్పబడినది.

'స్వర్గిణాం గాం గతానాం।
శేషైః పుణ్యై ర్హృతై మివ
దివః కాంతిమత్ఖండ మేకమ్'—

తమ పుణ్య ఫలము తరుగగా నేలకు వచ్చిన స్వర్గవాసులు తమ శేషపుణ్యముతో స్వర్గమునుండి భూమికి దింపిన స్వర్గ ఖండమువలె ఉన్నదట — ఉజ్జయిని!

ఓషధి ప్రస్థమునందలి భవనములనుగూర్చి ఇట్లనెను.

'శిఖరాసక్త మేఘానాం
వ్యజ్యంతే యత్ర వేశ్మనాం।
అనుగర్జిత సందిగ్ధాః
కరణై ర్మురజ స్వనాః॥

ఆ పట్టణ భవన శిఖరములను మేఘము లంటుకొని యుండును. భవనములో సంగీత సాధనము జరుగుచున్నది. అందలి ధ్వని మేఘ గర్జితమా? మృదంగనిస్వనమా? అను సందేహము కలిగించుచున్నది. అప్పుడు మద్దెలచేయు గీతానుకరణమునుబట్టి అవి మర్దల ధ్వనులేగాని మేఘ గర్జితములుకావని నిర్ణయింపబడుచుండును.

మేఘదూతములో ఉజ్జయినీ సౌధౌన్నత్యము ఇట్లు చిత్రింపబడినది.

మేడలందు స్త్రీలు తమ కేశపోషణములకు వేసికొన్న అగరుధూపములు కిటికీలనుండి ప్రసరింపగా వానిచే మేఘశరీరము బలియును. పూలతో పరిమళించు సౌధోపరిభాగములందు మేఘుడు మార్గాయాసము పోగొట్టుకొనును.

'జాలోద్గీర్ణై రుపచితవపుః
కేశసంస్కారధూపైః
బన్ధుప్రీత్యా భవనశిఖిభి
ర్దత్త నృత్యోపహారః
హర్మ్యే ష్వస్యాః కుసుమసురభి
ష్వధ్వఖేదం నయేథాః
......—..................'

అలకానగర సందర్భమున అందలి భవన సౌందర్య మిట్లు కడురమ్యముగా వర్ణితమైనది.

అలకాపురసౌధములు మేఘుని పోలియున్నవి. మేఘమునందు మెరపున్నది. సౌధములందు రమణీమణు లున్నారు. మబ్బునందు ఇంద్రచాప ముండగా సౌధమునందు రంగురంగుల కుడ్యచిత్రము లున్నవి. మేఘునందు చిక్కని గర్జితము లుండగా భవనము లందు సంగీత సందర్భమునందలి మృదంగ ధ్వను లున్నవి. మేఘునిలో తళతళలాడు నీరుండగా భవనములు రత్నములతో ధగధగ మెరయుచున్నవి. మేఘు డున్నతప్రదేశమున నిలువగా ప్రాసాదము లాకాశము నొరయుచున్నవి.

'విద్యుత్వన్తం లలితవనితాః
సేన్ద్రచాపం సచిత్రాః
సంగీతాయ ప్రహతమురజాః
స్నిగ్ధ గమ్భీర ఘోషమ్
అన్తస్తోయం మణిమయభువ
స్తుఙ్గ మభ్రంలిహాగ్రాః
ప్రాసాదా స్త్వాం తులయితు మలం
యత్ర తై స్తై ర్విశేషైః.'

నగరమున ఇండ్లపై పతాకశోభ వర్ణించుటగూడ కాళిదాసునకు పరిపాటి. ఓషధిప్రస్థము నందలి పతాకము లివి!

'యత్ర కల్పద్రుమైరేవ
విలోల విటపాంశుకైః
గృహయంత్ర పతాకాశ్రీః
అపౌరాదర నిర్మితా ॥

ఆ పట్టణమున కల్పవృక్షపుకొమ్మలకు కట్టబడిన వస్త్రములే గాలికి ఎగురుచు పౌరులు అప్రయత్నముగా నిల్పిన భవన పతాకశోభను సాధించినవి.

రాత్రి విలాసినులు ప్రియులయొద్దకు అభిసారికలుగా పోవుట ఆనాటి ఒక శృంగారచేష్ట. దీనికి సమాజములో పరోక్షమైన ఆమోదమున్నట్లు ఈతని వర్ణనములవలన పొడగట్టుచుండును. ఓషధిప్రస్థమునందలి యభిసారికలు మబ్బుపట్టిన రాత్రులందుగూడ హిమవంతమునందలి ఓషధుల కాంతులచే స్వేచ్ఛగా సంచరించుచు చీకటి బాధ నెరుగనివారైరట. మేఘదూతమునందలి ఈ అభిసారికాదృశ్యము మరింత ప్రౌఢముగా గాన్పించును. 'అలకాపట్టణమున తెల్లవారగనే మార్గమునందు స్త్రీల ముంగురులనుండి జారిన మందార పుష్పములచేతను పత్రఖండములచేతను, చెవులనుండి జారిన సువర్ణ పద్మములచేతను, 'స్తనప్రాంతముల తెగి నేలకు జారిన ముత్యాల ప్రోవులచేతను, ఆ త్రోవనే నిన్నటి రాత్రి అభిసారికలు నడచిరని తెలియుచున్నది.

ఈ నగర వర్ణనమునందు కవి పట్టణసాధారణములైన కొన్ని యంశములు ముఖ్యముగా వర్ణించినను ఆయా పట్టణములయొక్క ప్రత్యేకతను తెలుపుటకు కొన్ని విశిష్టాంశములనుగూడ పేర్కొనును. దానితో ఈ వర్ణనము ఆయా కథా సందర్భములతో అనగి పెనగి ఔచిత్యమును పోషించుకొనును.

ఓషధిప్రస్థ సందర్భమున దానికి సంబంధించిన విశేషమిట్లు వర్ణితమైనది.

అచటి ఏనుగులకు సింహ భయము లేదు. అచ్చటి గుల్మములు బిలములనుండి పుట్టినవి. యక్షులును, కింపురుషులును అచటి పౌరులు. పుర స్త్రీలు వనదేవతలు. హిమపర్వతమునకు మాత్రమే చెందిన ఈ అంశములచే ఓషధిప్రస్థ విశేషము తెలియుచున్నది. అట్లే అలకానగరమునందలి స్త్రీల భూషణములనుగూర్చి యిట్లు చమత్కరించును. అలకాపట్టణమునందలి కల్పవృక్షములే ఆ పుర స్త్రీలకు రంగురంగుల చీరలను నేత్రవిభ్రమములకు కారణమైన మధువును, చివుళ్లతోగూడిన పూలను, పాదాలంకరణమునకు తగిన లాక్షారాగమును, కోరినదే తడవుగా నిచ్చుచుండును.

మేఘ. 2—13.

ఈతడు, శోభావంతమైన నగరమును వర్ణించుటేగాక పాడుపడిన పట్టణమునందలి దయనీయ స్థితినిగూడ కన్నులకు గట్టినట్లు చిత్రించినాడు.

రామరాజ్యానంతరము రామాదుల పుత్రులు వేర్వేరు స్థానములందు వేర్వేరు రాజ్యములు స్థాపించుకొని పరిపాలించుచుండిరి. రాముని పెద్ద కుమారుడు కుశుడు కుశావతీ పట్టణమున స్థిరపడి యుండెను. అచట ఒకనాటి యర్ధరాత్రి సమయమున పాడుపడిన అయోధ్యా పట్టణాధిదేవత కుశునియెదుట ప్రత్యక్షమై తన దయనీయస్థితిని నిట్లాతనితో చెప్పుకొని దురపిల్లెను.

'విశీర్ణ తల్పాట్టశతో నివేశః
పర్యస్తశాలః ప్రభుణా వినా మే!
విడంబయత్యస్త నిమగ్న సూర్యం
దినాంత ముగ్రానిల భిన్న మేఘమ్ ॥

పాలకులు లేక పలువిధములైన సుందర భవనములు శిథిలమైనవి. ప్రాకారములు కూలిపోయినవి. ఇట్టి యీ నగరావస్థ పెనుగాలికి చెల్లచెదరైన

మేఘములతో కూడిన సూర్యాస్తమయ సమయమును పోలియున్నది.

ఇంతియేగాక, పాడ్వడిన ఆ చిరంతన రఘు రాజ రాజధానీ దృశ్యములు మతికొన్ని ఇట్లు హృదయ విదారకముగ గాన్పించును.

రాత్రులందు ఘల్లు ఘల్లుమను మంజీర నాదములతో అభిసారికా విలాసినులు తిరుగు రాజ మార్గములందు కటకటా! నేడు ఆడునక్క లరచుచు నోటినుండి వెడలు మంటలతో మాంసము వెదకికొనుచు తిరుగుచున్నవి. 16—12 (రఘు)

లత్తుకపూతలతో, మృదుపాదములతో స్త్రీలు మెట్లుసోపానములందు లేళ్లను చంపిన తడినెత్తురు పాదములతో పులులు తిరుగుచున్నవి.

16. 15. ర.

స్తంభములందున్న స్త్రీ ప్రతిమలకు రంగులు మాసిపోగా వానిపై పాములు విడిచిన కుబుసములు స్తనవల్కలము లగుచున్నవి. 16-17 రఘు.



శాసన శబ్దకోశము

శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రి

ఇది ఆంధ్రదేశమునకును, ఆంధ్రభాషకును, సంబంధపడినంతవఱకును, సకలశాసనపదజాలమునకును అకారాదిగా అర్థనిర్ణయ పూర్వకమైన నిఘంటువు. దీని నిర్మాత శ్రీ కుందూరి ఈశ్వరదత్తుగారు ఆంధ్రలోకమునకు చిరపరిచితులైన పెద్దచరిత్రకారులలో నొకరు, సాహితీవేత్తలు, బహుగ్రంథనిర్మాతలు. 'ఆంధ్రచరిత్ర చతురానన' బిరుదాంకితులైన శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు వీరికి మేనమామ. రాజకీయోద్యోగిగా గణకవృత్తియందు (Accounts officer) అధికారపదవి వహించియుండియు, సమయము దొరకినపుడంతయు వినోదవిరామముగా చారిత్రకపరిశోధన పై అభిమానము వహించి ఆబాల్యము వీరు కృషి సలిపియున్నందున వీరి లేఖినినుండి ఏమేమి ఎదురుచూడరాదు! ఇట్టి శాసనపదకోశ మింతవఱకు వెలువడలేదు. దాదాపొక శతాబ్దమునుండియు పాశ్చాత్య విద్వాంసుల ప్రబోధమును కృషియు కారణముగా భారతదేశమందే ఇదొక క్రొత్తవాఙ్మయము సంపాదింపబడినది. భారతభాగవతరామాయణాది గ్రంథములను కావ్యనాటకాలంకార వాఙ్మయమును పఠించుచుండిన భారతీయులకు చారిత్రకదృష్టి యలవడినది. అదిపనిగా రాజ్యాంగమువారును, ఇతర పండితులును, నూతన శాసనములను, తాళపత్రగ్రంథములను కనిపట్టి ప్రకటించి, మనకు ఇదివరకు తెలియని, ప్రాచీననిఘంటువులలోలేని ఆధునిక శబ్దరత్నాకరాదికములకు ఎక్కుట కవకాశములేని పదజాలము అనంతముగా దొరకియున్నది. డాక్టర్ హూల్ట్జుగారు 1886 లో ప్రారంభించిన కృషికి ఫలితముగా ఆంధ్రదేశమందేగాక ఇతర ప్రదేశములలోకూడా ఆయా భాషలలో శాసనములు సేకరింపబడి ఎప్పటికప్పుడు పండితులచే చారిత్రక చర్చలతో ప్రకటింపబడుచుండినవి. హూల్ట్జుగారికి తర్వాత వి. వెంకయ్యగారు, హెచ్. కృష్ణశాస్త్రిగారు మున్నగువారెందరో ఉండిరి. మనకు తెలుగులో అకారాదినిఘంటువులేని లోటును శ్రీ సీతారామాచార్యులవారి శబ్దరత్నాకరము నాటికి తీర్చినది. అది చాలదని సూర్యరాయాంధ్రనిఘంటువు బయలుదేరి, శాసనపరిశోధనాదులలో చక్కగా ప్రజ్ఞ వహించిన శ్రీ జయంతిరామయ్యపంతులవారు సంపాదకులుగానుండియు శాసనపదములకు అందులో స్థానము కుదురకపోయి, ఆ నిఘంటువే ఇంకను పూర్తిగాకయున్నది.

ఒకటిమాత్రము మన పండితులు గ్రహించినారు— కేవలము చారిత్రకజ్ఞానములేని తెలుగు పాండిత్యము నిష్ప్రయోజనమనియు, నిఘంటువులు సమగ్రబోధకములుగా నుండవలయునన్న. కావ్యాది వాఙ్మయముతో శాసనాదులనుకూడా సమన్వయించి, చారిత్రక కాలజ్ఞానముతో పరిశీలించి పఠించినగాని శబ్దార్థ నిర్ణయము చేయుట కుదరదు - అని. ఇట్లు కృషి చేసిన ఆధునికులలో మంచి శాసన పదకోశమును నిర్మించు తలంపు కీ. శే. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి ఉండినది. ఇప్పుడు ఆ భాగ్యము శ్రీ ఈశ్వరదత్తుగారికి కలిగినది.

వీరన్నట్లు ఇది ప్రథమ ప్రయత్నము. అనగా ఆంధ్రులకు ఇది మొదటి శాసన పదకోశముగా వెలువడటయేగాని, శాసన పరిశోధనలోగాని శబ్దార్థ నిర్ణయాదులలోగాని తెలుగువారు ఇప్పుడు

ప్రారంభకులనిగాదు. నేటిదనుక జరిగిన మహా కృషికి ఇది అకారాదిగా సూచిక. కాని ఇది వీరే తమ ఆంగ్ల పీఠికలో వ్రాసినట్లుగా 'గ్లాసరీ' (లఘటిప్పణి)గాని 'డిక్షనరీ'కాదు; 'ఎన్సైక్లపీడియా' అంతకన్నను కాదు. ఇది సమగ్రముకూడ కాజాలదనియు, ఎంతెంతో ఇందు చేరక తప్పిపోయి యుండవచ్చుననియు, కాని తమ సేవనుమాత్రము గుర్తించి పొరపాట్లనుగాని, లోటునుగాని పెద్ద చేయక క్షమించి తృప్తిపడుడనియుకూడ వీరు సవినయముగా వ్రాసికొనుటచే వస్తువిస్తృతియు బాహుళ్యమును, ఏకైక పండితాతీతమగు కృషియనియు తెలియుచున్నది. పండిత సమాజము చేయవలసిన పని ఒకరు చేయుటయే గొప్ప, సాహసముకూడ. కాని ఒక మహాపండితుడో గొప్పచరిత్రకారుడో పలికిన వినయోక్తులను లోకము వినయ సూచకముగా గ్రహింపక అదివారి ఔద్ధత్యమనియే భావించుట సహజము. ఎంతో వ్రాసి, ఇతరులకు ఏమియు మిగుల్పక, తర్వాత వట్టి ఉపచార వాక్యములుగా చెప్పు పెద్దల మాటలుగా అవి పరిగణింపబడును. ఇది పరిపాటి.

కాని, ఈ నిఘంటువును పూర్తిగా చూచిన తర్వాత. వీరు చెప్పినది, వీరు జంకినది ప్రత్యక్షరము నిజమనియు, ఏదో తమకు అవకాశము దొరకినంత వఱకు, తొందర తొందరగా, ఒక రూప నిర్మాణము చేయగలిగిరేగాని, తమకు సాధ్యమైయో, కాకయో, తెలిసియో తెలియకయో వదలిపెట్టినది ఇకను నాలుగింతలున్నదనియు స్పష్టపడుచున్నది. ఒక పండితుని కృషి మూలపడి అందుబాటు లేక పోవుటకన్న ఎట్లో ఒకట్లు. లోకముకంటబడిన యెడల తర్వాతి కృషికి ఆధారము కాగలదుగదా. తామవలంబించిన పద్ధతిని గుఱించిగాని అర్థనిర్ణయమునకు మార్గము ఎట్లనిగాని వీరు స్పష్టముగా చెప్పలేదు. పద సేకరణమందుగాని, అర్థనిర్ణయమందుగాని, చారిత్రకాంశ సమన్వయమందుగాని అవలంబించిన విధానమును వివరించియుండిన బాగుండెడిది. ఆంగ్లములో నొక దీర్ఘమైన యుపోద్ఘాతమున్నది—శాసనాదుల స్వభావమునుగూర్చియు, ఆంధ్రుల చరిత్రను గూర్చియు, శాసనములలోని శకకాలాది పంచాంగగణనమునుగూర్చియు వ్రాసియున్నారుగాని అది—శాసనములలో అద్భుత విషయము లున్నవని తెలుపుటగా నున్నదేగాని పరిశోధక విద్యార్థికి మార్గదర్శనముగా కనబడదు. తమిళ కన్నడ శాసనములు, భాషాంతర సంవాదము, చారిత్రకాధారములను పరిశోధించుట ఇత్యాదులకు ప్రవేశికగా కుదరలేదు.

అర్థనిర్ణయము విషయములో ఆయాపదములనిచ్చి తమకుతోచిన యర్థము వ్రాసి శాసన పదములను వాక్యములను ప్రమాణీకరించినారు. అవి చూడగా, వీరు ఆయా పదములమీద పండితులు వ్రాసిన వ్రాతలను, ఇప్పటికి చాలకాలముక్రిందటి వానినే, చూడలేదనియో, చూచియు అక్కర లేదనియో, వదలినట్లు తెలియుచున్నది. ఆంధ్ర శాసనములలోని పదములకు ఒక్క ఆంధ్రప్రదేశమందే వెదకుచు బాధపడిన అర్థము తెలియదు. ఆయా పదములకు సరివచ్చునట్టి తమిళ కన్నడసంస్కృత శాసన వాఙ్మయమును పరికింపవలయును. అట్లు వీరు అటనట ప్రయత్నించినను దానిని చక్కగా కొనసాగింపలేదు. (అంకకాఱు – 'సత్తిగనంకకాఱు' అని కన్నడము చూపియున్నారు. దీని చర్చముందున్నది). ఆంధ్రేతరులు పలువురతో వీరు సంపదించినను ఇట్టి పనులలో నెమ్మదియు, అవకాశమును, ఆలోచనకు తగిన యనుకూల సన్నివేశములు నుండవలయును. మనకు ఎట్లు తమిళ కన్నడములు అవశ్యకములో అట్లే ఇతరులును మన భాషను దాని ప్రయోజనమును గుర్తించి కృషి యొనర్చిన పరిశోధకులుగా నుండవలయును. నేటి తమిళ పరిశోధకులలో పరిశోధనాభిమానముకన్నను తమ భాషయే గొప్పయనిచాటు దురభిమానము ఎక్కువగా కనబడుచున్నది. ఆంధ్రముమీది యభిమానము చాల తగ్గి

పోయినందున తెలుగు చక్కగా తెలిసిన తమిళ పరిశోధకులు చాల తక్కువమంది; లేరనియే చెప్పవలెను. భాషాజ్ఞానముగలవారికి చరిత్ర తెలియవలెను కాబట్టి భాషాంతర సంవాదమందు వీరికి చక్కని తోడు లభింపలేకపోవుట శోచనీయము.

కొన్నిపదములు సులభముగా బోధపడునట్లు మామూలువానిని మార్చియుండవచ్చునేమో. అభ్యాగతి, అతిథి, అన్ని, అన్యథా (తలంచినవారు), అనేక వస్తువాహనోత్సవములు, ఆదిత్యవారము, ఆరగా, ఇది, ఈవుత (=ఇచ్చుగావుత), ఒరగి= పొంది, ఏలు ఇత్యాదులు. కాని కొంత నాటి గ్రాంథి కాంధ్రస్థితిని తెల్పుటకుపయోగపడునేమో.

అర్థనిర్ణయమందు - పండితులు చర్చించి ఇదివరకే నిర్ణయించిన విషయములను పరిగ్రహింప లేదో అర్థముగుట లేదు. అట్లు సూచించియుండిన యెడల విద్యార్థులకును పరిశోధకులకును సమగ్రముగా విషయమొక చోట, వెదకనక్కరలేక, దొరకెడిదిగదా. తర్వాతి పరిశోధనకును సుకరము. ఇందులకు ఉదాహరణముగా అంకకాడు అను పదమును చూచిన విశదము కాగలదు. దీనికి వీరు మూడే పంక్తులు వ్రాసినారు.

అంకకారుడు : Amkakarudu (క. అంకకార). శూరుడు, అంకకాడు, మొనగాడు. A hero, A veritable champion. సత్తిగనంకకార - సాహిత్యవిద్యానిధి SII. VI, 102 (శ. 928).

ఈ పదమునుగురించి, శ్రీ డాక్టరు నేలటూరు వెంకటరమణయ్యగారు—గుణగవిజయాదిత్యుని నాటి వర్తమానములు — గుణగవిజయాదిత్యుడు రాష్ట్రకూటులు—అను వ్యాసములలో విపులముగా చర్చించి, రాష్ట్రకూట నృపతుంగునికిని గుణగవిజయాదిత్యునికినిగల సంబంధమును వివరించుచు ఎంతో చారిత్రకాంశములను వెలికిలాగి, అంకకాడనబడువాడు వట్టి శూరుడో మొనగాడోమాత్రము కాడనియు, సాహిత్యవిద్యానిధి అంతకన్నను కాడనియు, అతడు తన ప్రభువునకు ఎంతసన్నిహితుడో, అప్పుడో దానిని, అంకకాండనబడువారి దొక సంస్థ, వీరే లెంకలు, ఏకాంగులు, కుమారులు ఇత్యాదులను తెలిపియున్నారు. గుణగవిజయాదిత్యుని యంతటి గొప్పరాజు, వేంగిప్రభువు, మహావిజేత, వల్లభనృపునికి - అనగా రాష్ట్రకూట నృపతుంగ చక్రవర్తికి—అంకకాడని శాసనములలో కలదు. 'గుణగవిజయాదిత్యపతిరంకకారః సాక్షాత్ వల్లభ నృపసమభ్యర్చితభుజః', 'యస్యభుజ న్నృపతుఙ్గః ప్రతిదిన మభ్యర్చ్య భవతి రిపు నృపతుఙ్గః', 'గంగా నంగజవైరిశక్తి రసమాన్ రట్టేశ సంచోదితో జిత్వా' - వీనినంతయు సమన్వయించినగాని 'అంకకార' శబ్దార్థము కుదురదు. అనేకులు పండితుల యభిప్రాయములను చర్చించి వెంకటరమణయ్యగారి నిర్ణయమునకు వచ్చినారు—'గుణగవిజయాదిత్యుడు రాష్ట్రకూటరాజ్యముపై నెత్తిపోయి కంబమును నాశము గావించెనని చెప్పవచ్చును. దీనికి తరువాత వింగవల్లియుద్ధము. ఈ యుద్ధమునుగూర్చిన వివరమేమియు మనకు తెలియదు; కాని యొక్కసంగతిని నిశ్చయించి చెప్పవచ్చును. గుణగవిజయాదిత్యుడు యుద్ధమున సంపూర్ణముగా బరాజితుడై యమోఘవర్షుని కరిగాపై యాతని సార్వభౌమత్వము నంగీకరింపవలసివచ్చెను. ఏతత్కారణముననే రట్టేశ సంచోదితుడై గాంగులపై దాడి వెడలినది' అని నిర్ణయించి తర్వాత గుణగుడు ఎట్లు నృపతుంగునికి సంబంధపడి అంకకాడైయుండెనో విశదీకరించినారు. 'అంకకారుడన నెవ్వడో వాని ధర్మమెట్టిదో తెలిసికొనినగాని పై బిరుదవాక్యము యొక్క భావము సంపూర్ణముగా బోధపడజాలదు. అంకకార యనునది కన్నడపదము. ప్రధానసేవకుడు, ప్రముఖయోధుడని రెండర్థములు నీ మాటకు కిట్టెలు వ్రాసియున్నాడు. 'అంకకార' తెనుగున 'అంకకాడు' అగుచున్నది. తెనుగు నిఘంటుకర్తలును, పండితులును, దీని కెవరేది సమంజసమని

తోచిన దాని కనుగుణముగా నర్థము వ్రాసి యున్నారు. 'అంకకాఁడు, దే. విణ. (అంకము+కాఁడు) చలముపట్టువాఁడు. చలపాది' అని సీతారామాచార్యులు. 'మొనగాఁడు, ముఖ్యుఁడు. శూరుఁడు, చలపాది, మాత్సర్యశీలుఁడు, కళంకముగలవాఁడు' అని సూర్యరాయకారులు. 'అంకకాఁడు' నకు రూపాంతర మగు 'అంకంబువాఁడు' అను మాటకు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవారు 'ముద్రాధారి' అని యర్థము వ్రాసిరి. (బస. పు. పీఠిక 117 పు). 'అంకము' అను మాటకు 'గుఱుతు' అని యర్థముండుటచేతను 'ముద్రయు' 'గుఱుతును' సమానార్థక పదము లగుటచేతను 'అంకంబువాఁడు' అన 'ముద్రాధారి' అని యర్థము జెప్పవచ్చును మఱియు పాల్కురికి సోమనాథుడు శివుని కొలువు నియోగములను లెక్కించుచు 'అంకంబువాఁడు సేనాధినాథుండు' (బసవ. ఆ 2 పు. 46) అని చెప్పియుండుటచేతను, 'అంకకాఁడు' డెబ్బదిరెండు నియోగములలోనివాడే యగుటచేతను, శాస్త్రులవారు చెప్పిన యర్థమే సరియని తోచవచ్చును. కాని బసవ పురాణమునం దీమాటకు శాస్త్రులవారు చెప్పిన యర్థము సరిపడదేమో యని సందేహము కలుగుచున్నది ఏణాధినాథుని కథ ప్రకరణాంతరమున బసవపురాణమున గలదు... చూడగా సేనాధినాథుడు శూరుడైన రాజుగాని కేవల ముద్రాధారికాడని తోచుచున్నది. 'అంకకాఁడు' ను భాహత్తర నియోగములలోనివాడేయగుటచేత నిచట 'అంకంబువాఁడు' అనగా 'శూరుఁడు' అని యర్థము చెప్పుకొనుట యుక్తము.

'అంకకాఁడు యోధుఁడేయైనను యోధులందఱును నంకకాండ్రు కాజాలరు...'అంకము' 'అంకకాఁడు' అనునవి పరిభాషా పదములు. ఇవి పరిభాషా పదములని గుర్తింపకపోవుటచే మన నిఘంటు కర్తలును బండితులును వీని యర్థమును గ్రహింపలేక పోయిరి. 'అంకము' అన ద్వంద్వ యుద్ధము. సర్వజ్ఞ సోమేశ్వరుడు దన యభిలషితార్థ చింతామణియం దీ యంకయుద్ధస్వరూపమును విపులముగా వర్ణించియున్నాడు. అంకయుద్ధము రాజవినోదములలో నొకటి. ఒకడు సమానుడైన మఱియొకనితో తుల్యమైన యాయుధము జేకొని రంగస్థలమున నిలిచి చేయుయుద్ధము విజ్ఞులచే 'నంక' మనబడుచున్నది. అంకము లెనిమిది విధములైనవి...(1) పరిభూతాంకము ..(2) మత్సరాంకము...(3) భూమ్యంకము...(4) బిరుదాంకము (5) విద్యాంకము.. (6) వైరాంకము...(7) ద్రోహాంకము...(8) ప్రాయశ్చిత్తాంకము...రాజవినోదములలో నంక వినోద మొకటి యగుటచే రాజులు, మండలేశ్వరులు, సామంతులు, మున్నగువారు పూర్వకాలమున దమ యాస్థానములయం దంకకాండ్రను నియమించువారు. ఎవ్వారి కొలువున వీరంకయుద్ధము సేయ నియమింపబడియుండిరో వారి యంకకారుల మని వీరు సగర్వముగ చెప్పుకొనెడివారు. 'విక్రమాదిత్య నంకకాఱు' 'సత్తిగనంకకాఱు' 'ఆహవమల్ల నంకకాఱు' మున్నగునవి దీని కుదాహరణములు. రాజులకేకాక సేవకులకును, దేవాలయములకును, దేశమునకునుకూడ నంకకాండ్రుండువారు. 'సేనయంకకాఱు' 'మహాసేనెయంకకాఱు' 'భగవతియనంకకాఱు' 'శివనంకకాఱు' 'దేశియనంకకాఱు' మొదలగు బిరుదు లీ విషయమును దెల్లము సేయుచున్నవి. తమ యాస్థానములయందు స్థిరముగా నియోగింపబడిన యంకకాఱులనుగాక రాజులొక్కొక్కప్పుడు సమానులతోడనో, లేక వారి ప్రతినిధులతోడనో పోరాడుటకు గొప్పవారిని అంకకాండ్రుగ నియమించెడివారు. క్రీ. శ. 10 వ శతాబ్దమున వెలసిన రాజశేఖరకవి తన బాలరామాయణ నాటకమున రామరావణుల పక్షమున వారి యంకకాఱు లొనర్చిన యుద్ధమును వర్ణించియున్నాడు...(దీనికే తులాద్యూతమని పేరు కలదు.)

'...యదుత కి మఖిలవానరరాక్షస క్షయకారణ సంయామేణ తదేకం తులాద్యూతం ప్రవర్తయావః, తత్రచ –

త్వత్ప్రతిజ్ఞాకారవిజయే తవ రామ లక్ష్మ్యా
సీతా చ తే పునరియం భవతోఽనుదారాః
మత్ప్రతిజ్ఞాకారవిజయేతు మమాధిపత్యం
తస్యాం చ తే పుత్రకళత్ర జనేన తత్ర......'

పై జూపిన యుదాహరణములవలన—అంకకాడు అన కేవలము శూరుడు గడనియు, అంకయుద్ధముసేయు యోధుడే అంకకాడనియు, నంకయుద్ధము ద్వంద్వయుద్ధ విశేషమనియు, నంకవినోదము రాజవినోదములలో నొకటి యగుటచే రాజులు తమ యాస్థానములలో నంకకాండ్రను స్థిరముగా నుంచుకొనెడివారనియు, నొక్కొక్కప్పుడు సమానులైన రాజులతోగాని, వారి ప్రతినిధులతోగాని పోరవలసినపుడు దనకు బదులు యుద్ధముసేయుటకు దమ కాశ్రితులైన రాజులనో, రాజకుమారులనో తాత్కాలికముగా నంకకాండ్రుగ నియమించువారనియు దేలుచున్నది. మఱియు నంకయుద్ధమున జయమందిన యంకకాండ్రను రాజులు సత్కరించి గౌరవించెడివారు.

'ప్రతిజ్ఞాపాలకానాంతు
జయం దద్యా న్నృపః స్వయం,
ప్రసాద దానకం భూరి
వస్త్రకాఞ్చన భూషణమ్,
గ్రామా నశ్వాం స్తథా విప్కాన్
వృత్తిం దత్వాతు జీవితమ్,
మృతానాం బన్ధురక్షార్థం
పరలోక క్రియాకృతే
కృపావానం ప్రదాతవ్యం
కాఞ్చనం భూరి భూభుజా.'
(అభిలషితార్థ చింతామణి.)

అంకయుద్ధమునుగూర్చియు అంకకాండ్రనుగూర్చియు చెప్పవలసిన విషయము చాల కలదు' అని నిలిపినారు.

మఱి యిదంతయు శ్రీ ఈశ్వరదత్తుగారి గ్రంథమునకు కొన్నిసంవత్సరములకుముందే ప్రకటింపబడియుండియు వారేల గ్రహింపలేదో తెలియకయున్నది. పైగా 'అంకకాడు'కు' కన్నడమున 'సత్తిగనంకకాఱ'యను నుదాహరణమిచ్చి 'సాహిత్య విద్యానిధి'యని యర్థము దేనిని బట్టి వ్రాసినారో అనూహ్యముగా నున్నది. ఇంకను ఈ అంకకాండ్రకే శాసనములలో లెంకలనియు, అనుగులనియు, కుమారు లనియు వివిధములుగాగలదు. గొప్పచక్రవర్తులకు సామన్తులు అనుగులుగా, లెంకలుగా, కుమారవర్గమువారుగ నుండి యుద్ధములలో ప్రాణములకు తెగించి పోరాడి మరణించుచుండిరి. అందుచేతనే రాచపీనుగు తోడులేకపోదను సామెత పుట్టినది. ఈ పదములకు వీరు వ్రాసిన యర్థము లేవియు పై విషయములను గ్రహించి వ్రాయబడినవిగా కనబడవు. చూడుడు.

'అనుంగు : Anumgu (స. అనుగః. క. అనుగ. త. అణుక్కన్) ఇష్టుడు, అనుచరుడు, (Champion, follower) కాకతిగణపతిదేవమహారాజుల అనుగు జాయపనాయకుణ్డు. SII. IX 1045. (శ. 1175) ఇట్లే అనుంగు (స్త్రీ) కలదు. అ. అణుంగి.

'లెంక: భటుడు, సేవకుడు, వార్తాహరుడు'

'కుమారామాత్యుడు. ఆబాల్యము నుండియు (బాల్యమునుండియు లేదా ఆబాల్యము అనుట ఒప్పు) రాజసేవలోనున్న మంత్రి 'కౌమారాదారభ్య అమాత్యః' One who has been in the service of the king from the time when he was the boy (ఇట the boy తప్పు. a boy అనిన సాధువు) ఖిల్లుఖండవిషయే...మహాసామన్త దండనాయక దండపాసిక అంతరంగ కుమారామాత్య ఉపరిక విషయపతి గ్రామపతి....

ఈ పదములకు ఈ యుదాహరణములను బట్టి ఈ యర్థములు కుదురవు సరిగదా వీని విషయమై వీరు సమకాలిక రచనలను చూచినట్లుగాని, వానిని గూర్చి కొద్దిగా ఆలోచించినట్లుగాని కనబడదు గదా. ఇవన్నియు సమన్వయించి వ్రాయబూనిన

మహాగ్రంథమే యగును. మహాప్రభువులు తమకు లొంగి, లోబడి స్వాధీనులై సత్ప్రవర్తనమందుండుట కంగీకరించిన సామంత రాజులను, శత్రురాజులను, 'కుమారు'లని బిరుదిచ్చి మన్నించుచుకూడనుండిరి. రాజులతో సహవాసులుగా ఎడబాయకయుండి తరుణమున ప్రాణముల నర్పించు కుమారవర్గముగాక ఈ విధమైన కుమారవర్గముకూడ నుండెడిది. దీనినే 'ఫర్జంద్' అని మొగలాయా చక్రవర్తులు బిరుదుగా తాము జయించిన సుల్తానుల కిచ్చుచుండిరి. శాసనశబ్దకోశమువంటి గొప్పగ్రంథములో ఇవన్నియు కలిపి శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారి విజ్ఞాన సర్వస్వమువలె చేర్పరాదా; వీరి పథకమువేరా? తెలియ లేదు.

ఇది–తీగకదలించిన డొంకయంతయు కదలునట్లుగా నున్నది కాబట్టి, మహాపరిశోధనకు విషయము కాబట్టి–సోనిత్తము. అగ్రహార శబ్దమునకు వ్రాసినదిచూచి ఇక చాలించుట మేలు.

'అగ్రహారము—బ్రాహ్మణులుగాని వైశ్యులుగాని నివసించుటకై నిర్మింపబడిన గ్రామభేదము. వారికి సర్వకరపరిహారార్థముగా పోషణార్థమిచ్చెడు వసతి. బ్రాహ్మణాగ్రహారము' అని వ్రాసి దీనినే ఇంగ్లీషులో వివరించి 'దక్షిణగంగనా దద్దయు నొప్పిన' అను భారత. ఆది. ప. 130 పద్యము (వృథాగా) నుదాహరించినారు. రెండవ అమ్మరాజు ఎలవఱ్ఱు శాసనమునుండి 'తస్మై మకోరమియనామ్నే సువర్ణ భాండాగార శ్రీకరణముఖ్యయా యెలవఱ్ఱు గ్రామస్సర్వకర పరిహారేణ అగ్రహారీకృత్య...' అనికూడ ప్రమాణమిచ్చినారు. అగ్రహార శబ్దార్థ నిర్ణయమునకు ఈ యుదాహరణము లెంతవఱకు సమర్థకములో దానినటుంచి దీనిని గూర్చి ఈ వరకే పండితులు చేసిన హెచ్చరికలు నిర్ణయములు చూతము.

శ్రీ మల్లంపల్లివారు దీనినిగూర్చి ఆలోచించి అకరహారముగా నుండునాయని శంకించినారు. అ+కర+హారము, అనగా పన్నులేని భూమి. అదియే కాలక్రమమున ఉచ్చారణ వేగమున అకర గ్రగా మారి యుండవచ్చుననియు సూచించినారు.

ఇప్పటికిని 'అగరం' అని చాల యూళ్లు గలవు. అవి అకరములుగానుండి మారిన జాడలును గలవు. పైగా ఈ అకరహారములకు సంబంధించిన పదములు ఇంకను చాలగలవు. ఇట్టివానికి వీరు Cross reference ఇచ్చియుండవలసినది. అవి 'నల్లిల్లు – నల్లిండ్లు — బ్రహ్మపురి – చతుర్వేదిమంగలము? మొదలైనవి. వీనిని వేర్వేఱుగా – సంబంధములేని పదములుగా ముద్రించుటవలన పరిశోధకునకుగాని విద్యార్థికిగాని ఏమి ప్రయోజనము. ఇందే వీనినెల్ల సమన్వయించి ఒక చోట అర్థనిర్ణయముచేసి వేర్వేఱుగా చూపినప్పుడు ప్రధాన శబ్దమునకు సూచనగా చూ. అని నిర్దేశించి యుండవలసినది. నల్లిల్లు అన్నచోట వీరిచ్చిన శాసనాది ప్రమాణము –

'నల్లిండ్లు...అగ్రహారములు. సప్తసంతానములలో నొకటి (An Agrahara) భూసురోత్తములకు భూమి దానమిచ్చి నల్లిండ్లు నిలిపి దానింతవట్టు......

గుడియును జెఱువును వనమును
నడరిన నల్లిల్లుం గ్రితియు నడపెన్నిధియుం
గొడుకులను సప్తసన్తతి
నొడగూడంగ నిలిపి సరణుం డొప్పెన్‌గీర్తిన్ని,

SII. X. 151 (శ. 1083.)

'నల్లిల్లు......బ్రాహ్మణాగ్రహారము, అగ్రహారము. నల్లి=వేదము (త) నల్లార్=వేదవిదులు (త). 'వేదవిదులు నివసించు ఇండ్లు అనగా బ్రాహ్మణాగ్రహారము. సప్తసంతానములలో నొకటి, **A brahman settlement: one of the seven santanas.**

తన పెంచిన సంతానము;
తన సంతానమ్ము గృతియుం దన నల్లిల్లున్

వనమును జెఱువును గుడియును
జనవినుతములైన సప్తసంతానంబుల్.
తె. శా. 1. 6.

ఈ యుదాహరణములలో 'భూసురోత్తములకు భూమి దాన'మిచ్చుటచేతను 'నల్లిండ్లు' అందుచేత నిలుపుటచేతను నల్లిండ్లు ఎట్లు అగ్రహారములైనవి. 'నల్లిండ్ల'ను 'నిలుపుట' యనగా అది ఏమికార్యము, ఎట్లు చేయబడినది. ఆ నల్లిండ్లను పోనీయక కాపాడి నిలుపుటకు భూమిదాన మావశ్యకమని తెలియుచున్నది. నల్లిండ్లు సప్తసంతానములలో నొకటియనియు తెలియుచున్నది. అంతేగాని నల్లిల్లు అగ్రహార మెట్లులగునో అందుకు ప్రమాణములేదు. సప్తసంతానములు అను శబ్దము క్రిందకూడ వీరు దీనిని చర్చింపలేదు. అట రెండు పద్యము లుదాహరింపబడినవి. అందు రెండవది—

'దానధీచిసోముం డవదాత
యశఃప్రసరుణ్డు పుత్రసం
తాన సముద్ధుండై చెఱువు
ధర్మవివాహము దేవగేహము
ద్యానము సత్ప్రబంధము నిధానమనం
జనుచున్న సప్తసం
తానములం ప్రసిద్ధముగ ధారుణిపై
నిలిపెం గ్రమంబునన్.'
SII. IX. 1180 (శ. 1110.)

ఇందు అగ్రహారమునకు బదులు ధర్మవివాహమున్నదిగదా, ఎందులకో? ఈ కోశము వివరింపదు. చూడగా దొరకిన విషయములకు అకారాది జాపితా సమకూర్చినంతమాత్రముగానే యున్నది. అగ్రహారము, నల్లిల్లు సప్తసంతానములు—వీనినెల్ల ఆయాప్రమాణములలో చర్చించి నేను పదునాకండేండ్ల క్రిందటనే నా నన్నెచోడుని కవిత్వమను పుస్తకములో వ్రాసియున్నాను. సప్తసంతానములలో అగ్రహారములు చేర్పబడినను, బ్రాహ్మణులకు పన్నులేక వేదాధ్యయనము నిమిత్త మీయబడినను పన్నులేనిభూమి అకరహారము—అది ఎవరి కీయబడినను సరియే. తర్వాత నల్లిండ్లు అగ్రహారములై బ్రహ్మదేయములకే ఆ పేరు వర్తించిన పరిణామము విచిత్రముగానున్నది. 'నల్లిండ్లను నిల్పుట'యేగాని అగ్రహారమిచ్చినట్లు ఇచ్చుటయని ఎచ్చటను కానరాదు. పైగా నల్లియనగా వేదమని శ్రీ ఈశ్వరదత్తుగారు వ్రాసినారు. నేను గ్రహించినంతవఱకు నల్లియనగా వేదమని తమిళములో కానరాలేదు. నల్లార్ అనగా సదాచార సంపన్నులు. నల్లయనగా మంచి, మేలైన, యోగ్యమైన, గొప్ప ఇత్యాద్యర్థములే. వేదాధ్యయనపరులు సదాచారసంపన్నులుగా నుండినందున మంచివారు=నల్లార్, అనబడిరి. వైష్ణవులలో నల్లాన్, నల్లాన్ చక్రవర్తుల— ఇత్యాది ఇంటిపేర్లవారు, పుదూరుద్రావిడులలో నల్లారివారు—ఉన్నారు. నల్లారుల కీయబడిన యూరు నల్లూరు. నల్లకు అల్ల రూపాంతరము. ఇవియే అల్లూళ్లుగాకూడా నున్నవి. నల్లిల్లనగా నల్లబడిన యిళ్లనియు, బ్రాహ్మణులు ఆహితాగ్నులుగాన నిరంతర హోమధూమములచే వారి యిండ్లు నలుపెక్కి నల్లిండ్లైనవని శ్రీ సీతారామాచార్యులవారు శబ్దరత్నాకరములో దాదాపొకశతాబ్దము క్రింద వ్రాసియుండిరి. కాని నివాసానంతరము నల్లబడును గాని గృహప్రవేశమునకు మునుపే ఆ మహారాజెవడో పొగపట్టించి, వెల్లవేయక, దానము చేయునా! కాబట్టి దానమిచ్చినప్పుడు తెల్లయిళ్లే కాని నల్లవారి కీయబడినందున చూచుటకు తెలుపైనను నల్లిళ్లైనవి. ఇక్కడ గ్రహింపవలసిన విషయమిదిగాదు. 'నల్ల'వారికి ధర్మవివాహములు చేయించి భూములిచ్చి, ఇండ్లు కట్టించి ఇచ్చి వారి నందఱను గృహస్థులనుచేసి వైదికవిద్యలను, రాజులను, ప్రభువులును, ధనికులును పోషించుచుండిరి. గుండనామాత్యుడు 'వడుగు బెండిలి సేయ వయసైన విప్రుల దడవి సేయించు నీ పుడమి యెల్ల' (కేయూరబాహుచరిత) ధర్మవివాహముతో అగ్రహారముచేరి, నల్లిండ్ల వరుసలును నన్నిచోడుని

నాటికి 'మహాగ్రహారపుర'మై తుదకు అగ్రహారముగా నిలిచినది. అదియే నాలుగు వేదములు చదివిన వారి కిచ్చినదను నర్థమున చతుర్వేదిమంగళము, బ్రాహ్మణులదిగాన బ్రహ్మపురి ఇత్యాదిగా ప్రసిద్ధి నందినది.

ఈ విధము ఒక్కొక్క శబ్దమునకు చరిత్ర చూచుచు పోయిన ఎంతయైనను లోటు కనబడును. ఈ శబ్దకోశమునందు ఇంతవరకు జరిగిన పరిశోధనా ఫలితములను గ్రహింపలేదు. కేవలము ఆంధ్రప్రదేశమునకే పరిమితమైనదన్నను ఆయా పదములనిచ్చి చర్చలను, ఏర్పడిన సిద్ధాంతములను సూచనగనైనను తెలుపకపోవుట శోచనీయము. పండితులెందరి సిద్ధాంతములో ఇంకెక్క లేదు. ఇట్టిది విద్యార్థులకుగాని పెద్దలకుగాని ఉపయోగపడని విధమున నేర్పడినది. ద్వితీయ ముద్రణమునందైనను సమర్థులగు కొందఱు పండితులచేతను చరిత్రకారులచేతను పరిష్కరణ చేయించి అకాడమీవారు, అత్యంతాధునిక పరిశోధనా ఫలితములైన విషయములచే బహుళార్థ బోధకమును సమగ్రమును, నైన గ్రంథమును వెలువరింతురుగాక.

(శాసనశబ్దకోశము :— (ఆంధ్రప్రదేశము) రచయిత : శ్రీ కుందూరి ఈశ్వరదత్తు, డెమ్మీ సైజు (1-8 పుటం) దాదాపు 500 పుటలు. రు. 30/- ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమి, హైదరాబాదు 4.)

బెర్ట్రాండ్ రస్సెల్

పరిశీలక్

Man is a restless animal, not content, like the boa constrictor, to have a good meal once a month and sleep the rest of the time. Man needs, for his happiness, not only the enjoyment of this or that, but hope and enterprise and change.

* * *

Change is one thing, progress is another. 'Change' is scientific, 'Progress' is ethical: change is indubitable, where as progress is a matter of controversy.

* * *

All that science has to offer has not satisfied the philosophers. They have professed to discover a formula of progress, showing that the world was becoming gradually more and more to their liking. The recipe for a philosophy of this type is simple. The philosopher first decides which are the features of the existing world that give him pleasure, and which are the features that give him pain. He then, by a careful selection among facts, persuades himself that the universe is subject to a general law leading to an increase of what he finds pleasant and a decrease of what he finds uupleasant. Next, having formulated his law of progress, he turns on the public and says: 'it is fated that the world must develop as I say. therefore those who wish to be on the winning side, and do not care to wage a fruitless war against the inevitable, will join my party.' Those who oppose him are condemned as unphilosophic, unscientific, and out of date, while those who agree with him feel assured of victory. since the universe is on their side. At the same time the winning side, for reasons which remain some what obscure, is represented as the side of virtue.

* * *

Science is empirical, tentative, and undogmatic; all immutable dogma is unscientific. The scientific outlook, accordingly, is the intellectual counterpart of what is, in the practical sphere, the outlook of libralism.

ఇవి అన్నీ బెర్ట్రాండ్ రస్సెల్ ఒక వ్యాసంలో* వ్రాసిన మాటలు. వీనిని తెలుగుచేసే ఇవ్వవచ్చును గాని, ఆ వాక్యాలలోవున్న నగిషీలు, అర్ధచ్ఛాయలు అన్నీ అనువాదంలో రావడం కష్టం. మరి ఈ రకమైన ఆయన మాటలను ఆయన వ్రాసిన భాషలో చదివినప్పుడే, ఆయన ఆలోచనాపద్ధతి ఎటువంటిదో, వాని లోతుఎంతటిదో తెలుస్తుంది. ఈ విధంగా ఉదాహరించుకుంటూ ఇటువంటి వాక్యాలను, మానవలోకంయొక్క లోతులను పట్టిచూపిన శ్రుతిసూత్రాలను ఎన్నింటినైనా ప్రదర్శించుకుంటూ పోవచ్చు. పైన ఇచ్చిన వాక్యాలలో మానవలోకాన్ని ఆయన అర్థం చేసుకున్న పద్ధతి గోచరిస్తుంది. మనుష్యుడు ఏమిటి! దేముడా! దెయ్యమా! ఏదీ, కాదు. ఆ మనుష్యుడు నిత్యవిజిజ్ఞాసతో కొట్టుకుంటూ వుండే ఒక ప్రాణి; ఒక సత్వం; ఆ ప్రాణి ఈ భూమిమీద పరిణమించింది. మరి ఈ భూమి ఎటువంటిది? ఆ విషయాన్నిగూడా అదే వ్యాసంలో రస్సెల్ వివరించారు. ఆయన 'change'

* Unpopular Essays — Berttrand Russel.

లేక 'మార్పు' శాస్త్రయుక్తం అన్నారుకదా; ఆ శాస్త్రంతో ఆ మార్పు ఎట్లా కన్పిస్తూ వున్నదీ— ఇట్లా వివరించారు: 'గలీలియో తలఎత్తేవరకు ఖగోళ శాస్త్రజ్ఞులు ఆరిస్టాటిలు చెప్పిందాన్నే పట్టుకొని అంతరిక్షాలలోవున్న ప్రతిదీన్నీ, చంద్రుడు దగ్గరనుంచి పైదాకా మార్పులేనిదని, క్షతిలేనిదని భావిస్తూ వచ్చారు. లాప్లాస్ అనంతరం నుంచి ఆ స్థానం మర్యాదా కల్గిన శాస్త్రజ్ఞుడు ఎవ్వడూ కాకూడా. ఈ అభిప్రాయాన్ని పట్టుకు వేళ్లాడుతూ కూర్చోలేదు. నెబ్యులే (Nebulae), నక్షత్రాలు, గ్రహాలు అన్నిగూడా క్రమక్రమంగా ఆవిర్భవించాయని, కొన్ని నక్షత్రాలు ఇప్పుడు 'చచ్చి'కూడా పోయినాయని మనం నమ్ముతున్నాము. ఎప్పుడో ఆ రకం నక్షత్రాలలో 'ప్రళయాలు' సంభవించి వానిలో కాంతిమొత్తము, వేడియొక్క ప్రసరణపు మొత్తము అనంతంగా తగ్గిపోయి అవి అట్లా అయినాయి. మనం వుంటున్న ఈ భూమి వున్నదే దీన్నిగూర్చి తత్వవేత్తలు అనగా ఫిలాసఫర్లు, పెద్దదురభిమానాన్ని, అతిశయమైన ఆసక్తిని పెంచుకొని వుండటం కన్పిస్తూ వుండి వున్నా, మనం నివశిస్తున్న ఈ భూమి ఒకప్పుడు పెద్దఅగ్నిగోళంలాగావుండేది. అందులో ప్రాణిమాత్రం బ్రతికేందుకు లేదు. మరికొంతకాలం పోయిం తర్వాత ఈ భూమి చల్లబడిపోతుంది. ఈ భూమికి శీతలం కమ్ముతుంది. ఈ భూమి కొన్ని యుగాలు పరిణమించి, పరిణమించి నిరపాయాలైన 'ట్రైలోబైట్'లను, సీతాకోకచిలుకలను ఉత్పత్తి చేసింది. అట్లాగే పరిణమిస్తూ, పరిణమిస్తూ 'నీరో'లను, చెంఘిజ్ ఖాన్‌లను, హిట్లర్ లను ఉత్పత్తి చేయగల దశకుగూడా వచ్చింది. అది ఒక పీడకల. ఆ కల నిల్వరాదు. చివరికి ఎప్పుడో ఈ భూమిగూడా చల్లబడిపోతుంది. ప్రాణిజాతాన్ని భరించగలశక్తి లేనిదై పోతుంది. అప్పుడు శాంతి తిరిగి వస్తుంది.' ఇది తత్వవేత్తలకు అడ్డగోలుగా వుంటుంది. వారికి ఇది తృప్తిని కలిగించదు. అందు చేత వారు తత్వాలను సృష్టిస్తూ వుంటారు. అంతేగాని మానవునియొక్క అసలు తత్వాన్ని ఆలోచించరు. ఆ మానవునియొక్క ఆవాసస్థానమైన భూమి యొక్క అసలు తత్వం వారికి పట్టుతున్నది గనుకనా! రస్సెల్ మానవుడు శాంతిలేని ఒక సత్వము అని, మంచి భోజనము, మంచి నిద్రవుంటే ఆ మానవునకు చాలదని, మనుష్యుడు తన సుఖంకోసం ఆయా వస్తువులు లేక విషయాల అనుభోగాన్నే కాక, ఆ సుఖంకోసం, ఆ ఆనందాన్ని పొందడం కోసం ఆశ వుండాలని, ఉత్సాహశక్తి అవసరమని ముఖ్యంగా 'మార్పును' వాంఛిస్తాడని అంటున్నాడు.

ఈ మార్పును అంతా కోరుతూవున్నారు. అయితే దాని స్వరూపాన్ని ఎంతమంది అర్థం చేసుకున్నారు? ఇటువంటి ప్రశ్నవచ్చిన వేళకు రస్సెల్ అవలంబించిన పద్ధతి విచిత్రంగా వుంటుంది. ఎందుచేతననగా ఆయనచేత విమర్శింపబడని ఐరోపీయ తత్వవేత్తఅంటూ, సనాతనులుగాని, ఆధునాతనులుగాని, లేదు. ప్లేటో దగ్గరనుండి హెగెల్ వరకు విస్తరించివున్న తత్వవేత్తలను, కారల్ మార్క్సునుగూడా—రస్సెల్ అతికఠినంగా విమర్శించారు. ఆయనచేత కొంత మెచ్చుకొనబడినవాడు ఒక్క 'లాక్'మాత్రమే. ఆయన చెప్పిన Empiricism ను బెర్ట్రాండ్ రస్సెల్ కొంత ప్రశంసించారు. అందుకు ఆయన చెప్పిన కారణం ఒక్కటే. ప్రజాస్వామ్య ధర్మతత్వానికి, తగిన తాత్విక ప్రాతిపదిక ఆ Empiricism లోనే సమకూడివస్తుంది. రస్సెల్ ఇట్లా వ్రాశారు.

'The only philosophy that affords theoritical justification of democracy and that accords with democracy in its temper of mind is Empiricism. Locke, who may be regarded, so far as the modern world is concerned as the founder of empiricism, makes it clear how closely this is connected with his views on liberty and toleration......'

రస్సెల్‌కు ఈ Liberty, ఈ Tolerance అన్నవి చాలా ముఖ్యం. ఇవి లేనిచోట నిరంకుశత్వం, పిడివాదం మొదలైన విపరీతపద్ధతులు తలెత్తుతాయి. ఈ నిరంకుశత్వాలను, ఈ పిడివాదాలను—

అవి ఎచ్చట ఏరూపంలోవున్నా, వానిని రస్సెల్ నిశితంగా విమర్శించారు. ఖండించారు. తిరస్కరించారు. ప్లేటో, హెగెల్, మార్క్స్ మొదలైన తాత్వికులను విమర్శించి, వారి తత్వాలలోని గూఢార్థాలను బట్టబయలు చేయడంలో ఆయనలో నిబిడమైవున్న దృష్టి ఇదే. వారి పద్ధతిని రస్సెల్ Autocratic system అన్నారు. వానికి పిడివాదమే ప్రాణం అన్నారు. 'It is obvious that an autocratic system, such as that advocated by Hegel or by Marx's present day disciples is only theoritically Justifiable on a basis of unquestioned dogma.

ఈ Dogma లు అవీ రస్సెల్‌కు నచ్చవు. నచ్చకపోవడమేకాదు; ఆయన వానికి విరోధి. వానిని తాత్వికంగా హతమార్చడానికి ఆయన చేసినంత రచనను మరి ఎవ్వరూ చెయ్యలేరు. ఇంతచేసి ఆయన తనకు ఇష్టమైన పద్ధతినిగురించి వ్రాస్తూ...... I conclude that, in our day as in the time of Locke, Empiricist Liberalism is the only philosophy that can be adopted by a man — who on the one hand, demands some scientific evidence for his beliefs, on the other hand, desires human happiness more than the prevalence of this or that party or creed.'

2

బెర్ట్రాండ్ రస్సెల్ మనుష్యులకు వుండతగిన లక్షణాలుగా చెప్పినవి, మనుష్యులు ముఖ్యము అంటిపెట్టుకొని వుండవలసిన విషయాలుగా చెప్పినవి కొన్ని వున్నాయి. వానిలో 'స్వాతంత్ర్యము' లేక స్వేచ్ఛ (Liberty) అన్నది, సహనము లేక Tolerance అన్నది చాలా ముఖ్యమైనవి. 'మానవ జాతి భవిష్యత్తు' అన్న ఒక వ్యాసంలో ఈ స్వాతంత్ర్యం అన్నది ఏ సమాజంలోనైనాసరే ఒక్క మేధావులకు, అదృష్టవంతులైన వర్గాలవారికేగాక సర్వులకుగూడా ఈ స్వేచ్ఛ లేక స్వాతంత్ర్యము వుండటం అన్నది ముఖ్యం. సోవియట్ రష్యాలో ఈ స్వేచ్ఛ అన్నది లేకపోవడంవల్ల అక్కడి ప్రభుత్వం బ్రిటన్‌లో వున్నదానికన్నా, అమెరికాలోవున్న దానికన్నా అధికమైన ఆర్థిక అసమానత్వాన్ని సాధింపగల్గింది. నిరంకుశమైన ఒక ప్రభుత్వం సర్వప్రచార సాధనలను తనచేతుల్లో వుంచిపెట్టుకొని వున్నప్పుడు అన్యాయాలను, అక్రమాలను ఎక్కువ చెయ్యగల్గుతుంది. అటువంటి పనులు జరుగుతుంటే అవి జరుగుతున్నట్లు స్వేచ్ఛగా చెప్పగల స్వేచ్ఛ వున్న చోట్లలో అవి జరగడం అంతగా సాధ్యం కాదు. ప్రజాస్వామ్యము, స్వేచ్ఛతోగూడిన ప్రచారము మూలంగానే 'అధికార ధూర్తవ్యూహాలు 'జోహుకుం' రాజ్యాలను స్థాపించుకొని, కొద్దిమందికి పెద్ద భోగము, ఎక్కువమందికి అధికదైన్యము సంభవం కాకుండా నిరోధించవచ్చు. అని ఆయన అంటారు.

అయితే ఈ స్వేచ్ఛ అన్నది విశృంఖలమై వుండరాదన్న విషయాన్నిగూడా రస్సెల్ చెప్పి వున్నారు. ఈ స్వేచ్ఛనుగూడా శాసనంచేత కట్టుదిట్టం చెయ్యాలని, చెప్పారు. పోతే అధికారము లేక పవర్ అన్నది వున్నది. ఈ దానిని గురించి రస్సెల్ ఒక పుస్తకమే వ్రాశారు. ఆ పుస్తకం పేరుగూడా 'Power' అనే. రస్సెల్ ఎన్నో పుస్తకాలు వ్రాశారు. చిన్నవి, పెదవి. అన్నీ గొప్పగానే వుంటాయి. ఆయన వ్రాసిన వానిలో ఇది తక్కువ పుస్తకం అని చెప్పదగింది వుండదు. అయితే ఈ 'Power' అన్న పుస్తకం అత్యంతము విశిష్టమైనదన్నీ, అవశ్యము అందరు పఠించవలసిందిన్నీ. అందులో రస్సెల్ ఒక కొత్త సిద్ధాంతాన్ని నిరూపించారు. దాని మూలసూత్రం ఇది—మనుష్యునికి బహువాంఛలు వున్నాయి. వానిలో ముఖ్యమైనవి అధికార దాహమున్నూ, గొప్పతనంకోసం ప్రాకులాడటమున్నూ; ఈ రెండు ఒక్కటికాదు; కాని వాని మధ్య సన్నిహితమైన సంబంధం వుంది. సమాజ యొక్క కదలికకు మూలస్వత్వం ఆర్థిక స్వప్రయోజనం అని పూర్వపు ఆర్థికవేత్తలు, మార్క్స్ గూడా భావించారు. కాని రస్సెల్ అది సరికాదంటారు. ఇక్కడ ఆయన వాదం ఇది. వస్తుజాతం పట్లవున్న వాంఛా సర్వస్వంనుంచి అధికారవాంఛను, గొప్పతనంకోసంఅయిన ప్రాకులాటను పృథక్క

రించేస్తే, అప్పుడు వస్తువాంఛ పరిమితమై, సాధారణ సామర్థ్యమాత్రంచేత సంపూర్ణము తీర్చుకొనగల్గినది అవుతున్నది. అతిశయమైన వాంఛలు వున్నాయంటే, ఐహికభోగలాలసతవల్ల మాత్రమే అవి నియంత్రణం కావడం లేదు. ఒక రకమైన సుఖస్థాయిని సాధించగల్గిన సముదాయాలు, సమాజాలు సంపత్ సాధనకోసంగాక అతిశయ అధికార ధూర్వహత్వంకోసం ప్రయత్నాలు చేస్తున్నాయి. వ్యక్తుల విషయంలోగూడా కధ ఇంతే. కొన్ని సందర్భాలలో ఈ వ్యక్తులు, ఈ సముదాయాలు సంపదాధిక్య సాధనమైనా కొంతవదులుకొని, అధికార దాహాన్ని పెంచుకొనడం కన్పిస్తుంది. అందువల్ల సమాజంలో సర్వకార్యకలాపాలకు, వ్యవహారాలకు ఈ 'అధికారప్రీతి' అన్నది మూలధర్మంగా వుంటూ వచ్చిందన్న విషయాన్ని గ్రహించినప్పుడే, నడిచిన చరిత్రకు, నడుస్తున్న చరిత్రకుగూడా అడుగునవున్న అర్థం ఏమిటో సరిగ్గా తెలుసుకోగల్గుతాము అంటాడు రస్సెల్. ఇప్పుడు ఆ పుస్తకంలో ఆయన ఏమివ్రాశాడో, ఏ విధంగా తనవాదా సిద్ధాంతాన్ని నిరూపించాడో, ఆ రకమైన విపరీత తత్వాన్ని అరికట్టాలంటే ఏమిచేయవలసివుంటుందని చెప్పాడో, ఇక్కడ వివరించడానికి స్థలంలేదు. అయినా ఈ అధికారదాహతత్వాన్ని అరికట్టడానికి రస్సెల్ ఏది కొంతవరకు మార్గం కాగలదని అనుకున్నాడో తెలుసుకొనడం అవసరం. ఆయన ఇట్లా వ్రాశాడు: 'To any one who studies history or human nature, it must be evident that democracy, while not a complete solution, is an essential part of the solution. The complete solution is not to be found by confining ourselves to political conditions; we must take account also of economics, of propaganda, and of psychology as effected by circumstances and education.'

ఈ విషయాలను గురించి రస్సెల్ ఏమి వ్రాశాడు, ఏమి చెప్పాడు అన్నది సర్వులు ముఖ్యంగా భారతదేశంలోనివారు చదివి అర్థం చేసుకోవలసివుంది. 'Power' అన్న రస్సెల్ గ్రంథం చాలా గొప్ప గ్రంథం.

3

బెర్ట్రాండ్ రస్సెల్ 97 సంవత్సరాలు జీవించి, మానవ జాతియొక్క మనుగడకు, భవిష్యత్తుకు, ఉన్నతికి అవసరమైన అనేక విషయాలను గురించి ఆలోచించి, వ్రాసి, 1970 సంవత్సరం ఫిబ్రవరి 2 వ తేదీన పరమపదించారు. ఈ 97 సంవత్సరాలలో ఆయన ఆలోచించని విషయము, వ్రాయని విషయము అంటూ లేదు. దాదాపు 100 సంవత్సరాలపాటుసాగిన ఒకమహామేధావియొక్క విచారధారాప్రపంచంయావత్తు సర్వతోముఖమైనదై ఆయన రచనలలో గోచరిస్తుంది. ఉత్తమ మేధావి, ఉత్తమ మానవుడు అయినవాడు తన కళ్లముందు నడుస్తున్న ప్రపంచాన్ని గురించి ఏ విధంగా భావించింది, ఆ ప్రపంచం ఏమి నేర్చుకుంటే బాగుపడగల స్థితిలోనికి రాగల్గుతుంది అని ఆలోచించింది—ఆయన గ్రంథాలలోనేగాక ఆయన జీవితంలోగూడా చూడగల్గుతాము.

బెర్ట్రాండ్ రస్సెల్ 1872 లో మే నెలలో 18 వ తేదీన జన్మించారు. రస్సెల్ తాతగారు లార్డ్ జాన్ రస్సెల్ విక్టోరియారాణికాలంలో ప్రధానమంత్రి పదవిని నిర్వహించారు. అయితే ఆ కుటుంబంలో రస్సెల్ అంతటి ప్రతిభావంతులు, రస్సెల్‌వలె అంతర్జాతీయఖ్యాతిని ఆర్జించిన వారు అరుదు. రస్సెల్ తల్లిదండ్రులు అతని చిన్నప్పుడే పోయారు. తాతగారే ఆయన్ను పెంచి పెద్దవాణ్ణి చేశారు. రస్సెల్‌కు ట్రినిటీ కాలేజీ 'ఓపెన్‌స్కాలర్‌షిప్' లభించింది. అచ్చట ఆయన గణితశాస్త్రంలో, నీతిశాస్త్రాలలో పట్టాలు పుచ్చుకున్నారు. గణితశాస్త్రాన్ని గురించి, తర్కము, తత్వము గురించి పుస్తకాలువ్రాస్తూ వచ్చారు. అవి అన్నీ గొప్ప గ్రంథాలు. ఆ అనంతరం ఆయన ట్రినిటీ కాలే

జీలో అధ్యాపకులుగా నియమితులైనారు. 1908లో రాయల్ సొసైటీ ఫెల్లో చేయబడినారు. అప్పటికి ఆయన వయస్సు 36 సంవత్సరాలు.

రస్సెల్ ఒక్క అధ్యాపకవృత్తిలో వుండటమూ, గ్రంథాలు రచించడములోనేగాక రాజకీయాలలో, ఫాబియన్‌సొసైటీకార్యకలాపాలలో, స్వేచ్ఛావ్యాపార ఉద్యమంలో, స్త్రీల హక్కుల పోరాటంలో పాల్గొన్నారు. మూడుసార్లు పార్లమెంటుకు నిలబడ్డారు గాని గెలవలేదు.

బెర్ట్రాండ్ రస్సెల్ శాంతివాది. ఆ శాంతివాదం ఆయన్ను చాలా తిప్పలుపెట్టింది. ఆయన ఉద్యోగం పోయింది. 1918 లో జైలుశిక్షపడింది. ఆ శిక్షను అనుభవిస్తూన్నకాలంలోనే రస్సెల్ 'ఇంట్రొడక్షన్– టు–మేథమాటికల్— ఫిలాసఫీ — అన్న గ్రంథం చాలాభాగం వ్రాశారు

ఆ యుద్ధం అనంతరం రస్సెల్ రష్యా వెళ్లారు. 'ప్రాక్టిస్ అండ్ థియరీ ఆఫ్ బోల్షివిజం'అన్న పుస్తకం వ్రాశారు. ట్రినిటీ కాలేజీ వారు తిరిగి ఉద్యోగం ఇస్తామన్నారు. ఆయన తిరస్కరించాడు. 1920 లో పెకింగ్ విశ్వవిద్యాలయంలో 'బిహేవియరిజం'పై ఉపన్యాసాలు ఇచ్చారు. అచ్చట చైనాలో జనజీవితాన్ని, వారి ఆలోచనాపద్ధతిని గురించి అధ్యయనంచేసి 'ది ప్రాబ్లమ్ ఆఫ్ చైనా'అన్న గ్రంథం వ్రాశారు.

రస్సెల్ దాదాపు 50 పుస్తకాలదాకా వ్రాశారు. అన్నీ ప్రశస్తమైనవే. ఎక్కువగా 'మాథమేటిక్స్', 'ఫిలాసఫీ', మొదలైనవానిని గురించి వ్రాసినవి. 1929 లో Marriage and Morals అన్న ఆయన గ్రంథం ప్రచురింపబడినప్పుడు ఒక పెద్దగాలిదుమారం లేచింది. ముఖ్యంగా 1940 లో ఆయన న్యూయార్కు కాలేజీలో ప్రొఫెసర్‌షిప్‌ను ఆమోదించివున్న కాలంలో చెలరేగిన తుఫాను కొంత పెద్దది. అది కోర్టులదాకా పోయింది. 1944 లో ఆయన తిరిగి కేంబ్రిడ్జిలో చేరారు. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ఆయన వ్రాసిన గ్రంథాలలో— 'హిస్టరీ ఆఫ్ వెస్టరన్ ఫిలాసఫీ' మొదలైనవి వున్నాయి.

ఆయనకు నోబుల్ బహుమానం వచ్చింది. ఆర్డర్ ఆఫ్ ది మెరిట్ లభించింది. కళింగ బహుమతి లభ్యమైంది. ఐరోపా సంస్కృతియొక్క వికాసానికి అనంతమైన సేవ చేసినందుకు డెన్మార్క్ వారు ఆయనకు డేనిష్ సోనింగ్ బహుమానాన్ని ఇచ్చారు.

అయితే రస్సెల్ ఒక్క ఐరోపా సంస్కృతి వికాసానికే కృషి చేశారా! అట్లా అనుకొనడం ఆయన ప్రతిభను, ఆయన మేధాసంపత్తిని, కృషిని గూడా పరిమితం చేసినట్లవుతుంది. ఈ 20 వ శతాబ్దంలో ప్రపంచం ఉత్తమసభ్యతను అలవరచుకొనడానికి ప్రయత్నంచేసిన మహాపురుషులలో ఆయన ఒక్కడు; విశిష్టుడు. ఆయనకు రాజ్యంలేదు; అధికారంలేదు; పీఠంలేదు. ఆయన ఎవరికి గురుత్వస్థానంలో కూర్చోలేదు. సామాన్యమానవునికోసం అసామాన్యమైన విషయాలను చెప్పదగినంత సులభంగా చెప్పారు. గొప్పగా చెప్పారు. అందుకే ప్రత్యక్షంగా ఎక్కువమంది శిష్యులు అన్నవాళ్లు ఆయనకు లేకపోయినా, పరోక్షంగ ఆయనకు శిష్యులు, అనుయాయులు అయినవాళ్లు అనేకమంది ఏర్పడ్డారు. మానవునిలోని ఉత్తమత్వాన్ని జాగరితం చేయడంకోసం రస్సెల్ ప్రారంభించిన కృషి ఇట్లా సఫలం అయింది. ఆయన మహామానవుడు. చరితార్థజీవి.

గ్రంథ విమర్శలు

సరళీ స్వరాలు

(రచన : కుమారి నందుల సుశీలాదేవి; ప్రచురణ : ఎం. శేషాచలం అండ్ కంపెనీ; మద్రాసు, మచిలీపట్నం, సికింద్రాబాదు. వెల : 2-00.)

పరిపూర్ణ మానవత్వంలో పటిష్ఠమయిన అభిప్రాయాలతో ఉన్నత వ్యక్తిత్వం కలిగి తన వ్యక్తిత్వం తాను కాపాడుకొంటూ, తన సహచరి వ్యక్తిత్వం కాపాడగల మానసికౌన్నత్యంవున్న ఏ యువకుణ్ణయినా పెళ్ళి చేసుకోవటానికి కథానాయిక ఇష్టపడుతుంది.

ఇటువంటి యువకుడు లోకంలో ఉన్నాడా? కథానాయికకు దొరుకుతాడా? ఉంటే ఎక్కడున్నాడు? దొరికితే ఎప్పుడు దొరికాడు? ఇత్యాది ప్రశ్నలకు సమాధానాలు నవలలో చదవవలసిందే!

పెళ్ళి ప్రధానమయిన సమస్యగా తలెత్తిన రచన ఈ నవల.

ప్రేమించిన వాణ్ణి పెళ్ళాడలేక, ఎవరి ప్రేమవల్లనో అపజయం పొందినవాణ్ణి భర్తగా పొంది, సంసారసుఖం పొందలేక గందరగోళంలో పడిపోయి, మృత్యువు వాళ్ళో చేరిపోయిన మాధురి వింత సంసారం కథ;

ప్రేమించినవాణ్ణి చేరుకొని సుఖంగా సంసారం సాగించుకోలేక, మరో యువకుణ్ణి ఎన్నుకొని, అతడు టి. బి. పేషెంట్ అయిపోతే ఆటుపోటులు తట్టుకోలేక తల్లడిల్లిపోయిన పద్మజ ఛిద్ర సంసారం కథ;

ప్రేమించినవాణ్ణి పెళ్ళాడి, పిల్లల తల్లయి, ఆర్థికంగా బాధపడి ఎలాగో సంసారం సాగించుకుపోతున్న విజయ కుటుంబకథ;

ప్రేమించిన శేఖర్ మరో అమ్మాయితో సంబంధం పెట్టుకొన్నాడుకనుక, బలమయిన వ్యక్తిత్వంలేనివాడని త్యజించి, చేరువయిన జోసఫ్ స్వార్థదృష్టి ఉన్నవాడుకనుక, ఉత్తమవ్యక్తిత్వం లేనివాడని పరిత్యజించి, మాధురి భర్త అయినా ఆమెతో అంతకాలం దాంపత్యబంధంలేకుండాఉండి, ఆమె ప్రేమికుడయిన రఘుదగ్గరకు భార్యను తీసుకుపోయిన వేణుగోపాల్ ఉన్నత వ్యక్తిత్వం ఉన్నవాడు కనుక, అతనే తను అన్వేషించే యువకుడని నమ్మిన శారదకథ; వెరసి ఈ నవల.

యువతీయువకులు ప్రేమ పెళ్ళి విడిపోవటం చేరువవటం కష్టం సుఖం చదువుతుంటే సరదాగా వుంటుందకాబట్టి పాఠకులను ఈ నవల ఆకట్టుకొనే అవకాశంవుంది.

బలమైన వ్యక్తిత్వం అంటే శారద దృష్టిలో ఏమిటో రచయిత్రి చూపించిన తీరు పరికింపదగింది. ఆ అమ్మాయి నల్లనిదా తెల్లనిదా అని ఆలోచింపకూడదు. ఆ అమ్మాయి ఎవరికయినా షేక్‌హేండ్ చేసిందాలేదాఅని ఆలోచించకూడదు. అసలు ఆ అమ్మాయి ఎటువంటిదీ ఏంకథాఅని చూడకూడదు. ఏ యువతితోనూ శృంగారసంబంధం కలిగివుండకూడదు. ఏ స్త్రీ అయినా చివరికి భార్య అయినా నేను ఫలానావ్యక్తిని ప్రేమించానుఅని చెబితే భార్యను తీసుకొనిపోయి, ఆ 'అతని'దగ్గర దింపిరాగలిగేటట్లుండాలి. డబ్బుండాలి. కారుండాలి. మరొకరి పిల్లను పెంచుకోగలగాలి. ఇటువంటివి ఎన్నోవుంటే అతను బలమైన వ్యక్తిత్వం ఉన్నవాడు. లేకపోతే లేనివాడు.

శారద తనకు వ్యక్తిత్వం ఉందనుకొంటుంది.

శేఖర్‌కు లేదనుకోంటుంది. అనూరాధతో అతని సంబంధంవల్ల అతను వ్యక్తిత్వం లేనివాడయ్యాడు. జోసఫ్ సహచర్యంతో శారద వ్యక్తిత్వం లేనిదే అవుతుంది. జోసఫ్ వ్యక్తిత్వంలో స్వార్థపరత్వంతో బాధ కలగటంవల్ల అతనికి దూరమయింది శారద. శేఖర్‌కి అటువంటి వ్యక్తిత్వ సమస్యే ఎదురయిందని శారద అనుకోలేదు. శేఖర్‌కు పరాయి అమ్మాయితో శృంగార సంబంధం ఉందిగనుక వ్యక్తిత్వం కలవాడుకాదు. వేణుగోపాల్ మాధురికి రెండేళ్ల భర్త అయినా శృంగార సంబంధం లేదు గనుక శారదకు కష్టం కలిగించలేదు. అతను ముగ్గుర్ని ప్రేమించినా తప్పుగా కనబడలేదు. హృదయం ఇవ్వటం శారదకు బాధ కలిగించదు. శరీరం ఇవ్వటం బాధ! శారీరకమయిన పతనమయినా సహింపదగిందే కాని మానసిక పతనంకాదని రచయిత్రి శారదకు సూక్ష్మదృష్టి కలిగించలేదు.

స్పష్టంగా కారణం తెలియని బాధ ఈ నవలకు ప్రాణం. యువతీ యువకులకు సంబంధించిన ఇతివృత్తం. శృంగారం—ప్రేమ—పెళ్లి—ఇత్యాది సంబంధాలు సంఘటనలు. రచన బాగుంది. సంఘటనలు సన్నివేశాలు బలంగా రూపొందింప లేకపోయినా శైలి నవలను చదివిస్తుంది. అంతర్లీనంగా ఉన్న బాధ, ఆవేదన రచయిత్రి మాటల్లో తపన, అన్వేషణ సరదాగా చదివేట్టు బుద్ధి పుట్టిస్తాయి.

రచయిత్రి కుమారి నందుల సుశీలాదేవి పరిణత మనస్సుతో వ్రాసే నవలకోసం పాఠకులు ఎదురు చూస్తుంటారు.

ఇంతకీ నేనెవరు?

(రచన: శ్రీ కపిల కాశీపతి. ప్రచురణ: ఎం. శేషాచలం అండ్ కంపెనీ; మద్రాసు, మచిలీపట్నం, సికింద్రాబాదు. వెల: 2-00 రు)

ఇంతకీ నేనెవరు?
దానికి రెండు రూపాలు:
ఒకటి నా తల్లిదండ్రులు లెవరు?
రెండు నా జన్మ రహస్యం ఏమిటి?
మొదటిది లోకసంబంధమయింది.
మరొకటి పారమార్థికమయింది.

పై రెండు ప్రశ్నలకు సమాధాన ప్రయత్నం ఈ నవల.

'ఆమె' అందరిలాగానే పుట్టివుంటుంది. ఆమె తల్లిదండ్రులెవరో ఎవరికీ తెలియదు. తెలిసిన వాళ్లు చెప్పలేదు. తప్పించుకుపోయారు.

ఆమె లౌకికసంబంధం తెలుసుకోవటానికి ప్రయత్నించింది విపరీతంగా. తెలియలేదు.

పెంచి పెద్దచేసి, ఆస్తికి వారసురాలుగా చేసిన తండ్రి ఏమీచెప్పలేదు. ఏమిటో అంత రహస్యం! అంతుబట్టలేదు.

తనజీవిత లౌకిక సంబంధ బాంధవ్యాలు తెలుసుకొనే ప్రయత్నం విఫలమయిం తర్వాత ఆమె తన అలౌకిక జీవిత సంబంధ బాంధవ్యాలు తెలుసుకోవటానికి ప్రయత్న పరంపర ప్రారంభిస్తుంది.

ఈ ప్రయత్నంలో హృదయం నిరంతరం దోళన చెందసాగింది.

మనస్సు తీవ్రవేదనకు గురికానారంభించింది.

శరీరం అతిక్రమించి ప్రవహించే యౌవనోద్రేకంనుంచి భగవంతుణ్ణి చూడబోయింది. వీలుకాలేదు. శరీరం అంతగా పరిమితమయిందని తెలిసి ఆవురుమంది.

చిత్రకళద్వారా తనెవరో తెలుసుకోవటానికి ప్రయత్నం ప్రారంభించింది. అనంతకళాసాగరం అవతలి అంచు తెలుసుకోలేక పోయింది.

అందువల్ల యౌవన జీవితంలాగా కళా జీవితమూ ఆమెకు సమాధానం చెప్పలేదు. చెప్పలేక పోయాయి.

గ్రంథ విమర్శలు

ఆమె ఆ రెండింటిలోనూ కోటిక్కోణం చేరు కోలేదనే చెప్పాలి.

భయంతోకూడిన సంఘబాహ్యమూ దూష్యమూ అయిన యౌవనజీవితం సమాధానం కాకపోయింది.

కళాజీవితం ఆస్తిపాస్తుల సంరక్షణ తాకిడికీ, యౌవనోద్రేకం పొంగుకూమధ్య మెలికలు తిరుగుతూ సాఫీగా సాగలేదు పరమార్థం చూపలేదు.

ఈ విధంగా రెండు ప్రయత్నాలువల్ల ఆశించిన ఫలితం చిక్కక ఆమె సన్యాసిని కాబోయింది.

ఆ ప్రయత్నం హిమాలయం వాకిట్లో అపశకునం ఎదురయి ఆగిపోయింది.

ఆమె హృదయ పీడిత తాడిత అయి మళ్లీ పాత జీవితం పుటలు పరిమిత పరిధిలో చదువుకోవటానికి వెనక్కువచ్చింది. అది వెనక్కురావటం కాదు, ముందుకుపోవటం. తనెవరో తెలుసుకొనే ప్రయత్నంలో మొదటిమెట్టు.

దిక్కులేని శ్యామలను పెంచుకొంది. ఆ పిల్లను ప్రేమతో చూచుకోవటంలో ఆమె పరమార్థం స్వీకరించే, గ్రహించే ప్రయత్నం ద్వితీయ సోపానం.

శ్యామల ముఖంలో తనను తాను చూచుకొంది; ఆమె. అంతటితో ఎంతో కాలంనుంచి తెలియని సమాధానం చిక్కినట్లయింది తనకు లౌకిక జగత్తులో తల్లిదండ్రులెవరో చూచాయగా తెలిసినట్లయింది.

ఇంతటితో వ్రాతలో నవల పూర్తి అయింది. అక్కణ్ణుంచి వ్రాయని నవల సాగుతుంది. ఆ తెలివిడి మెట్లమీద ముందుకు పోతున్న 'ఆమె' ఈ జీవితంలో, ఈ వాతావరణంలో, ఈ హృదయంతో ఈ అనుభవాల పరంపరలతో ఏనాడో—అలౌకికంగా తనెవరో తెలుసుకోగలుగుతుంది.

ఉత్తమపురుషలో నవలా రచన జరిగింది. ఆమె తన జీవితం గతంనుంచి మొహమాటం లేకుండా చెప్పుకుపోతుంది. ఆ చెప్పటంలో నిజాయితీ అన్వేషణ పాఠకులకు స్పష్టంగా అర్థం అవుతాయి.

ఇందులో తల్లిపట్ల హృదయం ద్రవీభవించే బిడ్డప్రేమ, బిడ్డపట్ల గుండెలుపిండే తల్లి వాత్సల్యం చూస్తే ఈ ప్రేమ పునాదిమీద సృష్టి రహస్యం ఉందని పాఠకులకు అనిపిస్తుంది.

పల్లెజీవితం, పట్టణజీవితం, పల్లెల్లో పట్టుదలల, మూఢనమ్మకాలస్వైరవిహారం, పట్టణంలో క్లబ్బుజీవితం స్త్రీపురుష సంబంధ నైతికశైథిల్యం--రెండు విధాలా పదును తేలింది రచన.

సాంఘిక దురాచారాల వల్ల సమాజం పొందిన వొత్తిడి, ఆ శిథిలత్వంనుంచి నూత్నంగా ఆవిర్భవిస్తున్న క్రొత్త పరిణామాలు అర్థశతాబ్దం పూర్వం ఉన్న తెనుగు సమాజం—వితంతు వివాహం ప్రోత్సహిస్తున్న దశ వంటివి అనేకం ఈ నవలలో ప్రపంచింపబడ్డాయి.

రాజకీయంగా భారతదేశంలో పరిణామాలు, గాంధీప్రయత్నం, జనంలో సంచలనం, ఎక్కడో ఉన్న జర్మనీ, ఇక్కడ 'ఆమె' జీవితంలో తెచ్చిన కల్లోలం—రచయిత చారిత్రక దృష్టికీ దేశభక్తికీ, మానవత్వ దృష్టికి కాంతిమంత శక్తికి నిరూపణలుగా వున్నాయి.

భారతదేశంలో ఆధ్యాత్మిక స్థాయి చేరుకొన్న దశ, అది అందుకోవటానికి మానవుడి యత్నం, క్రైస్తవ మిషనరీలు తెలుగుదేశంలో భారతదేశంలో చేసిన సాంఘిక సేవ, రచయిత వాస్తవిక దృష్టితో చేసిన ఈ నవలలో గోచరిస్తాయి.

ఈ నవలలో బహువిషయాలు, లోతుల్లోకి పోయి పరిశీలించిన దృష్టి, వానిని ప్రపంచించిన తీరు ప్రశంసాపాత్రాలు!

ఆమె రత్నంతో పొందిన అనుభవం చిత్ర కళలో 'అమరావతి'గా రూపొందింది. కిరీటితోనూ అంతే! చిత్రకళాభివృద్ధికి తోడ్పడింది.

చెప్పరాని సంగతులు చెప్పవలసిన సమయంలో రచయిత చూపిన మెలికలు చూచి తీర వలసిందే. అంః సంగతి చెప్పకుండా చెప్పటం ఎంతో నేర్పుతో కూడినపని.

మద్రాసు మహానగరంలో ఆమె ప్రవర్తన, రాముడుతో ఆమె మాట్లాడేతీరు, శ్రీ చలం 'దైవమిచ్చిన భార్య' ప్రధానంగా, ఇతర రచనలు అప్రధానంగా స్ఫురింపజేస్తాయి.

రక్తినుంచి విరక్తి ప్రాంగణంలో కాలు పెట్టే ఆమె జీవితం గోపీచంద్ 'మెరుపుల మరకలు'లో ఉషారాణి జీవితం గుర్తుకు వచ్చేట్లు చేస్తుంది.

ఆమె ఆదినుంచి అనంతంగా చిత్రింపబడిన తీరు, సమాజం వొత్తిడికి వొంగి, తలెత్తిచూచి, ముందుకుపోగి, ఒకవిధంగా ఫేట్‌కు తలవొగ్గుతూ, నిరంతరంగా అన్వేషించేతీరు థామస్‌హార్డీ నవలల్లో టెస్ ఆఫ్ డర్బ్యావిల్ గుర్తుకు వచ్చేట్లు చేస్తుంది.

అంతమాత్రాన ఈ రచన పై రచనలకు అనుసరణఅనిగానీ, అనుకరణఅనిగానీ అనటంలేదు ఆ స్థాయిలో రచన జరిగిందనే స్ఫురణ కలిగించటమే ఉద్దిష్టం!

సంస్కారవంతుడు, అనుభవశాలి, ఆలోచనా పరుడు సంఘజీవితక్రాంతదర్శనంకలవ్యక్తి కలం నుంచి నవల వెలువడితే ఎలా వుంటుందో చూడదలచిన పాఠకులకు ఈ నవల ఉదాహరణ! మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే నవల!

పునర్ముద్రణల విషయం అటుంచి, చారిత్రకేతివృత్తంవున్న రచనలమాట దూరంగావుంచి, ఎమెస్కో సంస్థ ప్రచురించిన సాంఘిక నవలల్లో అత్యుత్తమమయిన నవలలు నాలుగు చెప్పమంటే, ఈ నవలపేరు నిరభ్యంతరంగా చెప్పవచ్చు.

ఇద్దరం ఒకటే

(రచన: శ్రీ వీరాజీ; ప్రచురణ: ఎం. శేషాచలం అండ్ కంపెనీ; మద్రాసు, మచిలీపట్నం, సికింద్రాబాదు. వెల: రు. 2—00.)

యవ్వనం సంఘ జీవితంలో ఒక వింత ఘట్టం! యవ్వనం రానివాళ్ళు దాన్ని అందుకోటానికి పడే తొందర, దాన్ని పోగొట్టుకొన్నవాళ్ళు పడే తపనచూస్తే సంఘం యవ్వనం కేంద్రం మీద తిరుగుతున్న రంగులరాట్నం అనిపిస్తుంది.

యవ్వనం, తద్భావన మనిషిచేత ఎన్ని పనులో చేయిస్తుంది. నదీ ప్రవాహం వొడ్డున కూర్చుని చూచేవాళ్ళకు ఎంత ఆనందమయినా కలిగించినట్లే యవ్వనం పోతున్న పోకళ్ళు పరికిస్తుంటే పరమానందంగా వుంటుంది.

ఈ నవల యవ్వనం మూర్తి కట్టిన అక్షర రూపం. సంఘ జీవితంలో చరించే యవ్వనం చూచి జనం పొందే తృప్తి ఈ నవల చదివి పాఠకులు పొందుతారు.

మంజుల విద్యార్థిని. మనోహరమూర్తి లెక్చరరు. క్రొత్తగా ఉద్యోగంలో చేరిన మూర్తి యువకుడు. పాతగా నాలుగేళ్ళనుంచి విద్యార్థినిగా ఉన్న మంజుల యువతి. యువతీ యువకులు చూచుకొంటారు. ఎవరో సువర్ణలు పరిచయం చేస్తారు. పిక్‌నిక్‌లకు పోతారు. గోడలమీది కెక్కుతారు. బాధపడతారు. పెళ్లి ఆలోచన వస్తుంది. కథ గుంటూరునుంచి విశాఖపట్టణం పోతుంది. ఘోరమయిన చిక్కు క్లైమాక్స్ వస్తుంది. యువత జయిస్తుంది. లేదంటే యువతి జయిస్తుంది.

'చచ్చినచావు'లో పల్లెజనజీవితం ఉద్ధరిద్దామనుకొన్న రాజా పొందిన మరణం వస్తువు. పల్లె వాతావరణం, ప్రజల తొందరపాటు మంచిచెడ్డలు ప్రతిబింబించిన కథ.

చేతులకుర్చీ మనిషిలోని అహంకారానికి నిదర్శనం. దాన్ని విరక్కొట్టటంలో దాక్కున్న రహస్యం అహంకారం దెబ్బతినటం. ఆలంబనం లేకపోవటం. ఒక విధమయిన మానసిక పరిశోధనతో కూడుకొన్న కథ.

'అంతర్వాహిని'లో 'కోటి'ని జనం కసిలేకుండానే సరదాగా వర్షంలో హింసిస్తారు. కోటికి హోటల్లో తినిపించటంకూడా హింసే! దిక్కులేంది అందరికీ మరదలయినట్లుంది కోటిబ్రతుకు. మనిషిలోని కర్కశత్వం ఎలా చెలగాటం ఆడుతుందో తెలిపే కథ. కథ చదివాక హృదయం బాధతో మూలుగుతుంది.

'రోజూ ఉదయిస్తాడు సూర్యుడు'లో 'సావుకారు' ఆరోగ్యం కోల్పోయి పొందేబాధ చిత్రింపబడింది. అనుభూతి ప్రదర్శించిన కథ. ఇరవై సంవత్సరాల క్రితం డ్రైవరు ఆప్పైన ఎలా అంతటి సావుకారు అయ్యాడో రచయిత తెలుపలేదు. సాధువుల మంత్రాలకు చింతకాయలు రాలుతాయని సావుకారు నమ్మినా చింతలేదు కానీ, నమ్మమని రచయిత పాఠకులను అడగటం ఏం సబబు?

'కుంకుమ' కోల్పోయిన అక్కను రక్షిద్దామనుకొన్న తమ్ముడు ప్రయత్నం అంగీకరింపదగింది. న్యాయం. సుధాకర్రావు ఏదో ఒరగ బెడతాడనుకొంటే అలా తప్పించుకోవటం బాగాలేదు. ముగింపు ముచ్చటగావుంది. అయితే ప్రయత్నం ఉందిగనుక మేలు ఎప్పటికయినా జరుగుతుంది.

'హద్దులు' కొడుకు—తల్లిదండ్రులను కుటుంబాన్ని అవసరమయితే ఎందుకు పోషించాలి బ్రతికించాలి! జంతుజాలం ఆ పని చేయదుగదా! కుటుంబవ్యవస్థనుగూర్చిన ఆలోచన.

'కుటుంబం'లో సామాజికవ్యవస్థలేని జీవితం కుక్కలది. సంఘంలో తిరుగుతున్న ప్రాణులు మానవులు. వ్యవస్థా రాహిత్యంలో నీతినియమాలులేవు. వ్యవస్థలో ఉన్నాయి. కుక్కలకు కుటుంబం కల్పించి అనుభూతిచెందే ఆత్మ స్త్రీది. మానవుల్లో ధర్మభిన్నంగా ప్రవర్తించే శరీరం పురుషుడిది. ఆలోచింపచేసే కథ.

'కాటేసిన సిరి' బీదతనపు పరాకాష్ఠ. వరదవచ్చి గతించిపోయింది పద్మ. పద్మలాగా ఆత్మకు దగ్గరగా, జానకిలాగా నగలకు ఆకరంగా ఉన్న శవం సత్యం రక్షిద్దామనే దృష్టి లేకపోతే నదిలో కొట్టుకుపోయి వుండేది. వయస్సూ బీదతవమూ ఉన్న సత్యం, వయస్సూ, నగలూ ఉన్న శవాన్ని ఆ విధంగా చూడటంలో వింతలేదు. మానవత్వానికీ ధనాభావానికి సంఘర్షణ చూపే కథ 'కాటేసిన సిరి'.

'జీవిత పరమార్థం' వింతయిన కథ. ఒక రచయిత ఆత్మవ్యథవంటి దీ కథ. అందులో అతను చేయాలనుకొన్నవన్నీ హర్షింపదగ్గవికావు. ఒక శవం నోట్స్‌లోంచి మరొక రచయిత ఉదయించటం నిజమే అవుతుంది కాబోలు. గుండె జబ్బుతో గతించిన రచయిత నోట్స్‌లో ఉన్న ఒక కథ సూచన 'రోజూ ఉదయిస్తాడు సూర్యుడు'లో కథే అయింది. రావు ఉన్నతిమాచి ఆనందించాలా? 'శివం' జీవితం చూచి బాధపడాలా? సందిగ్ధంగా ఉంది కథ.

ఈ రచయితకు పల్లెవాతావరణం చక్కగా చిత్రించే సామర్థ్యం ఉంది. మనస్తత్వ పరిశీలన ప్రయత్నం ఉంది. కథలు చదివింపజేస్తాయి.

అయితే కథలో ఉన్న బలంకంటే, అవసరమయిన దానికంటే అధికంగా, వేగంగా దూకుడుగా,

ప్రేమ లోకాన్నిత్రుణీకరింపగల, లేదంటే జయింపగల ఒక మహోన్నత శక్తి. దాన్ని అప్పుడప్పుడూ అగౌరవపరచే కొన్ని నియమాలు మనం సమాజంలో సృష్టించుకొన్నాము. దాని సృష్టికర్తలు పడిన బాధ లేమిటో తెలియపుగానీ, తదనంతర తరాలు వాటి రుచిమాచి బేజారెత్తిపోతాయి. ఆ నియమాలలో కులం, మతం, డబ్బు, అంతస్తు, కొంతవరకు బలం సంపాదించుకున్నాయి.

ఈ నవలలో డబ్బు అంతస్తు ఇద్దరు కోమల హృదయులమధ్య తలెత్తి వెర్రిగంగర్లు ఎత్తిస్తుంది. మంజుల బీదింటి అమ్మాయి. మనోహరమూర్తి ఉన్నింటి అబ్బాయి. డబ్బు సృష్టించిన బీదతనం. దాని మూలంగా తరిగిన పెరిగిన అంతస్తులు, అంతస్తులు అన్నులు మధ్య దుప్పటికప్పుకొని గుర్రుపెట్టి నిద్రపోయే గుణం కొంద్దరికయినా వుంటుంది. తెలిసో తెలియకో హృదయం ఉన్న మనోహరమూర్తి ఆ వైపుమొగ్గుతుంటే ప్రేమించిన హృదయం బావురుమంటుంది.

ఆడపిల్లల అల్లరికీ, ఒంటరిగావుంటే వాళ్ళుపోయే వయ్యారాలకీ ఈ నవలలో స్థానం వుంది. మంజుల, జానకి — వీళ్ళిద్దరిమధ్యఉన్న ఆత్మీయతా అనుబంధం ప్రేమ జీవించినంతగా నవలలో ఏ అనుబంధమూ, ఆత్మీయతా, ప్రేమా కలసి జీవించలేదు. జానకి హృధయం ఉన్నతమూ, విశాలమూ, కోమలమూ. ఒక్కమాటలో జానకి పిచ్చిది. ప్రేమించటంతప్ప మరేమీ తెలియంది.

పాత్రలు చాలా వున్నాయి. పసివి కొన్ని అప్పుడే యౌవన ప్రాంగణంలో కాలుపెడుతున్నవి కొన్ని. అన్నీనీ బాల్యం వదిలి బైటపడలేదు. పసితనం వదల్లేదు.

కథ గుంటూరులోనే ఆగిపోవచ్చు. విశాఖపట్టణందాకా సాగనక్కరలేదు. అక్కడ వచ్చిన విపూత్న పరిణామం ఏదయినావుంటే — సినీమా వగైరా — గుంటూరులోనే వచ్చివుండవచ్చు.

గుంటూరులో కో ఎడ్యుకేషన్ ఉన్న బి. ఏ.— బి. యస్సీ లున్న కాలేజి ఒక్కటే! అక్కడ ఏ సబ్జక్టులోనూ అసిస్టెంటు లెక్చరరు ఉద్యోగం లేదు. లేని ఉద్యోగం మూర్తి కెవరిస్తారు? బెజవాడ కాలేజీ మనస్సులో ఉంచుకొని గుంటూరు వాతావరణం ఎన్నుకొన్నట్టుంది రచయిత.

మధురిమ చలాకీ అయిన అమ్మాయి. పాఠకులీ పాత్ర మర్చిపోలేరు. నవల చివరిలో మధురిమ ఏమయిందా అని ఆలోచిస్తారు పాఠకులు. విశాఖపట్టణం బీచ్‌లోనో, యూనివర్సిటీ లైబ్రరీలోనో, సినీమా హాలులోనో, హాస్టల్లోనో ఉంటుం దనిపిస్తుంది.

రచన, శైలి, భాష నవలకు తగినట్టుగా ఉండి, అభివృద్ధి పథంలో గోచరిస్తున్నాయి.

'ఇద్దరం ఒకటే'లో ఏడక్షరాలున్నాయని రచయిత అభిప్రాయం.

యౌవన దీప్తితో విలసిల్లే ఈ నవల అందరూ చదవదగింది. యువతీ యువకులు అవశ్యం.

మంచు పల్లకి - మరి తొమ్మిది

(రచన : శ్రీ శ్రీపతి, ప్రచురణ ఎం. శేషాచలం అండ్ కంపెనీ, మద్రాసు, మచిలీపట్నం, సికింద్రాబాదు. వెల : 2-00 రు.)

'మంచుపల్లకి' హైస్కూలు మాష్టరు, విద్యార్థి బుల్లి మధ్య హృదయబంధం కలిగించే బుల్లి తల్లి బస్తీఆస్పత్రిలోవున్నసంగతి, పల్లెబస్ స్టాప్‌లో తెలిపే కథ.

చిన్నవాడికి బాధ్యతలు ఎక్కువయిపోతే కలిగే పరిణామాలు, చిన్నతనంలో తల్లిపోయి పెద్దవాడయి లోకంచూచి జడుసుకొన్న మాష్టరు బుల్లిని చూచి పొందిన అనుభూతి హృదయం కదిలించేలా తెలుపుతుందీ కథ.

భాష, రచనా చెట్టాపట్టాలు పట్టుకొని సాగి పోతాయి. చిన్నపిల్లవాడివంటి కథకు వృద్ధుడి లాల్చీవంటి భాష తొడిగితే ఎలా వుంటుందో, అలా కొన్ని తావుల్లో భాష బరువు ఎక్కువయింది.

కథ సాఫీగా సాగక అక్కడక్కడా అతుకులు వేసినట్లుగా ఉంటుంది. ఇంత స్పష్టంగా లక్ష్యం వైపు రచన చేసుకొంటూ పోగల రచయితకు అతుకు లతుకులుగా కథ నడపవలసిన అవసరం, పరిస్థితి ఎందుకు కలిగాయో తెలియదు.

కొన్ని కథల పేర్లు, ఇతివృత్తాలు ఎక్కడో చూచినట్లుగా, చదివినట్లుగా అనిపించటం పాఠకు లకు అవగతం అవుతుంది.

ఎందుకిటువంటి పరిస్థితి ఏర్పడుతుంది? శైలిలో కొంతవరకు, ఆలోచనలో మరికొంతవరకు రచయిత ప్రసిద్ధులయిన ఇతరేతరాంధ్ర రచయిత లను అనుసరించటంవల్ల కావచ్చు. హృదయబలం రచనాసామర్థ్యం ఉన్న ఈ రచయిత, సమాజ జీవితంమీద ఒక దృక్పథం ఉన్న ఈ రచయిత అనుకరించటం మానుకొంటే మరింత మంచి రచనలు వెలువడుతాయని అనిపిస్తుంది.

ఈ సంపుటిలోని ఈ కథలలో నాలుగయిదు నలుగురకూ కొంతకాలంవాకా గుర్తుండేటట్లుగా పటిష్ఠంగా రూపొందాయి. మరింత మంచి రచనలు శ్రీ శ్రీపతి కలంనుంచి వెలువడుతాయని పాఠకులు ఆశింపవచ్చు.

సంఘం చేసిన మనిషి

(రచన : శ్రీ పోల్కాప్రగడ; ప్రచురణ : యం. శేషా చలం అండ్ కంపెనీ, మద్రాసు; మచిలీపట్టణం; సికింద్రాబాదు; వెల : 2–00 రు.)

సాంఘిక వ్యవస్థలో స్వాతంత్ర్యానంతరం వచ్చిన పరిణామం కొంతలోకొంత పరిశీలించే దృష్టితో వ్రాయబడింది ఈ నవల

రాజకీయ వాతావరణం అగ్రంనుంచి అధో భాగంవరకు ఎంత కలుషితమయిపోయిందో కొంత వరకు చూపటానికి ప్రయత్నిస్తుంది ఈ నవల.

పల్లెల్లో పదవుల తాపత్రయం, కీర్తి కాంక్ష తన్మాహం ఎంతగా దహిస్తుందో, ఎన్ని రూపాలు ధరిస్తుందో ఈ నవలలో పరికింపటానికి వీలవుతుంది.

చిట్టిబాబు చిన్నతనంలో పొట్టిమొద్దు! అమాయకుడు. మంచితనం ముడిసరకుగా రూపొందిన వ్యక్తి.

సంఘంలో మెదలటం క్రమక్రమంగా నేర్చుకోసాగాడు. దాంతో ఎంతో లౌకికుడు కార్య దక్షుడు అయిపోయాడు.

తనకు తెలియకుండానే అంతర్ముఖుడయిన చిట్టిబాబు లోకంలోకి రావటానికి బాగా ఉపయోగ పడిన సంఘటనలు రెండు. అవకాశం ఒకటి.

తెలుగు మాష్టరు, పరీక్షపేపర్లుకట్ట తారుమారు వ్యవహారంలో వాళ్ళమండి, ఆ మంట చిట్టిబాబుకింత అంటగట్టబోయినప్పుడు ఏదో వెర్రి ఆవేశంలో తెలిసీ తెలియని తొందరలో చిట్టి బాబు తిరగబడ్డాడో లేదో తెలియకుండా తెలుగు మాష్టరు గూబగుయ్యమనిపించకపోతే చిట్టి బాబు విద్యార్థి నాయకుడయ్యేవాడు కాడు.

ఎగ్రికల్చరల్ ఆఫీసులో స్టోరు కీపరుగా చేరి ఒక రోజు రెండువేల అయిదువందలు, డిమాన్ స్ట్రేటరు అడిగితే, అమాయకంగా ఇచ్చాడు, లంచాలు తీసుకోని చిట్టిబాబు. డి. ఏ. ఓ. తనిఖీ చేయటానికివచ్చి ఆ మొత్తం లోటు పడ్డట్లు తెలుసుకొని, చిట్టిబాబును ఉద్యోగంలోంచి తీసి వేస్తే నిరుద్యోగి అయ్యాడు.

ఈ రెండు సంఘటనలు చిట్టిబాబులో విప రీత పరిణామం తెచ్చాయి. అతను లోకాన్ని రెండు కళ్ళతో జాగ్రత్తగా నిశితంగా చూడసాగాడు.

వెంకటలక్ష్మిమీద ప్రేమపుట్టిన చిట్టిబాబు గంగరాజును చూచి బేజారెత్తి సర్వలక్ష్మమ్మతో ప్రయాణంచేసి, పరాత్పరరావుతో మెట్రిక్ పాసయ్యే స్టోరుకీపరు ఉద్యోగంపొందే సహాయాలు స్వీకరించి, కల్పవల్లికి భర్తయి రాటుదేలాడు.

ఈ అవకాశం రాకుండావుంటే, పరాత్పరరావుదగ్గర ట్రయినింగ్‌కాకపోయివుంటే, చిట్టిబాబు జీవితం ఏంమలుపుతిరిగేదో చెప్పటం కష్టమే!

సొంతవూరు వచ్చాడు. సుబ్బాయమ్మ గతించింది. ఆస్తికి హక్కుదారుడయ్యాడు. వ్యవసాయం ప్రారంభించాడు. కాలవనీరు తెప్పించాడు. వెంకటలక్ష్మి ప్రేమ మారగొన్నాడు. ఎరువుల వ్యాపారం పెట్టాడు. రూరలుబ్యాంకు పెట్టించాడు. కోఆపరేటివ్‌స్టోర్స్ ఏర్పాటుచేయించాడు. పంచాయతీ ప్రసిడెంట్ అయ్యాడు. జీపు సంపాదించుకొన్నాడు.

ఇంత ముమ్మరమయిన రాజకీయ జీవితం, ఇల్లూ ఇల్లాలూ గుర్తురాకుండా చేసింది. ఇంటిదగ్గర కల్పవల్లి, ఈ రాజకీయాలు ఎప్పుడు తొలగిపోయి, మనిషి ఇంటిపట్టున ఉంటాడాఅని ఆశ పడసాగింది.

మళ్లీ ఎలక్షన్లు! చిట్టిబాబు పోటీ చేశాడు. ఓడిపోయాడు. ఇల్లు గుర్తుకు వచ్చింది. జీవితమార్గం తెలిసి వచ్చింది. పూర్వం మనిషి అయిపోయాడు. అదీ చిట్టిబాబు విజయం. కల్పవల్లి ఆనందించింది.

రాజకీయ వాతావరణంలో సమాజ జీవితం గూర్చి రచయిత్రకు సదభిప్రాయంలేదు. పామరుడు మొదలు మేధావివరకు చాలామంది కీ వాతావరణం అసహ్యంగా వుంది. దాన్ని పరిహసించినట్లుందొకో చోట. వ్యంగ్యత ధ్వనిస్తుంది.

కొన్ని తావుల్లో చిర్నవ్వూ, మరికొన్ని చోట్ల మరీ చక్కని నవ్వూ, కలిగించేటట్లు హాస్యంవుంది. ముఖంనిండా నాటకం రంగుతో, హరికేన్ లైటుతో హౌరా ఎక్స్‌ప్రెస్ ఎక్కికూర్చున్న చిట్టిబాబుకథ పొట్టచెక్కలయ్యేటట్లు నవ్విస్తుంది.

కక్కొచ్చినా కళ్యాణ మొచ్చినా ఆపటం కష్టం అంటారు. అలాగే అయింది చిట్టిబాబు విషయం. ఎంతో అయాచితంగా అభివృద్ధి వచ్చింది. పెళ్లి అయింది.

కాలేజీ విద్యార్థులు లెక్చరర్లమీద చేయి చేసుకోవటం వినబడుతుంది. కాని, హైస్కూలు విద్యార్థులు మాష్టర్లను కొట్టటం చాలా అరుదు.

చిట్టిబాబు చదువుకథ ఒకమాత్రం అసహజం! మెట్రిక్ పాసుకావటం మరీ వింత! ఉద్యోగం అంతకంటే!

అయిదు నిమిషాలు, మాటా పలుకూ లేకుండా చిట్టిబాబు రంగస్థలం దున్నేస్తుంటే వెర్రిగా చూస్తూవూరు కోవటానికి ప్రేక్షకులుగాని, నాటక దర్శకుడుగానీ వెర్రివాళ్లు కారు.

ఈ నవలలో చిట్టిబాబు అనేక కోణాల నుంచి దర్శింపబడ్డాడు, ప్రదర్శింపబడ్డాడు. మంచి పాత్రచిత్రీకరణ.

రచనలో భావవ్యక్తీకరణ, శైలి చట్టాపట్టాలు పట్టుకొని సాగాయి.

ప్రతి నవలా భాగానికి ఏదో పేరు పెట్టటం పాత పద్ధతి. ఈ మధ్య ఆ పద్ధతి తొలగిపోయింది. ఇందులో కనిపిస్తుంది. నవల పేరు, భాగాలపేర్లు మంచి ఆలోచన స్ఫోరకాలు.

చదవదగిన నవల.

సిపాయి కూతురు

(రచన: శ్రీ కొవ్వలి లక్ష్మీనరసింహారావు, ప్రచురణ: ఎం. శేషాచలం అండ్ కంపెనీ; మద్రాసు; మచిలీపట్నం; సికింద్రాబాదు. వెల: 2-00 రు.)

గ్రంథ విమర్శలు

ఇరవైఏళ్లపూర్వం ఆంధ్రదేశంలో ఎక్కడ చూచినా విచ్చలవిడిగా అమ్ముడుపోయిన పుస్తకాలు— నవలలు అనవచ్చు - వ్రాసిన వ్యక్తులలో శ్రీ కొవ్వలి స్థానం ప్రముఖమయింది. అరణాలు లేక అర్ధ రూపాయి వెలతో లెక్కలేనన్ని వ్రాసి ప్రచురించి, అమ్మించి కవిత్వం బాగా చదువుతున్న జనం దృష్టి నవలాపఠనంవైపు మళ్లించినవారిలో శ్రీ కొవ్వలిస్థానం విశిష్టమయింది!

ఇప్పుడు నవలలు వ్రాసేవాళ్లు ప్రచురించే వాళ్లు శ్రీ కొవ్వలి, శ్రీ జంపన నాటినమొక్కలు పెరిగి పెద్దవై కాపుకొస్తే ఆ పళ్లు కోసుకొంటున్నవాళ్లు! అంతకుముందు మంచినవలలు వచ్చివుండవచ్చు. కాని నవలాసాహిత్యం జనసామాన్యంలోకి తెచ్చి ప్రచారం చేసినవాళ్లను మరచిపోవటం సాహిత్య చరిత్రకారులకు న్యాయమవుతుందా?

ఈ నవలలో ఇతివృత్తం కొంతలోకొంత చారిత్రకంగా కనిపిస్తుంది. అయితే కచ్చితమయిన చారిత్రకాధారాలు చెప్పటానికి వీలులేకపోవటంచేత జానపదంగా అనుకోవచ్చు.

ఈ నవలలో ఒక స్త్రీ ప్రదర్శించిన అసమాననైపుణి సగౌరవంగా స్వీకరించదగింది. భారతదేశ చరిత్రలో స్త్రీలు ప్రదర్శించిన శౌర్యం ధైర్యం పరాక్రమం వేనోళ్ల కొనియాడదగ్గవి.

'పన్నా' వీరవనిత. ఆమె చారిత్రక పాత్ర కాదు. చరిత్రలో లభ్యమయ్యే స్త్రీలు చూపిన ధైర్యసాహసాలు క్రోడీకరించి ఒక పాత్రకల్పిస్తే శ్రీ కొవ్వలి కలంలో 'పన్నా' అయింది.

పన్నా సిపాయి కూతురు. బీదతనంలో బ్రతికింది. తండ్రికి అన్యాయం జరిగింది. తనకు అవమానం జరిగింది. ఆవేశంలో కామోజీని చంపింది. తండ్రితో పారిపోయింది. కొల్లేరులో కళ్యాణి (నమ్మినబంటు వంటి గుర్రం)తో సహా పడి బ్రతికింది. బంధువుల ఇల్లుచేరుకొంది. మగవాళ్ల దుస్తులు సంపాదించింది. సూరికొండకు వచ్చింది. హత్యలు లేకుండా దోపిడీలు చేసింది. మల్లుగా మారింది. తిండిలేని వాళ్లకు తిండిపెట్టింది, అవసరాలలో ఉన్నవాళ్లను ఆదుకొంది. (రాబిన్ హుడ్ కథ గుర్తుకు వస్తుంది). రాజ్యం దుష్టుల చేతుల్లో పడకుండా కాపాడింది. యువరాజు మన్నన పొందింది. క్షమింపబడింది. యువరాణి అయింది. ఇదీ ఆమె పాత్ర.

యువరాజు— కుమారరాజా— సుందరకుమార్ పన్నాను ప్రేమించాడు. సింహాసనం తిరస్కరించాడు. ఇటువంటి కథలు ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతిలో అక్కడక్కడా గోచరమవుతాయి.

రాజు ఆధ్యాత్మిక చింతనలో రాజ్యపాలనం మంత్రికి అప్పజెప్పాడు. మంత్రి మహామంత్రియై, సేనాధిపతియై, మహాప్రభువుగామారి, దేశానికి మహమ్మారిలా తయారయిపోయాడు. తోడుదుష్టుడు కోశాధిపతి. మరేం! ధనాగారం కొల్లగొట్టారు.

ఈ నవల ముఖ్యగుణం—రచన చదువుతున్న కొద్దీ, పేజీ గడుస్తున్నకొద్దీ యౌవనంలోవున్న, విలువిద్యవచ్చిన, గుర్రపుస్వారి నేర్చిన, ఖడ్గవిద్య తెలిసిన పన్నాకు ఎప్పుడేమవుతుందోనన్న ఉత్సుకత రేకుత్తుతూ వుంటుంది; భయసంభ్రమాలు కలుగుతూ వుంటాయి.

రచనలో అనవసర కథాభాగంకానీ, సన్నివేశంకానీ, పాత్రకానీ, వాక్యంగానీ లేవు. కవిత్వం నట్టింటినుంచి నవలా ప్రాంగణంలోకి సాహిత్యం లాక్కువస్తున్న తొలిదినాల జనసామాన్య నవలా రచయిత కావటంవల్లనేమో, అక్షరరమ్యత, కవితాగుణంకల వాక్యాలు ఈ నవలలో రచింపబడ్డాయి.

నవలఅంతా చక్కని కవితారేఖ స్ఫురిస్తూనే వుంటుంది.

గుర్రందగ్గర భరణి పన్నాల హాస్యం చిత్రంగా వుంది. అసహజాలు చూడదలిస్తే చాలా కనిపించవచ్చుగానీ, ఇటువంటి నవలల్లో అటువంటి యత్నం వృథాప్రయత్నం! మగవేషం వేసుకొన్నంతమాత్రాన ఇతరులెవరూ పన్నాను ఆడమనిషిఅని గుర్తించలేరా? గుర్తిస్తారు! అయితే పాఠకులు

పన్నాశత్రువులు ఎవరూ గుర్తించకపోతే బావుణ్ణు అనుకొంటూనే నవల చదువుతారు.

ఈ నవల ఏకాలంలో జరిగిందో చెప్పటం కష్టం. అంతగా అవసరంకూడా కాదు. కనీసం తెల్లవాళ్ళు ఈ దేశం రాకపూర్వంఅయినా ఎప్పుడో జరిగివుంటుందీకథ అని స్థూలంగా అనుకోవచ్చు కదా! అలా అనుకొన్నా కొన్నిఇబ్బందు లున్నాయి.

నాగరికత ఈ స్థితికి వచ్చిం తర్వాత సమాజంలో ఉపయోగింపబడే కొన్ని వస్తువులు పదాలు, పదార్థాలు, ఇంగ్లీషు మాటలు ఏ కాలం లోనో జరిగిందనుకొన్న ఈ నవలలోచూస్తే కష్టంగానే వుంటుంది. ఈ కాలం రచయితయినా, ఏ కాలంలో నవలలోనిఇతివృత్తం జరుగుతూ వుందో, ఆ కాలోచితభాషారచన చేయటం అవసరమేకదా!

వాస్తవికత మాట దూరంగావుంచి, కాలక్షేపంకోసం ఎవరయినా ఏమయినా చదవాలను కొంటే ఈ పుస్తకం చేతపట్టి చదివితే, మధ్యలో ఆపటం ఇష్టం ఉండదు. నవల ముగిసి పోవటం ఇష్టం ఉండదు. అయిపోతే అయిపోయిందే అని బాధగా వుంటుంది.

—మనోరాణి.

కొత్త ఇల్లు

(రచన: శ్రీ తాళ్ళూరు నాగేశ్వరరావు; ప్రచురణ: యం. శేషాచలం అండ్ కో; మద్రాసు; మచిలీపట్నం; సికింద్రాబాదు. వెల: 2-00 రు.)

ఒక స్వతంత్రమైన కథను కల్పించి నవలా రూపంలో వ్రాయటం కష్టం. కాని చేయితిరిగిన రచయితలకు నవలారచన కష్టమనిపించదు. ఊహ మెదలినప్పుడల్లా రచయిత ఒక నవల వ్రాసి లోకాని కందిస్తాడు. తెలుగులో నవలలు విపరీతంగా వస్తున్నాయి. ఆ నవలల తీరుతెన్నులు చూస్తే ఒకరకంగా కాన్పించటంలేదు. ఒకరు చరిత్రను ఆధారంచేసికొని నవల వ్రాస్తే మరియొకరు చారిత్రికవిషయానికే రాజీనామాచేసి తగుదునంటూ క్రొత్తచరిత్రను సృష్టిస్తారు. ఇకను సాంఘికనవలలు పరిశీలిస్తే విషయం విచిత్రంగా ఉంటుంది. ఇట్టి నవలల్లో ప్రేమ ప్రధానంగాఉండి ఆ ప్రేమవలన వియోగమో, సంయోగమో కలుగుతుంది. ఈ సంఘటన కనుకూలమైన ఉపసంఘటనలు సృష్టించి వానివలన పాత్రలు జీవితాన్ని భరింపలేక సమాజానికి ఎదురు తిరిగి తమ స్వతంత్రజీవితానికి నాంది పల్కటం, ఏవిధమైన దారీతెన్నూలేనిపాత్ర ఉన్నచోటనే ఉండి జీవితాన్ని గడపటం మొదలగునవి ఆయాపాత్రలకు ప్రాప్తించిన ఘటనలవలన రకరకములగు పరిస్థితు లేర్పడతాయి. నవలాకారులు సంస్కారాన్ని ఉపేక్షించి ఇంటినుంచి లేచిపోవునట్లు, సెక్సుపుస్తకాలు చదివించటం మొదలగునవి పాత్రల జీవితమున కల్పించుచున్నారు.

సమాజంలో జన్మించిన ప్రతిజీవి ఒక ధర్మానికి, ఒక ఆచారానికి కట్టుబడిఉండాలని అపేక్షిస్తాడు. పరిస్థితులు అనుకూలించినట్లయిన తన జీవితంలో అసంతృప్తి, అసహనంఅనేవి సామాన్యంగా ప్రాప్తించటానికి వీల్లేదు. కాని పరిస్థితులు అనుకూలించకపోతే ఏమిజరగాలో అది జరిగి తీరుతుంది. సరిగా ఇదేవిధంగా శ్రీ తాళ్ళూరినాగేశ్వరరావువ్రాసిన 'కొత్తయిల్లు'లోని పాత్రయైన ధర్మయ్య జీవితంలో జరిగింది. ధర్మయ్య పూర్వకాలపు మనిషి. మూఢ నమ్మకాలు ఎక్కువ. క్రొత్తదనం అంటే మోజు లేదు. పాతదనంలోనే క్రొత్తదనం చూడాలని నేర్పుతాడు. ఎదుటివారు ఆచరించినా ఆచరించకపోయినా తనమాటమాత్రం మార్చుకొనుటకు ఇష్టపడడు. తాను ఎంత సనాతనుడైనప్పటికి ధర్మము, అధర్మము దృష్టిపథంలో ఉంచుకొంటాడు. కాని వాటని గురించి తీవ్రంగా ఆలోచించి సంప్రదాయానికి మాత్రం వ్యతిరేకంగా ప్రవర్తించడు. ధర్మయ్య నీతి నిజాయితీలు గల పూర్వకాలపు మనిషి. ఇతని పుత్రుడు రఘురామయ్య నీతినిజాయితీలంటే చాల దూరంగా పోతాడు. చడీ చప్పుడు లేకుండ ఏకార్యమునైనను అవలీలగా సాధింపగలడు. ఇతడు ప్రాత

క్రొత్తలమధ్య నలిగిపోతాడు. ఎదుటి వ్యక్తికి మంచి చేయాలనే తలంపు ఏనాడు కలగలేదు. ఒక నాడు తన ఫ్యాక్టరీ కూలీలు అన్నం బాబూ అని పొట్టచేతబట్టి అడిగితే వారిని కసరి పొమ్మన్నాడు. వారిచేత కండలు పిండించి పని చేయించుకొని హాయిగా అనుభవించటం మాత్రం బాగా తెలుసు అతనికి. ఇంకా పైగా దానాలు ధర్మాలు చేయటం మొదలు పెడితే కోటప్ప కొండంత ఆస్తి కొవ్వొత్తిలాగా కరగిపోతుందనే సిద్ధాంతం రఘురామయ్యది. అందుకనే కడుపులుకొట్టి సంపాదించాడు దొంగ సొమ్ము. కోపరేటివ్ సేల్సు సొసైటీకి, పంచాయితీబోర్డుకు అధ్యక్ష పదవులు వెలగబెట్టి ప్రజలను మోసగించి డబ్బు సంపాదించాడు. తాను సంపాదించుకొనుటయేగాక తన సహచరుల జేబుల్లో కొంత డబ్బుపెట్టి వారి నోళ్లు కట్టివేసి తనకు బానిసలనుగా చేసికొన్నాడు. రఘురామయ్య ప్రజాక్షేమంకోరి ఫ్యాక్టరీ స్థాపించలేదు. తన స్వార్థం కోసం కూలీలను ఆటబొమ్మలుగా చేసికొని జీవించాడు. డబ్బు దోచుకొనటంలో తండ్రి, తల్లి, చెల్లి అనే తారతమ్యాన్ని పరిగణించడు. అతని విపరీత చేష్టలవలన తన కుటుంబానికి చెడుకాలం ప్రాప్తించింది. అతడు చివరకు గుండెజబ్బుతో పడిపోతాడు. కుమారుడైన దుర్గాప్రసాదు రక్షించి కాపాడుతాడు. రఘురామయ్య తను నమ్మిన సిద్ధాంతాలను తనే నిలుపుకొనలేక జీవితంలో ఓడిపోయాడు. కొత్తనీరువచ్చి పడుతుంటే పాతనీరు అందులో ఐక్యమై సహకరించాలనే పిరికితనాన్ని చూపి జీవితంలో రాజీపడతాడు. ఆ రాజీ తనను చవట దద్దమ్మలా తయారు చేసింది. అయితే ఒక మంచి పని చేశాడు. ఏమిటంటే తనుకట్టిన కొత్త యిల్లు కుమారుడికిచ్చి, అందులో తనబిడ్డచేత ఉచితంగా వైద్యం చేయించాడు. పెరుగుట విరుగుట కొరకేనని రఘురామయ్య జీవితం నిరూపిస్తుంది.

ఇకను తక్కిన పాత్రలు బయటగాలి కాశపడి ఎగిరిపోతాయి. ఆ సందర్భంలో ధర్మయ్య—సుందరమ్మ, రఘురామయ్య—సుభద్రమ్మ ఏమియు చేయలేరు. వసంతలక్ష్మి రఘురామయ్య కుమార్తె. యవ్వనంలోనే వైధవ్యం ప్రాప్తించటంచేత ఇంటిపట్టునే ఉన్నది. కాని మనసు వ్యభిచారమయింది. చలం నవలలు చదివి విపరీతమైన కోరికలు పెంచుకొన్నది. ఆమెయొక్క దీనస్థితిని రచయిత చెప్పినా కథ కనుగుణంగానే ఉన్నది కాని ఆమె సొగసుదనం గురించి చెప్పటం అనుచితంగా ఉన్నది. ఈ క్రింది వర్ణనచూస్తే అట్లానే అనిపిస్తుంది. 'మల్లెపువ్వులాంటి తెల్లని వాయిల్ చీరలో, జాకెట్టులో వసంతలక్ష్మి సహజసౌందర్య విశేషంతో కన్నులపండువు'గా ఉన్నదట. దీనివలన రచయిత వసంతలక్ష్మి భావిజీవితాన్ని ఉద్దేశించి చేశారేమో అనిపిస్తుంది. అయినా అట్టి వర్ణన అనవసరము. ఈమెలో మరొక విశేషమేమంటే చలం మైదానం, వాత్స్యాయన కామసూత్రాలు అంటే మహాప్రీతి. అంతేగాక చలం పుస్తకాలు చదివి ఇంటినుంచి లేచిపోవటం నేర్చుకొంటుంది. పుస్తకాలు చదివి లేచిపోవటమనేది పల్లెలలో జరుగుతుందా లేదా అనే విషయం రచయిత గమనింపక ఆమెను బయటకు వదలిపెట్టి ఇది నా సంస్కారదృష్టి అన్నట్లు ఆమె శీలాన్ని చిత్రించారు. వసంతలక్ష్మికి భర్త ఉన్నప్పుడుకంటే భర్త పోయినతరువాత కోరికలు బాగా పెరిగాయి. చివరకు వసంతలక్ష్మి జీవితం పచ్చగా చేశారు. విధవా పునర్వివాహంచేత రచయిత ఒక స్త్రీ జీవితాన్ని పునీతం చేశారు.

సుమతి, ధర్మయ్యసుందరమ్మల కూతురు బిడ్డ. సుమతితల్లి అన్నపూర్ణ. అభంశుభం తెలియదు పగలనక రాత్రిఅనక రెక్కలు ముక్కలు చేసికొని ధర్మయ్య ఇంటిలో ఒక పనిమనిషిలా పని చేస్తుంది. సుమతితండ్రి చనిపోయినతరువాత వారి మంచి చెడ్డలు, ఆస్తి ఆదాయ వ్యయాలన్నీ రఘురామయ్యే చూస్తాడు. సుమతి పట్నానికిపోయి చదువుతుంది. నాలుగుగోడలమధ్య ఉండటం ఆమెకేమాత్రం యిష్టం ఉండదు. ఎవరుచెప్పినా మాట వినదు. అన్నిట ఆమెకు స్వేచ్ఛ కావాలి. రాత్రు

లందు హోస్టలుకు ప్రొద్దుపోయివస్తుంది. ఎందు కింత ప్రొద్దుపోయివస్తావంటే తగనికోపం. ప్రణయానికి స్వేచ్ఛ లేకపోతే బ్రతకలేదు. అందుకనే అక్కడక్కడ తిరిగి తన ప్రియుడైన రాజబాబుతో ప్రణయం సాగించివస్తుంది. అదే ఆమెలో నవనాగరికత. అంత నవనాగరికత కల్గిన సుమతి ఒక రోజున తన ప్రియుని ప్రక్కే కూర్చొని సినిమా చూస్తుంది. కాని తనముందు దుర్గాప్రసాదు ఉన్నాడని గమనించదు. తరువాత అతడున్నట్లు గమనించి గతుక్కుమంటుంది. ఇది చూచి దుర్గాప్రసాదుకూడ తలవంచుకొంటాడు. ఆమెలో ధైర్యం, సాహసం రెండూ ఉన్నాయి. అవి ఉండటం చేతనే తన మామయ్యను తమ ఆస్తినిగురించి నిగ్గదీసి అడిగింది. అంతేగాక తమకు రావలిసిన డబ్బు తీసికొని తల్లిని వెంటబెట్టుకొని వెళ్లిపోయింది. ప్రేమించి రాజబాబును వివాహం చేసికొన్నది. సుమతికి అభ్యుదయదృష్టి ఉన్నప్పటికి అది వక్రించిన అభ్యుదయదృష్టి. ఎంతైనా పట్నంలో చదివిన గ్రామకుటుంబాల్లో ఈలాంటి యువతి ఉండటం చాల అసహజమే అనిపిస్తుంది

దుర్గాప్రసాద్ రఘురామయ్య పుత్రుడు. జాలిగుండె కలవాడు. తన మిత్రుని ఆరోగ్యంకోసం అహోరాత్రాలు కృషి చేశాడు. ఇతని జీవితాన్ని మిత్రుడు—మిత్రుని చెల్లెలు ఒకమలుపు త్రిప్పారు. బాధ వ్యథ అంటే అప్పుడు దుర్గాప్రసాదు గమనించాడు. దుర్గాప్రసాద్ అభ్యుదయవాది అయినను గొంతు చించుకొని బజారు కెక్కలేదు. సుమతిలా విశృంఖలంగా తిరగలేదు. మితంగా మాట్లాడి తన పని శాంతంగా ముగించుకొన్నాడు. తండ్రి తనను వివాహం చేసికొనమని చెప్పినప్పుడు 'నామిత్రుని చెల్లెలిని తప్ప ఇంకెవ్వరిని వివాహమాడ' నని జంకులేకుండ చెప్పాడు. అతడామెను ప్రేమించకనే పెళ్లి చేసికొన్నాడు. పెళ్లి చేసుకొన్న తరువాత ప్రేమ వారిలో అధికమయింది. అతని జీవితం చాల ప్రశాంతమైనది. చర్చలకు దిగడు. తన దారికి అడ్డు ఎవ్వరూ రాలేదు. వచ్చినా దానిని గూర్చి అంతగా పట్టించుకొనడు. దుర్గాప్రసాద్ చాల సౌమ్యుడు. కన్న తండ్రికి చాల సౌమ్యంగా హితబోధ చేసాడు. ఆ హితబోధలో ఒక విధమైన ఘాటుదనం కన్పిస్తుంది. 'గుండె జబ్బు చాల స్వల్పంగా వచ్చింది. ఇక మీదట ఆరోగ్యాన్ని గురించి చాల జాగ్రత్తగా ఉండాలి. సంపాదన మీద ఆపేక్షా, రాజకీయాలపైన ఆసక్తీ, లేనిపోని ఆలోచనలూ, ఉద్రేకాలు వీటికి స్వస్తి చెప్పి ప్రశాంతంగా నిర్విచారంగా బ్రతుకును గడపాలి.' ఈ మాటలు పైకి చాల మెత్తగా ఉన్నాయి. కాని దుర్గాప్రసాద్ దృష్టిలో తండ్రి ఏ విధంగా ఉన్నాడో అనేది స్పష్టంగా తెలుస్తుంది.

కొత్తఇల్లులోకి ప్రవేశింపకనే ధర్మయ్య పాతఇంటిలో చనిపోయాడు. నైతికంగా రఘురామయ్యకన్న ధర్మయ్య విజయాన్ని సాధించాడు. పాతదనాన్ని కాదని క్రొత్తదనంకోసం ప్రయత్నిస్తే అన్నీ అపశకునాలు, అపవాదులు ప్రాప్తించాయి. తండ్రిని వ్యతిరేకించి రఘురామయ్య చేసిన ప్రతి పని అతని కెదురు తిరిగింది. ధర్మయ్యకు మూఢ విశ్వాసాలున్నను తనకే విజయం కలిగింది. యథార్థంగా ధర్మయ్య, రఘురామయ్య వంటి మనుష్యులు గ్రామాల్లో ఉంటారు.

నవలలో గ్రామీణ వాతావరణాన్ని నాగేశ్వరరావుగారు బాగా చిత్రించారు. ముఠాలు, పార్టీలు, కరణం, మునసబుల పెత్తనం, పంచాయతీబోర్డు ప్రసిడెంటుగా ఉండి గ్రామాదాయాన్ని మ్రింగి ప్రజలకు మొండి చేతులు చూపించటం, ట్రస్టీలుగా ఉండి గుడిలోనున్న లింగాన్ని మ్రింగి భగవంతునికి మ్రొక్కటం, సొసైటీ లాలూచీ పనులు, మొదలగునవి కన్నులకు కట్టినట్లుగా రచయిత వివరించారు.

. రచయిత నవలలో పాత్రలచేత రెండు మూడు చోట్ల ఉపన్యాస మిప్పించారు. ఆ ఉపన్యాసం సాంఘిక పరిస్థితులపై గొడ్డలిపెట్టులా ఉన్నది. నవలంతా యిట్టి ఉపన్యాసాలు లేకపోవటం సంతోషింపదగిన విషయం. ఇక వర్ణన విషయంలో రచయిత అదేపనిగా వర్ణించారు. వర్ణన కంత

ప్రాముఖ్యం లేకపోయినా కథను ముందుకు నడిపించ వచ్చును. వర్ణన ఉన్నదంటే విసుగు పుట్టిస్తుంది. వీరు వివరించిన స్వాభిప్రాయాలు బాగున్నాయి. ఉదాహరణకు 'ద్రవ్యకాంక్ష ఓ వృక్షమైతే రాజకీయాలు అధికార వ్యామోహము దాని కొమ్మలు రెమ్మలనూ. ఆ వృక్షం ఆక్రమించుకొనే విస్తీర్ణాన్ని అంచనావేయటం కష్టం. ఆత్మవిశ్వాసమూ, ఆత్మ స్థైర్యమూ, ఆశాబంధమూ ఆ వృక్షానికి గాలి నీరు ఆహారము లాంటివి.'

శ్రీ నాగేశ్వరరావుగారు కొన్ని పదాలు వ్యవహారదూరమైన వానివి ఉపయోగించారు. తమ నవలలో తెలుగుదనంకోసం ఈ ప్రయోగం చేశారు. ఆ పదాలు పాఠకులను కంగారు పెట్టిస్తాయి. ఈ పదాలు చూడండి: ఉదుటారిపోయాడు, కమియారం, కంజాయింపు, కటాబటి, అంబటి, పెరపెరలు, దుమురారుగా దుసికిలబడ్డాడు, అజీలు. ఈ పదాల ప్రయోగంవలన నవలకేమీ ఆధిక్యం లేదు. అంతేకాదు. వీనివలన రచయిత సాధించిన దేమీ లేదు. మామూలుగా మనము ఉపయోగించు వానిని వీరు మరియొక రకంగా వాడారు. బరి తెగించావే అనే దానికి బరితెగిపోయావే, నానా యాగం—నానాయాగీ అని, తలదూర్చింది అనే మాటకు ముక్కుదూర్చిందని వ్రాశారు. ఇవి ఎబ్బెట్టుగా ఉన్నాయి. ఇవి గాక యింకా 'ఒంటికి కొత్తకారం పూసుకొన్నట్లు. పిందెవచ్చి పండును వెక్కిరించిందట, జాలిపేగుల గుండె, కుండలో ముఖందూర్చి మెల్లగా అన్నట్లు—ఇలాంటివి రచయిత వింత ధోరణినితప్ప మరేమీ తెలియజేయవు. క్రొత్తదనం చూపించాలని ఏవేవో పదాలు ఉపయోగించినందువలన ప్రయోజనం ఏమీ కలుగదు.

నవల మొత్తంమీద కాలక్షేపానికి బాగా పనికి వస్తుంది అయితే ధర్మయ్య నవల చదువుతున్నంత సేపూ మనకు గుర్తు ఉంటాడు. అతడు పాఠకుని మనస్సులో జీవిస్తాడు. కాని పాఠకులు అతని మనస్సులో జీవింపలేరు.

సత్యం శివం సుందరమ్

(రచన: డా. బి. పురుషోత్తం ప్రచురణ: గిరిజా ప్రచురణలు, గుంటూరు. వెల: రు. 3 లు.)

మానవుడు సుఖలాలసుడు. అలసట లేకుండా సుఖాలను పొందాలని అతని ఆశ. ఈ ఆశ దురాశగామారి, ఇతరులకు కష్టాన్ని కలిగించయినాసరే తాను సుఖం పొందాలనే దుష్టభావం మానవ హృదయంలో ప్రవేశించింది. ఈ అత్యాశ త్రివిక్రమునివలె విజృంభించినపుడు లోకం నరకం అవుతుంది. సన్మార్గవర్తనులు కొందరు మానవ హృదయాలను నీతిబోధలతో క్షాళనం చెయ్యాలని భావిస్తారు. నీతిలేని మానవులను సునీతులుగా, పునీతులుగా మార్చడానికి గ్రంథాలు వ్రాస్తారు కవులు.

నేడు విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి చెందుతున్నది. మానవుల మనస్తత్వాలు మారుతున్నాయి. ఈ తీవ్రమైన మార్పులకు యువకులు లోనవుతున్నారు. యువకులు ఉద్రేక స్వభావులు. ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువ. సత్యాన్ని తెలిసికొని ప్రవర్తించలేక పోతున్నారు. ఇట్టి యువకులను సన్మార్గానికి మరలించాలంటే రచయిత తనశక్తి నంత నుపయోగించి ముందుమార్గం వారికి చూపించాలి. 'సత్యం, శివం, సుందరమ్' అనే గ్రంథం ఈ ఉద్దేశంతోనే వ్రాయబడినట్లుగా అనిపిస్తున్నది.

ఈ గ్రంథానికి ఉపోద్ఘాతములు సంతరించిన వారు దీనిని రకరకములుగా పేర్కొన్నారు. కావ్యానుశాసనమని, సూక్తిముక్తావళని, పురుషోత్తమ గీతయని, సాహిత్యోపనిషత్తని మొదలగు పేరులతో పిలచినారు. దీనిలో వివరింపబడిన భావాలలో అత్యధికభాగం పూర్వ రచయితలు వివరించినవే. లోకధర్మాలను, కళాధర్మాలను వ్యక్తీకరించడానికి సరసమయిన ఛందస్సును ఎన్నుకొని గ్రంథాన్ని తీర్చారు. భావానికి తగ్గిన భాషవలెనె భావానికి ఉచితమయిన ఛందస్సును ఎన్నుకొనుట సొగసుగానున్నది. కవి తన రచనచే పాఠకుల దృష్టిని 'సత్యం శివం సుందరమ్' వైపుకు మరలించారు.

ముందుగా మనవి చేసినట్లు ఇందలి భావాలలో అనేకం సంస్కృత శ్లోకాలకు,

అరవింద, రవీంద్రుల వచనాలకు అనువాదమే. ఆ భావాలకు రమణీయాకృతిని యిచ్చి పద్యరూపంగా తయారు చేశారు శ్రీ పురుషోత్తంగారు. ఈ భావాలలో కొన్ని ప్రస్తుత పాఠకులకు కష్టం కలిగించేవి ఉన్నాయి. ఆ భావాలు పెద్దలవి అయినంతమాత్రమున గ్రుడ్డిగా అనుసరింపవలసిన అవసరం లేదు. ఆహ్లాదైకమయమూ, స్వతంత్రమూ, అయిన నవరసములతో గద్యపద్యాలు రెండూ ప్రకాశింపవచ్చు. పూర్వులు పద్యకావ్యాలవైపు మొగ్గుచూపారు. పురుషోత్తమకవి పద్యం వ్రాయడం పురాకృత పుణ్యమనీ, ఆంధ్రభాషకుగల సొగసు పద్యములందే కలదనీ రవీంద్రుని వాక్యాన్ని ఉదాహరించారు.

ఎన్ని పుటల గద్యమున్నైన పన్నవచ్చు
కాగితములు, కలమును గలిగియున్న
కాని గీతమొక్కటి వ్రాయగల్గినట్టి
రోజె ధన్యాహమని రవీంద్రుడు వచించె.

ఈ పద్యము గద్యరచయితల కవమానకరమైనట్టిది. రవీంద్రుడు వచించినది మనం ప్రమాణంగా అంగీకరింపనక్కరలేదు. 'గద్యం కవీనాం నికషం వదన్తి' అని ఆర్యోక్తి. ఈ ఆర్యుని పలుకులను తుడిచి వేసి రవీంద్రుని వాక్యానికే విలువ ఇయ్యవలయునా? కాదంబరి కావ్యము గద్య కావ్యమైనను ఎందరిని రసహృదయులుగా అలరించలేదు. నీరస కావ్యాలు గద్యంలో అయినా ఉండవచ్చు, పద్యంలో అయినా ఉండవచ్చు. కవిగారు పద్యమే కవిత్వం కాదని చెపుతారు.

వేనవేలుగ ననుభూతి విరహితులుగ
పద్యకారులు గారడీవారు గలరు
వట్టి గాలి దుమార మెప్పటికినైన
మలయమారుతమునకు సమాన మగునె

ఆధునికులు రచించుచున్న పద్యకావ్యాలను ప్రజలు ఆదరిస్తున్నారా అంటే చెప్పటం కష్టం. పద్య రచయితలకన్న గద్యరచయితలు ప్రజల దృష్టిని ఎక్కువగా ఆకర్షించుచున్నారు దీనిని గమనింపక కాగితము, కలము ఉంటే బండ్లకు బండ్లు గద్యసాహితిని సరఫరా చేయవచ్చునను కోవటం సమూహకాదు. మరొకచోట వారపత్రికల స్థాయికి జాతి చైతన్యం దిగజారిపోయిందని వాపోయారు. కథయొక్క ఉద్దేశం ఉపదేశమే అయితే ఆ ఉపదేశం గద్యంలోనైనా చేయవచ్చు. దుష్టబీజాలు వెదజల్లాలంటే వారపత్రిక లేమీ తోడ్పడలేదు. ఇట్టి బీజాలు శశాంక విజయము, అహల్యాసంక్రందనం మొదలగునవి వెదజల్లాయి. ఇవి యిచ్చిన సందేశాలేమియు లేవు. కనుక వారపత్రికలను విమర్శించే స్వభావాన్ని మార్చుకోవాలి.

పురుషోత్తంగారు విచిత్రమైన అంశాన్ని వివరించారు. ఒకటి.

కాంత సొగసుగ్రోల కాంతుడే యర్హుండు
కాడు తండ్రి కన్నవాడె యయిన
అట్లె కావ్య కాంత యందమనుభవింప
సహృదయునకె చనును, చనదు కవికి

ఇందులో కావ్య కాంత అందం అనుభవించటానికి కవి తగడని, సహృదయుడు మాత్రమే అర్హుడని నిర్ణయించారు. ముందు కవి అనుభవించిన పిదపనే సహృదయుడు అనుభవిస్తాడు. కవి అనుభవించనిదే సహృదయుడు అనుభవింపడు. కనుక రచయిత చెప్పినది అంగీకారయోగ్యంగా కాన్పించుటలేదు.

రచయితకు ఆంధ్రదేశంపైనా, ఆంధ్రజాతిపైనా గాఢాభిమానం ఉన్నది. ఎన్ని సంస్కృత గ్రంథాలు పఠించినా ఆంగ్ల గ్రంథాలను అవలోడనం చేసినా మాతృభాషయే భావవ్యక్తీకరణకు తగిన భాషయని వారు భావిస్తున్నారు.

మాతృభాషలోనె వరౌలిక భావన
అభ్యుదయము సాధ్యమగును గాని
అన్య భాషబట్టి ధన్యత గఢియింప
గా తరంబె సృష్టికర్తకైన

మాతృభాషలో భారతభాగవతాలవంటి అనువాదం రామాయణానికిరాలేదని వారికి బాధ. నిజంగా కవిత్రయ భారతము, పోతనభాగవతమువలె రామాయణ రచన రాలేదు. భవిష్యత్తులో అట్టి రచన

రావచ్చుననే ఆశతో జీవించటంకంటె వేరే గత్యంతరం లేదు.

కావ్యాంతమున కావ్యనామధేయమగు 'సత్యం శివం సుందరమ్'ను వివరించారు. అవి అచ్యుత, శివ, బ్రహ్మలకు, రామాయణ భారత, భాగవతాలకు శ్రీరామసీత, ఆంజనేయులకు, వాల్మీకి, వ్యాస, కాళిదాసులకూ, గాంధి, అరవింద, రవీంద్రులకు, తల్లిదండ్రి, గురువులకు ప్రతీకలగా వర్ణించారు నిజానికి ఈ సత్యశివసుందరములు లోకమే'నని

'అరయసత్యమ్మె—శివసుందరమగును
సుందరమునె – సత్యము శివమందురార్యు
లిట్లె శివము—సుందరము, సత్యమ్మగాగ
సత్యశివసుందరములు నిజాని కొకటె

వివరించారు. మనసు సత్యభావమయమై కర్మశివమయముగా వాక్కు సుందరమయంగా భాసించినపుడె మానవుడు మాననీయుడు కాగలడని గ్రంథమును ముగించినారు.

ప్రపంచాన్ని సత్యమార్గంవైపు నడిపి శివసుందరముగా మార్చాలనుకొన్న కవి ఉద్దేశం ఈ రచనవల్ల నెరవేరింది. 'సత్యం శివం సుందరమ్' అనుదానికి అట్టమీద బొమ్మ అలంకారంగానే ఉన్నది. అయితే పుస్తకంలో ఇంక కొన్ని చిత్రాలున్నాయి. ఆ చిత్రాలు ఏభావాన్ని అపేక్షించి ప్రవేశపెట్టారో గ్రంథకర్తకే తెలియాలి. అచ్చుతప్పులు విషయంలో కొంచెం శ్రద్ధ వహించాలి. నీతివాక్యాలను, నగ్నసత్యాలను ధారాళంగా సాగిపోయే శైలిలో రచించారు కవి. ఇందులోని సత్యాలు యువకులేకాదు. అసత్తునుండి సత్తునకు, తమస్సునుండి కాంతివైపుకు పయనించేవారు దీనిని తప్పక చదవాలి.

—రామమోహన్.

సుహృద్గీత

(రచయిత: నరేంద్రచంద్; ప్రతులకు: జి. నరేంద్రచంద్, రాఘవచంద్రరావుపేట, ఏలూరు, ప. గో. జిల్లా. వెల: 2—00 రు.)

'సాహిత్యప్రయోజనమేమిటి'?అని ప్రశ్నించుకుంటే, భిన్నసమాధానాలు అన్నివాఙ్మయాల్లో నుండి వినిపిస్తాయి. సాహిత్యముఖ్యోద్దేశ్యం ఆనందప్రసాదమేననికాదు, సాహిత్యానికి ఒక పరమార్థం ఉంది, కేవలం ఆనందం దాని పరమావధికాదు, అసలు ఆనందంకాదు సాహిత్యం ఇవ్వాల్సింది, ఆత్మవికాసం, విజ్ఞానంఅని—కాదు, ఆనందప్రదాయిని అవుతూనే, అంతర్గతంగా నీతిబోధ చేయాలి సాహిత్యంఅని మరొకరు, ఇవేవీకాదు, 'కళ కళకోసమే' ప్రత్యేకంగా అది దీన్ని నిర్దేశించి చెప్పనక్కరలేదు, వీటంటిని చెప్పకుండానే చెప్పేటటువంటి వ్యక్తిత్వం దానికుంటుంది—అని ఒకరు, 'జీవన విమర్శే' సాహిత్యమని వేరొకరు, వీటంటిని సమన్వయించే ధోరణిలో—సాహిత్యం అన్నింటికి సంగమస్థానం, రసస్పందన కల్గిస్తుంది, తద్వారా, ఆనందోద్దీపనం చేస్తుంది, అదేకాలంలో, ఆత్మవికాసానికి, జీవనమాలిన్యక్షాళనకు ఉపయోగపడుతూ, చిరస్థాయియైన శ్రేయస్సును బోధిస్తూ, కళయొక్క విలువల్ని కోల్పోకుండా, నిలబడగలగటమే హిహిత్యంయొక్క ముఖ్యోద్దేశం, అని మరికొందరు, ఇలా రకరకాలుగా సాగుతాయికాని, రాను, రాను సాహిత్యంలో, ముఖ్యంగా కవిత్వంలో వచ్చిన మార్పులనుబట్టిచూస్తే కవిత్వానికి తప్పక ప్రయోజనం ఉండాలని, Instruc-rion, Enlightenment' ముఖ్యమని, అసలు కవిత్వం ద్వారానే సామాజికవిప్లవం రావాలని, తేవాలని, తద్వారానే సుఖప్రదమైన బ్రతుకు భవిష్యత్తులో స్థాపించగలమని అందరూ నమ్మతున్నట్లు కన్పిస్తుంది. నీతిబోధలు చేయటానికి, సామాజికమైన కుళ్ళు గడగటానికి (కవిత్వపు విలువలు కోల్పోకుండా) కవికి హక్కుఉంది. కేవలం నీతిబోధలే కవిత్వంకాదు. కవి మతబోధకునియొక్క, రాజకీయవాదియొక్క స్థాయికి వచ్చినప్పుడు, అతనిలోని కళాకారుడు చనిపోతాడు. అందుకే తిలక్ అన్నది

'అగ్నిచల్లినా, అమృతం కురిసినా
అందం, ఆనందం దాని పరమావధి,'
దీనితోబాటు

'ఆదేశం అంతర్గతంగా ప్రవహించునది'అని ఉండవలసింది. కవిత్వపువిలువలు, కళాస్థాయి, వదలుకోకుండా నువ్వేదైనా చెప్పవచ్చు—ఇలాకాక

కవి, నీతిబోధకుని స్థానం ఆక్రమించుకుంటే పూర్తిగావచ్చే ప్రమాదమేమిటో తెలుసుకోవాలంటే ఈ 'సుహృద్గీత' చదివితే తెలుస్తుంది.

నిజానికి కవి, నరేంద్రచంద్, తన్ను ఉన్నతమైన స్థానంలో ఊహించుకుని—కృష్ణునిలా, నరులకు, సుహృద్గీత ప్రవచించారు. బాగుంది, కవి అలా అనుకోవటంలోనూ, చేయటంలో తప్పు లేదు. కాని ఇది సూచ్యమై, ధ్వనిపూర్వకమైతే ఉత్తమకావ్యం ఆవిర్భవించివుండేది. దీనిలో 39 ఖండికలున్నా, చివరి ఎనిమిది తప్పించి, మిగతావి కేవలం భిన్నశీర్షికలు కల్గివున్నా, లోలోపలి ఉద్దేశ్యం ఒకటే. అది గీతాబోధ. ఈ గీతను బోధించటంలో కవి తాను కృష్ణునిగా ఎంచుకున్నాడేతప్ప, కవిగాను, ముఖ్యంగా కళాకారునిగాను మరచిపోయారు. ఈ పరిస్థితిలో కవిత్వం ఆవిరై నీతిబోధ మిగిలింది. ఒక సిద్ధాంతానికి బానిసై కవిత్వంరాస్తే, దాని ప్రభావం తప్పక రచయిత మీద ప్రతిఫలిస్తుంది. దృక్కును సంకుచితం, అంటే ఆ సిద్ధాంతంమేరకే పరిమితంచేసే ప్రమాదం లేకపోలేదు.

ఆశయం చాలా పెద్దది.
'నిర్మలమైన స్నేహం కావాలి
నిండు హృదయాలు కావాలి
ఏ వైపు చూచినా శాంతి పెత్తనం చేయాలి'

'సకల మానవ సమానత్వం
సకల మానవ సౌభ్రాతృత్వం
నీలో మూర్తీభవించుకో'
'మంచితనం తరుగనీకు
వ్యక్తిత్వం వదులుకోకు
మలినతను పెరుగనీకు'
అని మానవులకుపదేశం.

గతాన్ని చూస్తూ ఏడ్చేవాళ్ళకి. భవిష్యత్తులో కలలు పేర్చుకునే వాళ్ళకి ఓ ములుగర్ర—

'గడచిపోయిన నిన్ననుజూచి
నిట్టూర్పు విడుస్తూ
గడవనున్న రేపునుజూచి
ఆశలను పేరుస్తూ
గడుపుతున్న నేటిని ఎందుకు
ఊరక వృథా చేస్తావ్'
'అర్థం కాదోయ్ ముఖ్యం
నీ జీవితానికో సార్థకత'
సార్థకత ఎప్పుడు?
'మలినతలేని మనసే నీదైతే
నిన్ను నీవు విమర్శించుకో
నీవు మానవుడవో, దానవుడవో'

ఇలా కావ్యమంతా మంచి, మంచి భావాలైతే కానవస్తాయి కాని, చదువుతున్నంతసేపు తన్మయతగాని, రసావేశంగాని పొంగవు. అసలు కవిత్వం చదువుతున్నామా అన్న అనుమానం కలుగకపోదు! కవి తాను ప్రవక్తస్థానం ఆక్రమించితే వచ్చే ప్రమాదం ఇదేమరి! అయితే ఇందులో కృత్రిమత లేదు. నటనలేదు. నిజాయితీ ఉంది. ఉదాత్తమైన భావాలున్నా, కవిత్వపరమైన కృషిగాని, సాధనగాని జీవితానుభవంగాని, శిల్పంగాని లేకపోవటంవల్ల— ఈ ప్రమాదం ప్రాప్తించింది.

ఉదాత్తమైన నీతిబోధచేస్తూ, మళ్లీ తనే నరునికి జీవితంలో 'శాక్యం' అలవర్చుకోమని చెప్పటం బాగులేదు.

'నీ వాడే.........
దాహంతో కోరే యింతిని
సౌమ్యంగా అనుభవించటం
పాపం ఎన్నటికీ గాదు—'

ఇలా ఉన్నాయి—

విట్‌మన్‌నిగాని శ్రీశ్రీనిగాని వంటపట్టించుకోవటం పాపంగాదు. అందరిని జీర్ణించుకుని తన వ్యక్తిత్వం తను నిర్మించుకొన్ననాడే కవి మనగలడు. భాష విషయంలోనూ ప్రారంభదశ; ముఖ్యంగా కొన్ని పదాల విషయంలో—'కుల్లి' అంటాంగాని, 'కృళ్లి' అనం—ఇలా—అయినా రెండు పదులు నిండని నరేందర్‌చంద్ ముందు పరిశ్రమించి నిజమైన కవిత్వాన్ని ఆవిష్కరించగలడని ఆశిద్దాం—

కె. శివారెడ్డి.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by Radhakrishna at the Andhra Patrika Press, 6 & 7, Thambu chetty Street, Madras-1.
Editor : S. Sambhu Prasad.